వీక్షణం

ఆర్థిక, సామాజిక పత్రిక

సెప్టెంబర్ 2005 50 రూ. 10


- మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితి - ఫోకస్
- పాత్రికేయులు వార్తాహరులా? చాడీకోరులా?
- సంస్కరణల ఫలితాలే రైతుల ఆత్మహత్యలు
- కోర్టు తీర్పులు - న్యాయ మూర్తుల సైద్ధాంతిక అవగాహన
- ఆదివాసులపై దాడులు
- చరిత్రలో నిషేధాలు

'సత్యాన్ని చాటే పుస్తకాల్ని

నిషేధించగలరు గాని

సాక్ష్యంగా బతికే

ప్రపంచాన్ని ఏం చేస్తారు?'



(అమెరికాలో ఉంటున్న తెలుగు సాహిత్యాభిమాని జయప్రకాశ్

ఆగస్ట్ మూడోవారంలో వేసిన చార్‌కోల్ చిత్రం. ఇంటర్నెట్ సౌజన్యంతో)

సలహా మండలి:
ప్రొ॥ ఆర్.వి.ఆర్.చంద్రశేఖరరావు
ప్రొ॥ వకుళాభరణం రామకృష్ణ
ప్రొ॥ చక్రధరరావు
కాత్యాయని
బి.సాంబశివరాజు

గౌరవ సంపాదకులు:
ఎ.బి.కె. ప్రసాద్
ప్రధాన సంపాదకులు:
వి. హనుమంతరావు
వర్కింగ్ ఎడిటర్:
ఎన్. వేణుగోపాల్

విడి ప్రతి: రు. 10
వార్షిక చందా: రు.120

వీక్షణం

ఆర్థిక , సామాజిక పత్రిక

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చి అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

50 సెప్టెంబర్ 2005

సంపాదకీయం

గుడ్‌గాంవ్ నేర్పుతున్న పాఠాలు

ఢిల్లీ శివార్లలోని గుడ్‌గాంవ్ ఒకప్పుడు దేశంలో విస్తరిస్తున్న పారిశ్రామికీకరణకు చిహ్నం. అక్కడ చిన్నవీ పెద్దవీ దేశీయ పెట్టుబడిదార్లవీ బహుళజాతి సంస్థలవీ ఎన్నో పరిశ్రమలు పుట్టుకొచ్చాయి. అటువంటి గుడ్‌గాంవ్ మన దేశ పారిశ్రామికీకరణకు మాత్రమే గాక, ప్రపంచీకరణ దశలో పారిశ్రామికవేత్తలు కోరుకుంటున్న అపరిమిత పీడనా స్వాతంత్ర్యానికీ, కార్మికులకు దక్కని కనీస హక్కులకూ కూడ చిహ్నంగా మారబోతోంది.

గుడ్‌గాంవ్‌లో జూలై 25న హోండా మోటర్‌సైకిల్స్ అండ్ స్కూటర్స్ ఇండియా లిమిటెడ్ దగ్గర కార్మికులపైన జరిగిన పోలీసుదాడి, ఆ తర్వాత రెండు మూడు రోజులపాటు కార్మికుల మీదా, ప్రజలమీదా పోలీసులు జరిపిన బీభత్సకాండ టెలివిజన్ తెరలమీద చూసి దేశం గగ్గోలు పెట్టింది. బ్రిటిష్ వలసపాలకుల రోజుల్లోని జలియన్ వాలాబాగ్ హింసాకాండతో పోల్చి చూసింది.

ఆ వివరాలలోకి పోనక్కరలేకుండానే, హోండా కార్మికులు ఏ సమస్యల మీద పోరాడారో, బహుళజాతి సంస్థ యాజమాన్యంతో వారికి ఘర్షణ ఎక్కడ ప్రారంభమై ఎట్లా పరిణమించిందో. మన పాలక వర్గాలు ఎట్లా ప్రతిస్పందించాయో చూస్తే గుడ్‌గాంవ్ ఘటన గురించి నేర్చుకోవలసిన పాఠాలేమిటో తెలుస్తాయి.

ప్రపంచీకరణ క్రమంలో కార్మిక చట్టాలను మారుస్తామని, అంటే కార్మికులకు సౌకర్యాలు, హక్కులు లేని ఒక చీకటి కొట్ల కార్ఖానా వ్యవస్థను మళ్ళీ ఏర్పరుస్తామని, అందువల్ల ఆ అవకాశాన్ని వినియోగించుకొని ఇక్కడికి వచ్చి పెట్టుబడులు పెట్టమని మన ప్రభుత్వాలన్నీ బహుళజాతి సంస్థల పాదాల దగ్గర సాగిలపడి, బతిమిలాడి పిలిచాయి. ఆ ఆహ్వానాన్ని మన్నించి, తమకు అప్పనంగా భారత కార్మికుల నెత్తురు చెమటా చౌక ధరకు దొరుకుతాయని, వాటిని ఎంత పిండుకున్నా అడిగే వారెవరూ ఉండరని లొట్టలు వేస్తూ పరుగెత్తుకొచ్చిన బహుళజాతి సంస్థలలో ఒకటి హోండా.

కాని ఆలా ఏర్పడిన సంస్థలో ఒక నాటికి కాకపోతే ఒకనాటికయినా కార్మికుల సమస్యలు వారు సంఘటితం కావడానికి దారి తీశాయి. ఐదు సంవత్సరాలపాటు యాజమాన్యం కార్మికులు సంఘటితం కావడాన్ని అడ్డుకున్నా, చివరికి ఒక కార్మిక సంఘం ఏర్పడింది. ఆ కార్మిక సంఘ నాయకత్వాన్ని ఉద్యోగాలనుంచి తొలగించాలని, కార్మికులందరి దగ్గరి నుంచి 'సత్ప్రవర్తన పూచీ పత్రాలు' తీసుకోవాలని యాజమాన్యం ప్రయత్నించడంతో సమస్య తీవ్రమైంది.

అసలు, ప్రపంచీకరణ - సరళీకరణలలో భాగంగా ప్రజా సంక్షేమ, కార్మిక అనుకూల చట్టాలన్నిటినీ తొలగించడమో. సవరించడమో చేస్తామని అన్ని పాలక పక్షాలు అంగీకరించినప్పుడే ఈ పరిణామాలకు బీజం పడింది. అందువల్లనే ఇప్పుడు కూడా మన కార్మికులపై, విదేశీ యాజమాన్యం సహకారంతో, మన పోలీసులు జరిపిన ఈ దుర్మార్గాన్ని ఖండించి, బహుళజాతి సంస్థపై చర్యలు తీసుకునే బదులు విదేశీ పెట్టుబడి ప్రవాహం ఎక్కడ ఆగిపోతుందోననే భయాందోళనే ప్రధానమైపోయింది. విదేశీ పెట్టుబడిదారులకు ఎక్కడ కోపం వస్తుందోనని బుజ్జగించడానికే పాలక పార్టీలన్నీ ప్రయత్నించాయి.

ప్రపంచీకరణ దుర్మార్గాన్ని బయటపెట్టిన గుడ్‌గాంవ్ దాడితోనయినా ఈ దేశంలో ప్రపంచీకరణ వ్యతిరేక శక్తులన్నీ ఐక్యం కావలసిన అవసరాన్ని గుర్తించవలసి ఉంది.

లోపలి పేజీల్లో...

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష సామాజిక, ఆర్థిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

ఉత్తరాలు:

'**వీక్షణం**' బాగుంటున్నది. చాలా విషయాల మీద మంచి విశ్లేషణ ఇస్తున్నారు. అయితే సాహిత్య ప్రక్రియలకు, ముఖ్యంగా కవిత్వానికి స్థానం ఇవ్వకపోవడం బాగా లేదు. కనీసం సంవత్సరానికి ఒకసారయినా పూర్తిగా సాహిత్యానికే పరిమితం చేసి ప్రత్యేక సంచిక వేస్తే బాగుంటుంది.

- జూలూరి గౌరీశంకర్
హైదరాబాద్

'**వీక్షణం**' పత్రిక చాల బావుంటుంది. దాన్ని అలాగే కొనసాగించండి. పక్షపత్రికగా ఉండి మాసపత్రికగ మారిందా? సామాజిక విలువల పతనం (సంపాదకీయం), ఎన్ వేణుగోపాల్ గారి వోక్స్‌వాగెన్ - డబ్బు లాగెన్ విధాన విమర్శ వ్యాసం, జి.హరగోపాల్ గారి పునరుక్తి, జూనియర్ డాక్టర్ల సమ్మెపై రాసిన మానవీయ విలువలకోసం పోరాటం వ్యాసం ఎంతో ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. పత్రిక కలం, దాని వెల సహేతుకంగా ఉండేటట్టు చూడండి.

-సి.హెచ్. గణపతి
పెందుర్తి

'**వీక్షణం**' విడిప్రతి వెల రు.10 కాగా, సంవత్సర చందా రు.150 ఉండడంపై మిత్రులు, పాఠకులు ప్రశ్నలు సంధించారు. ఈ ఖాళీని పూరించేందుకు పాఠకులకు, చందాదారులకు ఆ విలువకు కొన్ని పుస్తకాలు పంపాలని గతంలో నిర్ణయించాం. కాని ఆ ప్రతిపాదన కూడ ఆచరణ సాధ్యం కాదని తేలడంతో చందాను రు.120కి తగ్గిస్తున్నాం. గతంలో రు.150 పంపిన వారికి అదనంగా మరో మూడు నెలలు వీక్షణం పంపిస్తాం. ఇక నుంచి సంవత్సర చందా రు. 120గా గుర్తించగలరు

- సం.

వీక్షణం ఆర్థిక, సామాజిక పత్రిక
సమతా పబ్లికేషన్స్
సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చ్ అండ్ కమ్యూనికేషన్
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 025. ఫోన్ : 040 - 55843495
ప్రింటర్స్ : చరితా ఇంప్రెషన్స్, అజామాబాద్, హైదరాబాద్.

పాత్రికేయులు వార్తాహరులా? చాడీకోరులా?

- ఎ.బి.కె. ప్రసాద్

సుప్రసిద్ధ న్యాయమూర్తి జస్టిస్ చిన్నప్పరెడ్డి కొన్నేళ్ళ క్రితమే ఎందుకొచ్చిందో అనుమానం - ఇంతకూ మనం కోరుకునే ప్రజాస్వామ్యం ఎలా ఉండాలో అందరూ ఆలోచించుకోవలసిన సమయం వచ్చిందన్నారు. మనం ఆశించే ప్రజాస్వామ్యం, ఆచరించే ప్రజాస్వామ్యం రాజ్యాంగానికి బద్ధమై ఉండాలా లేదా? ఉండే పక్షంలో రాజ్యాంగ ఆదేశాలను, సామాజిక, ఆర్థిక రంగాలలో సామాన్య మానవుల జీవితాల్ని మెరుగుపర్చడానికి ఉద్దేశించిన ఆదేశిక సూత్రాలను తూ.చ. తప్పక అనుసరించాలా అక్కర్లేదా, అన్న ప్రశ్నలమీదనే ప్రజాస్వామ్యం నిర్వచనం జరగాలన్నారాయన.

చిన్నప రెడ్డి ఈ ప్రశ్నను, ప్రపంచ ప్రసిద్ధ భాషా శాస్త్రవేత్త, ప్రపంచ ప్రజా ఉద్యమాలకు నేటిదాకా బాసటగా నిలబడుతూ ఆంగ్లో అమెరికన్ సామ్రాజ్యవాద పాలకుల్ని, వారి దురాక్రమణ చర్యల్ని ఎండగడుతూన్న ప్రొఫెసర్ నోమ్ చామ్‌స్కీ కన్నా చాలా ముందుగానే వేశారు. చిన్నపరెడ్డి మాదిరే చామ్‌స్కీ కూడా, వర్తమాన రాజకీయాల్లో ప్రచార, ప్రసారమాధ్యమాల (మీడియా) పాత్ర మనకు ఓ సవాలు విసురుతోందన్నాడు.

ఏమిటది? "అసలు మనం ఏ రకమైన ప్రపంచంలో, ఏ రకమైన సమాజంలో నివసించాలనుకుంటున్నాం? మరీ ముఖ్యంగా ప్రజాస్వామ్యం అంటే ఏ రకమైన అర్థంలో మనం ఈ సమాజాన్ని ప్రజాస్వామిక సమాజంగా రూపుదిద్దుకోవాలని కోరుకుంటున్నాం?" అని ఒక మౌలికమైన ప్రశ్నను లేవనెత్తాడు. అంతేగాదు, ప్రసారమాధ్యమాల్ని కంట్రోల్ చేయాలనుకునే పాలక వర్గాలు సాగించే రాజ్య ప్రచారాన్ని ప్రశ్నించకుండా సమర్థించే విద్యావంతులున్నపుడు, ఆ ప్రచారం నుంచి వీసమెత్తుకూడా ఇతరులు విభేదించడానికి రాజ్యపాలకులు నసేమిరా అనుమతించనప్పుడు రాజ్య ప్రచారం సమాజం మీద దారుణంగా ఉంటుందని చామ్‌స్కీ అన్నాడు. ఎందుకంటే ఇదేదో కొత్త విషయం కాదని, గతంలో హిట్లర్ నియంత, అనేకమంది ఇతరులు అనుసరించిన పద్ధతులవల్ల వచ్చిన అనుభవం అన్నాడు. ఈ పద్ధతులకు ఈ రోజుకీ 'ఆటవిడుపు' లేదన్నాడు. 'ప్రజా సంబంధాల' వ్యవస్థను ఆ పేరు చాటునే అమెరికా దాన్నొక పరిశ్రమగా అబద్ధాల పరిశ్రమగా మార్చేశారనీ, ఇంతకూ ఈ "ప్రజా సంబంధాల పరిశ్రమ" పనంతా ప్రజల మనస్సుల్ని ఆలోచించనివ్వకుండా అదుపు చేసుకుంటూ పోవడమే నన్నాడు చామ్‌స్కీ!

మన దేశంలోగానీ, మన రాష్ట్రంలోగాని పరిస్థితులు ఈ వైపుగానే సాగుతున్నాయా? సాగకూడదనే ప్రజాస్వామ్య వాదుల వాంఛ, ఆకాంక్షాను. నిజానికి అలాంటి పద్ధతులు తలెత్తకుండా చూడాలన్న తహతహ ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల కమిషన్ నూతన అధ్యక్షుడు గౌరవ న్యాయమూర్తి జస్టిస్ సుభాషణ్ రెడ్డిలో కూడా ఉండ బట్టే తన వంతు ధర్మంగా 'విరసం' నాయకుల (రచయితల) అరెస్టులకు సంబంధించి పత్రికా వార్తలు చదివినంతనే, ఎవరూ మానవ హక్కుల పరిరక్షణా సంఘానికి ఫిర్యాదు, రిట్ రూపంలో దాఖలు చేసుకోకముందే, వార్త ఆధారంగా 'సుమాటో' నోటీసును రాష్ట్ర ప్రభుత్వ పోలీసు అత్యున్నతాధికారులకు పంపాల్సి వచ్చింది.

అన్నింటికన్నా ముఖ్యమైన విషయం - ఆ నోటీసును పంపుతూ అందులో అరెస్టు కారణాలను, సుప్రీంకోర్టు ఇలాంటి ఒకానొక కేసులో ఇలాంటి సందర్భాల్లో పోలీసులు, చాలా విధిగా

పత్రికలతోనూ, పాత్రికేయులతోనూ యుద్ధ ప్రాతిపదికపైన అవాంఛనీయమైన స్పర్ధను పెంచుకోవడం పాలకులకు మంచిదికాదు.

పాటించాల్సిన ధర్మాన్ని పేర్కొంటూ ఇచ్చిన ఆదేశాలను ఎందుకు పాటించలేదో జస్టిస్ సుభాషణ్ రెడ్డి రెండు అర్థాలకు తావులేకుండా ఖచ్చితంగా కోరడం. ఇందుకు న్యాయమూర్తిని మనసారా అభినందించాలి. ఎందుకంటే, గతంలో రాష్ట్రంలో జరిగిన పెక్కు ఎన్‌కౌంటర్ హత్యల విషయంలో తప్పుడు సాక్ష్యాలతో జాతీయ మానవ హక్కుల సంఘం ముందుకు కొందరు పోలీసు అధికారులు హాజరైనప్పుడు కమిషన్ నానా చివాట్లు పెట్టడం, కొన్ని సందర్భాల్లో నష్టపరిహారం చెల్లించమని ఆదేశించడం తెలిసిన విషయమే.

ఇప్పుడు జస్టిస్ సుభాషణ్ రెడ్డి తీసుకున్న నిర్ణయం రాష్ట్ర చరిత్రలో ఒక ప్రధానమైన, ప్రజాస్వామికమైన మలుపునకు నాంది కాగలదని ప్రజాస్వామ్య వాదులంతా ఆశిస్తారు. గతంలో జస్టిస్ చిన్నప్పరెడ్డి కూడా ఒక ప్రధానమైన తీర్పులో రచయితలను భావతీవ్రతకు, భావాలు కలిగి ఉన్నందుకు, అభిప్రాయాల్ని బలంగా ప్రకటించినందుకూ వేధించడం, అరెస్టు చేయడం రాజ్యాంగ విరుద్ధ చర్యేగాక, ప్రజాస్వామ్య విరుద్ధమైన పరిణామమని శంకించవలసివచ్చిందని మరువరాదు. ఇందుకు దాఖలాలుగా

ఆయన వివిధ దేశాల రాజ్యాంగ చరిత్రలనుంచి, అనుభవాల నుంచి ఉదాహరణలిచ్చారు ఆ తీర్పులో.

విప్లవ రచయితల సంఘం నాయకుల అరెస్టు "తనకు బాధాకరంగా ఉంద"ని గౌరవ ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి కూడా ప్రకటించి ఉన్నందున ఆ సద్భావాన్ని జస్టిస్ సుభాషణ్ రెడ్డి అదేశాల దృష్ట్యా ఆచరణలోకి అనువదించగలరని ఆశిద్దాం!

అంతేగాదు, సమస్యను ఇంతటితో ఆపకుండా ఇప్పుడు ప్రజాస్వామ్య వ్యతిరేక ధోరణి కాస్తా అధికార యంత్రాంగం పాత్రికేయులదాకా పాకించడం, విప్లవ రాజకీయ పక్షాలు, ఇతర విద్యార్థి, సాంస్కృతిక కళారంగాలకు చెందిన సంస్థలపైన నిషేధం విధించిన అనంతరం పాత్రికేయుల్ని సంబంధిత వార్తలు రాయకూడదని, అజ్ఞాతవాసంలో ఉన్న నాయకుల ఇంటర్వ్యూలు చేయకూడదని శాసించడం దురదృష్టకర పరిణామం.

దేశ ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు 1975 నాటి "ఎమర్జెన్సీ" కాలంనాటి దారుణానుభవాలు చాలా ఉన్నాయని ఈ సందర్భంలో మరవరాదు. ఆనాడు వార్తలపైన, పత్రికలపైన ప్రీ సెన్సార్‌షిప్, సెన్సార్‌షిప్ విధించిన కారణంగా, బీట్ కానిస్టేబుల్స్ సహితం పత్రికా వార్తల్ని ఎడిట్‌చేసే స్థితికి వచ్చిన ఫలితంగా - దేశ పాలకులు దేశంలో ఏం జరుగుతోందో తెలుసుకోలేని దుర్గతిలో పడిపోయారు. "చెవికొరుకుడు"కి అలవాటుపడిన నాయకత్వం చెవులకు గూఢచారి వర్గాలు చాటలు కట్టి లేనిది ఉన్నట్టు, ఉన్నది లేనట్టూ "చాడీలు" చెప్పిన ఫలితంగా సత్యాసత్యాల వివేచనను, విచక్షణను కోల్పోయిన నాయకత్వం పూర్తిగా ప్రజలనుంచి వెలిపడి పోయింది. పాలక పక్షం రాజకీయంగా దెబ్బతినిపోయింది. ఫలితంగా ఎమర్జెన్సీ అనంతరం జరిగిన ఎన్నికల్లో ఘోర పరాజయం చవిచూడాల్సి వచ్చింది. ఈ పరిణామం పత్రికలమీద కత్తికట్టి "చాడీ కోర్ల"మీద ఆధారపడినదాని ప్రత్యక్ష ఫలితమని మరువరాదు. పత్రికా వార్తలపై సెన్సారింగ్, పాత్రికేయుల మీద నిర్బంధం నీలి నీడలు లేకుండా ఉండి ఉంటే - దేశ నాయకత్వానికి పరిణామాల చిత్రం ఎప్పటికప్పుడు కళ్లకు కట్టినట్టు ఉండేది. ఎటు తిరిగీ తుది నిర్ణయాలు పాలకులవే గనుక, కనీసం ఎక్కడ తప్పు జరుగుతుందో కొంచెం సేపైనా ఆలోచించడానికి వీలుండి ఉండేది.

ఈ పాఠాల్ని పాలకులందరూ గుణపాఠంగా భావించాలి. పౌరుల అనుభవంలోకి ఇప్పటికింకా సమాచార హక్కును పొందే చట్టం అమలులోకి రానే లేదు. అది రాకముందే పాత్రికేయులకు రాజ్యాంగం కల్పించిన హక్కును (భావప్రకటనా స్వేచ్ఛ) కాలరాచేపనీ, వారు జరిపే ఇంటర్వ్యూలపై ఆంక్షలు పెట్ట జూడడమూ, రాజ్యప్రయోజనాలకే చేటుతెస్తుందని సకాలంలో గుర్తించాలి. పాలక వర్గానికి శత్రువర్గం ఏం చేస్తోందో, ఏ రకమైన ఆలోచన, ఆచరణా వ్యూహం, ఎత్తుగడలు రూపొందబోతున్నాయో పత్రికా వార్తల ద్వారా, ఇంటర్వ్యూల ద్వారా తెలుసుకోవడం ద్వారానే పాలకులు ప్రతి వ్యూహాలు రూపొందించుకోవడానికి, ప్రజా ప్రయోజనాలకు నష్టం కలగని రీతిలో ప్రతిస్పందించడానికి వీలు కలుగుతుందని గుర్తించాలి.

ప్రపంచ వ్యాపితంగానే ఈ పద్ధతి అమలులో ఉంది. అంతేగాని ఇందుకు ప్రతిగా పాత్రికేయుల్నే "చాడీకోరులు"గా (ఇన్‌ఫార్మర్లు) పనిచేయాలని కోరడంగాని, ఆశించడంగానీ ప్రజాస్వామిక భావనేకాదు, చౌకబారు రాజనీతిగా ప్రజలు భావిస్తారు. వందల, వేల కోట్ల రూపాయల ధనం ప్రజలు యిచ్చింది ప్రజా సమస్యలను, పాలకులతో కలిసి ఆచరణలో సామాన్య ప్రజల ప్రయోజనాల రక్షణకు పోలీసు యంత్రాంగాన్ని సమాయత్తం చేయడం కోసమే గాని అటూ ఇటూ "చాడీకోర్ల" వ్యవస్థను నిర్మించుకోమని కాదు, పాత్రికేయుల్ని కూడా "చాడీకోర్లు"గా మార్చుకోమనీ కాదు!

"చాడీకోర్ల" వ్యవస్థకూ, సమాచారం వెల్లడికీ ప్రెస్ కమిషన్ వ్యతిరేకత

యుద్ధరంగంలో పరస్పరం మోహరించివున్న శక్తులతో లేదా వారి రాజకీయ నాయకులతో, సైనికాధికారులతో పత్రికలు ఇంటర్వ్యూలు జరపడమూ, నిషేధిత పక్షాలతో ఇంటర్వ్యూలు జరపడమూ ప్రపంచ దేశాలకూ, పత్రికా రంగానికీ కొత్తకాదు. క్రిమియా యుద్ధకాలం నుంచీ రెండో ప్రపంచ యుద్ధం ముగిసేవరకూ లేదా రష్యా, చైనాల అంతర్యుద్ధ దశల్లోనూ, విప్లవ దశల్లోనూ, నిషేధపు దశల్లోనూ - విదేశీ స్వదేశీ పాత్రికేయు లెందరెందరో ఆయా సంబంధిత రంగాల ప్రముఖులతో ప్రత్యేక ఇంటర్వ్యూలు జరిపారు. ఆ దేశాల నాయకులు పిచ్చివాళ్లయి విలేకరుల్ని అనుమతించలేదు - వైరి పక్షం అభిప్రాయాలు, వ్యూహాలు, ఎత్తుగడలు పాత్రికేయుల రచనల ద్వారా తెలుసుకునేందుకు అలా అనుమతించారు.

ఎక్కడ దాకనో అక్కర్లేదు- ఇదే ఆంధ్రప్రదేశ్‌లో నిషేధం ఉన్న కాలంలోనూ, లేని దశల్లోనూ ఎందరెందరో అమెరికా, యూరప్‌లకు చెందిన విలేకరులు తెలంగాణా సాయుధ పోరాట కాలంలోనూ, పీపుల్స్‌వార్ పోరాట దశల్లోనూ నాయకులతో ఇంటర్వ్యూలు నిర్వహించుకు పోయారు. అవి ఆనాటి పాలకుల ప్రతి వ్యూహ రచనకు తోడ్పడకపోలేదు! అలాంటి ఇంటర్వ్యూలలో ఒకటి - ప్రపంచ ప్రసిద్ధ ఆర్థిక వేత్తలలో ఒకరు, ఆసియా దేశాల ఆర్థిక స్థితిగతుల్ని బేరీజు వేస్తూ మూడు సంపుటాలలో 'ఏషియన్ డ్రామా' మకుటంపైన విశ్లేషించిన డాక్టర్ గున్నార్ మిర్డాల్ కొడుకు, పాత్రికేయుడైన యాన్ మిర్డాల్ చేసిన ఇంటర్వ్యూ. 'పీపుల్స్‌వార్', జనశక్తి నాయకులతో జరిపిన ఇంటర్వ్యూల, పరిశీలనల సారాంశమే ఆయన రాసిన 'ఇండియా వెయిట్స్' అన్న ప్రసిద్ధ

గ్రంథం. నేపాల్‌లో నిషేధం ముమ్మరంగా ఉండగానే అక్కడి మావోయిస్టు పార్టీ నాయకులతో సుదీర్ఘమైన ఇంటర్వ్యూలు జరిపిన డచ్ పాత్రికేయురాలు లీ-ఆనెస్టో. ఈమె 'డిస్పాచెస్ ఫ్రమ్ నేపాల్ పీపుల్స్‌వార్ ఫ్రంట్' అన్న పేరుతో ఓ పుస్తకం ప్రకటించింది. రష్యన్ అంతర్యుద్ధం, విప్లవ దశలను వివిధ కాలాల్లో కరతలామలకం చేసుకున్న సుప్రసిద్ధ బ్రిటిష్ పాత్రికేయుడు జాన్ రీడ్ ఎన్నో ఇంటర్వ్యూలు జరిపినవాడు. ప్రసిద్ధ అమెరికన్ పాత్రికేయుడు విలియం హింటన్ చైనా విప్లవ దశలకు ప్రత్యక్ష సాక్షిగా ఉండి పరిణామాలను, అగ్రనాయకులతో ఇంటర్వ్యూలను అక్షరబద్ధం చేసి ప్రపంచ దేశాల ప్రజల్ని "ఇనుపతెరకు" ఆవలి వైపున ఏముందో కమ్యూనిస్ట్ చైనా గురించి తెలివిడి చేసిన మొట్ట మొదటి పాత్రికేయుల్లో ఒకరు. అలాగే రచయితలు స్మెడ్లీ, అన్నాలూయిూస్ట్రాంగ్, అనటోల్ ఫ్రాన్స్, హోవార్డ్ ఫాస్ట్ వగైరా కూడా! వీళ్ళందరి కన్నా యుద్ధరంగం లేదా విప్లవ దశల్లో వార్తలు, ఇంటర్వ్యూలు ఎలా రాయాలో ఎలా పంపాలో తెలుసుకోడానికి ఆద్యుడు నోబెల్ బహుమాన గ్రహీత "ది వోల్డ్‌మాన్ అండ్ ది సీ" రాసిన హెమింగ్వే, యుద్ధ రంగ వార్తల్ని నిషేధాల మధ్యనే ఇంటర్వ్యూల రూపంలో, వార్తల రూపంలో అక్షర బద్ధం చేసి "డిస్పాచెస్ ఫ్రమ్ వార్ ఫ్రంట్" లేదా కరెస్పాండెన్స్ ఫ్రమ్ వార్‌ఫ్రంట్ పేరుతోనే ప్రచురించాడు.

ఇదిలా వుండగా, పాత్రికేయుడి సమాచారానికి ఆకరాలు లేదా ఆధారాలు తెలుసుకోవాలన్న తహతహ పాఠకుల్లో కన్నా పాలకుల్లో ఎక్కువ ఉండడానికి, పాత్రికేయుల్ని వేధించడానికి ప్రధాన కారణం- పాలనా ప్రయోజనాలు, పదవీ రాజకీయాలూనని ప్రసార మాధ్యమాల నిపుణులు తేల్చారు! ఒక దేశంలో ఒక పౌరుడు విశ్వాసం ఉంచి పాత్రికేయుడికి కీలక సమాచారం అందచేస్తే దాన్ని పాత్రికేయుడు సమాచారం యిచ్చిన వ్యక్తి విశ్వాసానికి భిన్నంగా వ్యవహరిస్తే శిక్షార్హుడవుతాడు, అదే మరో చోట వెల్లడించక పోతే శిక్షార్హుడవుతాడు! ఈ రెండో పద్ధతిని మన దేశ పాలకులు "పోటా" ద్వారా సాధించచూచి వెల్లకిలాపడ్డారు. "కాశ్మీర్ టైమ్స్" పాత్రికేయుడు జిలానీ కేసుతో- ఆరోపితుడైన నేరస్థుడు ముఖాన గుడ్డ కప్పుకున్నట్లు పాలకుల ముఖాలు వాడిపోయి వాలిపోయాయి! పోలీస్ కస్టడీలో సాగే హత్యలు/మరణాలు డజన్లకొద్దీ ఉంటున్నాయి. ఇందుకు ఉదాహరణ "డి.కె. బసు - పశ్చిమ బెంగాల్" కేసులో సుప్రీంకోర్టు 1997లో యిచ్చిన చరిత్రాత్మక తీర్పు. నసాళానికంటే ఇలాంటి తీర్పులు "అశోక్‌జైన్ - యు.పి." కేసులోనూ మరికొన్ని కేసుల్లోనూ వెలువడ్డాయి. (1997 క్రిమినల్ లా జర్నల్, 743 (20). సుప్రీమ్‌కోర్ట్; 1997(1) సుప్రీమ్, 416; 1996 (8) సుప్రీమ్ 581; 1996(4) క్రైమ్స్ 233, సుప్రీమ్)

ఈ బసు కస్టడీ హత్య గురించిన కేసులో తీర్పు చెబుతూ నాగరిక ప్రపంచం తలదించుకునే పద్ధతిలో దేశంలోని పోలీసులు వ్యవహరిస్తున్నారని కోర్టు చీవాట్లు పెట్టింది; మన దేశంలోగాని, రాష్ట్రంలోగాని ఏ ఘట్టంలోను పోలీసులు తప్పు చేస్తే ఆ తప్పును ఒప్పుకొన్న ఒక్క ఉదాహరణ కూడా లేదు. కాగా, నిన్నగాక మొన్న లండన్‌లో జరిగిన దుర్మార్గపు బాంబు పేలుళ్ళ ఘటన సందర్భంగా నేరస్థులను గాలించే సందర్భంలో మెంజీస్ అనే బ్రెజిలియన్ అమాయక పౌరుణ్ణి అన్యాయంగా కాల్చి చంపినందుకు లండన్ మెట్రోపాలిటన్ పోలీసు బాహాటంగా మొదటిసారిగా ప్రజలకు క్షమాపణ చెప్పింది. ఈ పరిణామంపై వ్యాఖ్యానిస్తూ "గార్డియన్" పత్రిక ప్రసిద్ధ వ్యాఖ్యాత సిమన్ హాటెన్‌స్టోన్ యిలా అన్నారు:

వందల, వేల కోట్ల రూపాయల ధనం ప్రజలు యిచ్చింది ప్రజా సమస్యలను, పాలకులతో కలిసి ఆచరణలో సామాన్య ప్రజల ప్రయోజనాల రక్షణకు పోలీసు యంత్రాంగాన్ని సమాయత్తం చేయడం కోసమే గాని అటూ ఇటూ "చాడీకోర్ల" వ్యవస్థను నిర్మించుకోమని కాదు, పాత్రికేయుల్ని కూడా "చాడీకోర్లు"గా మార్చుకోమనీ కాదు!

"లండన్‌పోలీస్ కమిషనర్ ఇయాన్ బ్లెయిర్ నాయకత్వాన పారదర్శకతలో ఒక నూతన శకం ఆవిష్కరించుకుంది. ఎందుకంటే, ఇంతవరకూ పోలీస్ కస్టడీలో ఉండగా పౌరుడు చనిపోయినందుకు పోలీసులు, ఏనాడూ బేషరతుగా క్షమాపణ చెప్పిన ఉదంతమే లేదుగనుక" అని! ఇక మనదేశంలోనూ, మన రాష్ట్రంలోనూ 59 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా అలాంటి మంచి సంప్రదాయం ఇంతవరకూ నెలకొనలేదు. పైగా పౌరుల అరెస్టులకు సంబంధించిన దేశ చట్టాలనేకాదు, అంతర్జాతీయ ఒప్పందాలను కూడా యథేచ్ఛగా పోలీసులు ఉల్లంఘిస్తున్నారు. అంతర్జాతీయ సంధి (కవెనెంట్) లోని 9వ అధికరణ (2), 10వ అధికరణ ఒక వ్యక్తిని అరెస్టు చేసేటప్పుడు అరెస్టుకు గల కారణాలను స్పష్టం చేయడమేగాక, అభియోగాలుకూడా నిర్దిష్టంగా ఉండాలని, అధికారుల ప్రవర్తన మర్యాదకరంగా ఉండాలని, మానవత్వంతో ఉండాలని ఆదేశించాయి.

ఇదిలా వుండగా భారత ప్రెస్ కౌన్సిల్, సర్కారియా కమిషన్, రెండవ ప్రెస్ కమిషన్ నివేదికలు - పాత్రికేయుడ్ని నీకు సమాచారం ఎలావచ్చింది, ఎవరిచ్చారు, నీ ఆధారం (సోర్స్) చెబుతావా లేదా అని వేధించే హక్కు లేదని తెగేసి చెప్పాయి; ఒకవేళ సమాచారం ఆధారాన్ని చెప్పవలసి వస్తే అది ఒక్క న్యాయమూర్తి కోరినప్పుడు మాత్రమే ఆయనపై విశ్వాసం ఉంచి చెప్పాలి తప్ప మరెవరికీ వెల్లడించాల్సిన అవసరం లేదని ఇవి స్పష్టం చేశాయి. అదికూడా, పాత్రికేయుడు తన సమాచారానికి ఆధారం వెల్లడించకూడదను

కున్నప్పుడు అరెస్టుకు సిద్ధమై ఆ పనిచేయవచ్చని కూడా పేర్కొన్నాయి.

వివిధ దేశాల్లో....

వివిధ దేశాల్లో పాత్రికేయుల విషయంలో ఆయా చోట్ల పత్రికారంగ సంస్థలు "పాత్రికేయులు తమ సమాచార అధారాలను (సోర్సెస్) కాపాడుకోవాలని, సమాచారం అందచేసిన వారిపేర్లను బయటపెట్టరాదని, ఇది పాత్రికేయ వృత్తి విశ్వసనీయమైన నైతిక బాధ్యత" అనీ నిర్ద్వంద్వంగా ప్రకటించాయని సర్కారియా కమిషన్ వెల్లడించింది. పాత్రికేయులు "చాడీకోర్లు"గా (ఇన్‌ఫార్మర్లు) పనిచేయడాన్ని సర్వత్రా ఏవగించుకుని నిరసించడం జరిగింది.

బ్రిటన్, డెన్మార్క్, ఫిన్లాండ్, ఇజ్రాయెల్, న్యూజిలాండ్, నార్వే, పోలెండ్, జర్మనీ, ఫ్రాన్స్, అమెరికా, ఇండియాలలో "సమాచార భద్రతను" వృత్తి నైతిక ధర్మంగా పాటించే సంప్రదాయం వుంది. అలాగే "ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా" కూడా పాత్రికేయ వృత్తి నైతిక విలువలకు సంబంధించి రూపొందించిన మార్గదర్శకాలలోని ఒకటవ భాగం (పార్ట్ - 1) కూడా ఒక విశ్వసనీయమైన వ్యక్తి / వ్యక్తులు ఆధారంగా తనకు సమాచారం అందివచ్చినప్పుడు సమాచారం యిచ్చిన వ్యక్తి విశ్వాసాన్ని గౌరవించి వ్యవహరించడం విలేకరి/జర్నలిస్టు బాధ్యత అని స్పష్టంచేసిందని మరచిపోరాదు. అంతేగాదు, ప్రెస్ కౌన్సిల్ చట్టం (1978)లోని సెక్షన్ 15 (2) ప్రకారం ఏదైనా పత్రిక, లేదా న్యూస్ ఏజన్సీ, ప్రచురించే వార్తలు లేదా సమాచారం ఎక్కడినుంచి / ఎవరినుంచి వచ్చిందో ఆధారం వెల్లడించాలని ఆ పత్రికను / న్యూస్ ఏజన్సీని / దాని సంపాదకుడ్ని / లేదా పాత్రికేయుడ్ని ప్రెస్ కౌన్సిల్ వత్తిడి చేయడానికి వీల్లేదని నిర్దేశించింది. (దాలవీ వర్సస్ "ది హిందూ" కేసు, మద్రాసు, 1990 నవంబర్ 5)!

ఇదిలా ఉండగా, రెండవ ప్రెస్ కమిషన్ (1982) కూడా వార్తల ప్రచురణకు సంబంధించి సమాచారం అందించిన వారికి పాత్రికేయునిపై ఉండే విశ్వసనీయతకు సంబంధించి ప్రస్తావిస్తూ ఇలా స్పష్టం చేసింది. "జర్నలిస్టుకు సమాచారం ఇచ్చిన వ్యక్తి తనపేరు జర్నలిస్టు బయటపెట్టడన్న విశ్వాసంపైన మాట నమ్మకంపైన మాత్రమే హెచ్చు సమాచారం అందజేస్తాడు. ఆ నమ్మకాన్ని కాపాడలేరని మరుక్షణం నుంచి జర్నలిస్టుకు సహజంగా అందివచ్చే సమాచారం తాలూకు ఆధారం కాస్తా ఊడ్చుకుపోతుంది. ప్రజలకు అందకుండా మరుగున పడిపోయే తప్పుడు పనులను పత్రికలు బహిర్గతం చేస్తాయి. పత్రికలకు నిరంతరం విశ్వసనీయమైన సమాచారం అందించడంలో ప్రజా ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయని మరవరాదు. అందువల్ల, పత్రికల సమాచార మూలాలు, ఆధారాలు ఎన్నటికీ వట్టిపోరాదు."

అత్యంత అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే పాత్రికేయులు, అదీ న్యాయమూర్తి కోరిన పక్షంలో మాత్రమే, న్యాయమూర్తిని విశ్వసించినప్పుడు మాత్రమే తమ సమాచారం ఆధారాలను వెల్లడించవచ్చని రాజేంద్ర మాథుర్, ఎస్.ఆర్.ముఖర్జీ, హెచ్.కె. పరంజపె, ఇష్రత్ అలీ సిద్ధికి అభిప్రాయపడ్డారు. సమాచారాన్ని వెల్లడించాలని ఆదేశించే హక్కు ఒక్క న్యాయమూర్తికి తప్ప పాలనా వ్యవస్థలో మరే విభాగానికి (ప్రభుత్వం/పోలీసులతో సహా) లేదని ప్రెస్ కౌన్సిల్ స్పష్టం చేసింది! అయితే భారత "లా కమిషన్" 1983లో కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన 93వ నివేదికలో భారత సాక్ష్య చట్టం (1872)లో "సెక్షన్ 132-ఎ"లో ఈ క్రింది ఆదేశాన్ని చేర్చాలని సిఫారసు చేసింది:

"132-ఎ సెక్షన్ ప్రకారం ఏ ప్రచురణలోనైనా ప్రకటించిన సమాచారానికి ఆధారం వెల్లడించాలని ఏ న్యాయస్థానం వ్యక్తుల్ని కోరరాదు. ఎందుకంటే, సమాచార ఆధారాన్ని వెల్లడించకుండా కాపాడతాడన్న విశ్వాసంపైన, అలాంటి ఒప్పుదలపైననే సదరు సమాచారం లభించిందన్న విషయాన్ని గమనించాలి" అని లా కమిషన్ పేర్కొన్నది. అయినా, పాత్రికేయుల్ని తమకు అందివచ్చిన సమాచారాన్ని రాయరాదని, పత్రికలు ప్రచురించరాదనీ, పాత్రికేయులు పోలీసులకు వేగులవాళ్లుగా "చాడీకోర్లు"గా ఊడిగం చేయాలని కోరడం, నిర్బంధించడం ప్రజాస్వామిక ప్రాథమిక విలువలకు విఘాతమని ఎమర్జెన్సీ కాలం నాటి అనుభవాల దృష్ట్యానైనా గ్రహించి, పునరాలోచన చేయడం సమరసమైన వాతారణం ఏర్పడడానికి, పత్రికలతోనూ, పాత్రికేయులతోనూ యుద్ధ ప్రాతిపదికపైన అవాంఛనీయమైన స్పర్ధను పెంచుకోడం పాలకులకు మంచిదికాదు.

ప్రెస్ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు జస్టిస్ పి.బి సవంత్ (1996 మార్చి 23) సమాజంలో పత్రికల పాత్ర గురించి వివరిస్తూ ఇలా అన్నారు: "ప్రజలు భిన్న అభిప్రాయాలు చూసుకుని ఏ భావధార, లేదా ఏ అభిప్రాయం సరైనదో తెలుసుకుని నిర్ణయానికి రావడానికి సమాచార స్వేచ్ఛా స్రవంతి, భావ స్వేచ్ఛ అవసరం. ప్రజలకు ఏం జరుగుతోంది, ప్రజల చుట్టూ ఏ పరిణామాలు ఘటిల్లుతున్నాయి, తమను ప్రభావితం చేస్తున్న ఘటనలు, చేయబోయే పరిణామాలేమిటి ప్రజలు తెలుసుకునేలా ప్రజల్లో చైతన్యం కల్గించడం పత్రికల ధర్మం, ప్రజల తరపున అవి ఆందోళన చేయడం వాటి, విద్యుక్త ధర్మమూ. ఈ ధర్మ ప్రవర్తన అధికారంలో ఉన్న వారిని అదుపులో ఉంచడానికి తోడ్పడుతుంది, మంచి దారిలో పెడుతుంది. అన్ని రకాల పరిణామాలకు పత్రిక అనేది సామాజిక అద్దం. దురదృష్టవశాత్తు, పత్రికా స్వేచ్ఛ అనేది ఒక వ్యక్తి స్వేచ్ఛ హక్కు మాత్రమే గాక, వ్యక్తుల భావ ప్రకటనా హక్కు మాత్రమే గాక, ప్రధానంగా ఈ హక్కు సమాచారం పొందగోరుతున్న మొత్తం సమాజం హక్కు అన్న వాస్తవాన్ని మరిచిపోవడం జరుగుతోంది." ❑

కోర్టు తీర్పులు - న్యాయమూర్తుల సైద్ధాంతిక అవగాహన

- దిగుమర్తి నరసింహారావు

ప్రజాస్వామ్యంలో అతిముఖ్యమైన మూడు అంగాలలోను న్యాయ వ్యవస్థకు ఒక ప్రత్యేకత వున్నది. చట్ట సభలలో ఏవేనా, పొరపాట్లు, తప్పులు దొర్లితే వాటిని సవరించడానికి అవకాశం వుంది. చేసిన శాసనాలకు సవరణలు చేయవచ్చు. ప్రజలకు ఇబ్బంది కలిగించే షరతులు, అధికరణాలు ఉపసంహరించవచ్చు, లేదా సందర్భాన్ని, పరిస్థితులను బట్టి, కొన్ని అంశాలను మరింత పటిష్టం, కఠినతరంగాని చేయవచ్చు. అలాగే కార్యనిర్వాహక వర్గం వంటి పరిపాలనా వ్యవస్థలో క్రింద స్థాయి ఉద్యోగులు, అధికార్లు, పొరపాటుగాని తప్పుడు నిర్ణయాలు చేస్తే, వాటిని సరిదిద్దడానికి, వారిపై స్థాయి ఉద్యోగులకు అధికార్లకు అవకాశం వుంది. ఉన్నతాధికార్లు పొరపాట్లు చేస్తే మంత్రిమండలి వాటిని సరిదిద్దవచ్చు. అలాగే న్యాయ వ్యవస్థలో కింద న్యాయస్థానాలు, అంటే, జిల్లా మునసబు, మేజిస్ట్రేటు, సబ్‌కోర్టు, జిల్లా కోర్టులు ఇచ్చిన తీర్పులు సముచితంగా లేవని భావిస్తే, పై కోర్టులు అంటే జిల్లా కోర్టులకు, హైకోర్టులకు, సుప్రీమ్ కోర్టుకు సరిదిద్దే అధికారం వుంది.

సుప్రీమ్ కోర్టు పొరపాటు తీర్పు యిచ్చినా, అమలులో ఉన్న చట్టాలను విపరీత వ్యాఖ్యానాలు చేసినా, వాటిని సరిదిద్దే నాథుడు లేడు. ముఖ్యంగా లిఖిత రాజ్యాంగం ఉన్న భారత్, అమెరికా సంయుక్త రాష్ట్రాల వంటి దేశాలలో, ఆ రాజ్యాంగ అధికరణాలకు సుప్రీమ్ కోర్టు న్యాయమూర్తులు ఇచ్చే వివరణలు, వ్యాఖ్యానాలు రాజ్యాంగ రచయితల భావనలకు, రాజ్యాంగ స్ఫూర్తికి చాలా భిన్నంగా వున్నా ఆ తీర్పులను ప్రజలు శిరసావహించవలసిందే. అది తప్పైనా, ఒప్పైనా, ఎవరూ ఏమి చేసేది లేదు. కొన్ని సందర్భాలలో సుప్రీమ్ కోర్టుకు ఉన్న ఈ అధికారం చాలా వైపరీత్యాలకు దారితీయవచ్చు.

ఈ మధ్యన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు, ఆర్.టి.సి. ఉద్యోగస్తుల, కార్మికుల సమ్మె సందర్భంలోను, అలాగే జూనియర్ డాక్టర్ల సమ్మె విషయంలోను తీసుకున్న వైఖరి అంత సముచితంగా లేదు. న్యాయస్థానాల విధులు చాలా పరిమితమైనవి. అవి అమలులో ఉన్న చట్టాలలోని వివిధ అంశాలకు వ్యాఖ్యానం చేయడం, అది విచారణలో వున్న కేసులో, అధికారులు సముచితంగా అమలు చేశారో లేక విపరీతంగా అమలు చేశారో నిర్ణయించి, అది విపరీతంగా చట్ట ఉద్దేశ్యానికి భంగకరంగా వున్నప్పుడు, ఆ నిర్ణయాలను కొట్టి వేయడం జరుగుతుంది. ఒక్కొక్కప్పుడు చట్టంలోని అంశాలు, అధికారులు సరిగ్గానే అంచనా వేసినా, అసలు చట్టంలోని అంశాలే రాజ్యాంగ అధికరణాలకు, సూత్రాలకు భిన్నంగా వున్నాయని, న్యాయమూర్తులు భావిస్తే, ఆ చట్టాలు, శాసనాలలో ఏ అంశాలు అయితే రాజ్యాంగ ఉద్దేశ్యానికి భిన్నంగా ఉన్నాయో వాటిని రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించి, వాటిని కొట్టివేయడానికి వారికి అధికారమున్నది. హైకోర్టు తీర్పును సుప్రీమ్ కోర్టులో అప్పీలు దాఖలు చేసుకోవచ్చు. కాని సుప్రీమ్ కోర్టు తీర్పు శిరసావహించ వలసిందే.

కాని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, ఆర్.టి.సి. కార్మికుల సమ్మె విషయంలోను, జూనియర్ డాక్టర్ల సమ్మె విషయంలోను, సమ్మె చేస్తున్న వారి మధ్య, యాజమాన్యానికి లేదా ప్రభుత్వానికి మధ్య మధ్యవర్తిగా 'తుని తగువు' తీర్చినట్లుగా వ్యవహరించడం జరుగుతున్నది. బహుశా ఈ హైకోర్టు న్యాయమూర్తులు దీనిని 'జుడీషియల్ ఏక్టివిజమ్' (న్యాయవ్యవస్థ చొరవ)గా భావించారేమో. ఇటువంటి వివాదాస్పద చర్యలు ఒక్క ఆంధ్రప్రదేశ్ హైకోర్టే తీసుకోలేదు. కొన్ని నెలల క్రితం కలకత్తా హైకోర్టు ప్రజా ప్రదర్శనలను నిషేధించింది. ఇటువంటి నిషేధం న్యాయస్థాన పరిధిలోకి గాని, విధులలోకిగాని, బాధ్యతలలోనికి గాని రాదు. ఇది కార్యనిర్వాహక వర్గం, పరిపాలనా వ్యవస్థ, ముఖ్యంగా పోలీసు శాఖ తీసుకోవలసిన నిర్ణయం. అటువంటి నిషేధం విధించడానికి, రాజ్యాంగ పరంగా ఆ శాఖలకు అధికారం ఉందా లేక పరిస్థితులు, సందర్భాలు బట్టి అటువంటి నిర్ణయం సముచితమో, కాదో చట్టంతో అ శాఖలకు యిచ్చిన అధికారాలని బట్టి నిర్ణయించడం వరకే హైకోర్టుకు ఉన్న అధికారం. మరికొన్ని మాసాల కింద కేరళ హైకోర్టు ఒక సందర్భంలో ఆ రాష్ట్రంలో ఏదో రాజకీయ పార్టీయో, సంస్థో రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తే, బంద్ చేయరాదని ఉత్తర్వు చేసింది. బంద్‌ను గాని, సమ్మెను గాని చట్ట వ్యతిరేకమని ప్రకటించి, తగిన చర్యలు తీసుకోవలసింది కార్యనిర్వాహక వర్గం, పరిపాలనా వ్యవస్థ, కాని హైకోర్టులు కావు. అయితే ఈ కలకత్తా, కేరళ హైకోర్టులలో ఏక న్యాయమూర్తి నిర్ణయాలు, వాటిని తరువాత ఆ హైకోర్టు బెంచీలు సరిదిద్దాయి. కాని హై కోర్టు బెంచీలు సరిదిద్దక ముందు, ఆ ఏక న్యాయమూర్తి నిర్ణయాల మీద ప్రజాభిప్రాయం రుసరుసలాడింది.

ఈ ఉన్నత న్యాయస్థానాలు, కేవలం కార్యనిర్వాహక వర్గం, పరిపాలనా వ్యవస్థలకు సంబంధించిన విషయాలలోనే, వాటికి నేరుగా సంబంధం లేక పోయినా, జోక్యం చేసికొని, తీర్పులు యివ్వడం జరగలేదు. హైకోర్టు, సుప్రీమ్ కోర్టు తీర్పులకు, ఉత్తర్వులకు, ఆజ్ఞలకు తాహతు, విలువ ఉన్నాయి. అందుచేత ఇలాంటి తీర్పులు యిచ్చేముందు ఈ ఉన్నత కోర్టులు, తమ

అధికారం గురించి, ఒటికి రెండు మార్లు ఆలోచించి తీర్పు యివ్వడం మంచిది. అయితే చాలా సందర్భాలలో 'విస్సన్న చెప్పిందే వేదం' అన్న రీతిలో వ్యవహరించడం పరిపాటి అయిపోయింది.

ఈ మధ్యన జార్ఖండ్ శాసన సభలో, ముఖ్యమంత్రికి, ఆయనకు మద్దతు యిస్తున్న యితర రాజకీయ పక్షాలకు, మెజారిటీ వుందో లేదో తేల్చడానికి, ఆ సభ స్పీకరు ఒక తేదిని నిర్ణయిస్తే, దానిమీద కొందరు సుప్రీమ్ కోర్టులో ప్రజా ప్రయోజన దావా దాఖలు చేస్తే, సుప్రీమ్‌కోర్టు, స్పీకరు నిర్ణయించిన తేదీ కాకుండా, అంతకన్నా ముందే శాసన సభను సమావేశ పరచాలని, ఆ సభలో ముఖ్యమంత్రి తన మెజారిటీని నిరూపించుకోవాలని తీర్పు యిచ్చింది. ఈ తీర్పుపై, లోక్‌సభ స్పీకరు సోమనాథ చటర్జీ స్పందిస్తూ, ఇది చట్టసభల స్వాతంత్ర్యానికి సంబంధించినదన్న విషయం విస్మరించి, తన పరిధిలో లేని విషయంలో సుప్రీమ్ కోర్టు కలుగచేసుకొని, తీర్పు యివ్వడం రాజ్యాంగ అవహేళన చేయడమన్నట్లు వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థ, పార్లమెంటు వ్యవస్థ, కార్య నిర్వాహక వ్యవస్థ, ఎవరి పరిధులలో వారు సర్వస్వతంత్రులమని రాజ్యాంగంలోనే స్పష్టం చేయబడిందని, అందుచేత యీ విధంగా తమ పరిధిని అధిగమించి, పార్లమెంట్ వ్యవస్థ పరిధిలో జోక్యం చేసుకోవడం భావ్యం కాదని, సోమనాథ చటర్జీ అన్నారు. అంతేకాక, ఆ తీర్పును తిరుగదోడుతూ పూర్తి బెంచి సరిదిద్దితే బాగుంటుందని సలహా యిచ్చారు.

న్యాయమూర్తులు కూడా మానవ మాత్రులే. అందుచేత వారు కూడా అప్పుడప్పుడు పొరపాట్లు చేస్తూ వుంటారు. అలాంటి పొరపాట్లు జరిగినప్పుడు ఎప్పటికప్పుడు సరిదిద్దుకోవడం అవసరం. మిగతా న్యాయస్థానాల మాట ఎలావున్నా సుప్రీమ్ కోర్టుకు సంబంధించి దాని బాధ్యత అత్యధికం. ఎందుకంటే దాని తీర్పుపై అప్పీలు చేసుకోడానికి అవకాశం లేదు. అది తుది నిర్ణయం. అంతేకాదు. రాజ్యాంగ అధికరణాలకు, మిగతా అంశాలకు, దాని వ్యాఖ్యానం శిరోధార్యం. సాధారణంగా చట్టాలలోను, ఆఖరికి రాజ్యాంగానికి సంబంధించిన అధికరణాలు, సెక్షనులలో వాడిన భాష ఎంత జాగరూకతతో, కచ్చితంగా వాడడం జరిగినా, ఆయా అంశాలను సంకుచిత దృష్టితో గాని, ఉదారంగా గాని అర్థం చేసుకోవచ్చు. అది న్యాయమూర్తులకు చెందిన సామాజిక ప్రవృత్తిని బట్టి వుంటుంది. కొందరు న్యాయమూర్తులు చాలా సాంప్రదాయవాదులుగా (కన్‌సర్వేటివ్) మరికొందరు చాలా ఉదారంగా (లిబరల్‌గా) వాళ్ళ నైజం బట్టి, వారి సిద్ధాంతపర అవగాహన బట్టి ఈ చట్టాలలో అంశాలను అర్థం చేసుకొని, వాటిని వ్యాఖ్యానిస్తూ వుంటారు.

ఈ ఉన్నత న్యాయస్థానాలకు, అంటే హైకోర్టు, సుప్రీమ్ కోర్టుల న్యాయమూర్తులను రాష్ట్రపతి కేంద్ర మంత్రి మండలి సలహా మేరకు నియమిస్తారు. కేంద్ర మంత్రి మండలి అంటే, అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ ఐచ్ఛికంగాగాని, అనైచ్ఛికంగా కాని తమ ప్రయోజనాలకు అనుకూలంగా యిలాంటి సిఫార్సులు చేస్తూవుంటారు.

ఈ మధ్యన అమెరికా సుప్రీమ్‌కోర్టు న్యాయమూర్తులలో ఒక ఖాళీ ఏర్పడింది. అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగ ప్రకారం సుప్రీమ్ కోర్టుకు ఒకమారు ఒక న్యాయమూర్తిని నియమిస్తే ఆయన పదవీకాలం జీవితాంతం వరకు. ఆయన ఆరోగ్య రీత్యాకాని, యితర కారణాల వల్ల గాని ఐచ్ఛికంగా విరమిస్తే తప్ప సుప్రీమ్ కోర్టు న్యాయమూర్తులలో ఖాళీలు ఏర్పడవు. అమెరికా సుప్రీమ్ కోర్టు మొదటి నుంచి సాంప్రదాయపరుల, అంటే రిపబ్లికన్ పార్టీ కోటగానే వుండేది. అయితే రూజ్‌వెల్ట్ హయాంలో (ఆయన మూడు మార్లు వరుసగా డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిగా అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు) ఈ రిపబ్లికన్ సాంప్రదాయకోటను బద్దలు కొట్టారు. అంటే రిపబ్లికన్ అనుకూలురు కాకుండా కొంత ఉదార స్వభావంగల లిబరల్ న్యాయమూర్తులను సుప్రీమ్ కోర్టుకు ఖాళీలు ఏర్పడినప్పుడు నియమించారు. అప్పటినుంచి సుప్రీమ్ కోర్టును తమ స్వాధీనంలోకి తెచ్చుకోవాలని, ప్రతి రిపబ్లికన్ అధ్యక్షులు ప్రయత్నించారు. రెండవ ప్రపంచ సంగ్రామానంతరం అమెరికా అధ్యక్షునిగా రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి జనరల్ ఐసెన్ హోవర్ ఎన్నికయ్యారు. ఆయన తన పార్టీ సిద్ధాంతాలకు, అవగాహనకు అనుకూలంగా వుంటారనే ఉద్దేశంతో ఎర్ల్‌వారెన్‌ను అమెరికా సుప్రీమ్ కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. అయితే ఆయన ఆశించినట్లుగా కాకుండా, జస్టిస్ వారెన్ చాలా ఉదారంగా అమెరికన్ రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించడం ద్వారా సాంఘిక న్యాయం, సమానత్వం, ప్రజా హక్కులు కాపాడడానికి దోహదం చేశారు. "నేను యింత పెద్ద పొరపాటు చేస్తానని ఎప్పుడూ ఊహించలేద"ని ఐసెన్‌హోవర్ వాపోయారు. రిపబ్లికన్ అధ్యక్షుడు నిక్సన్ దక్షిణ రాష్ట్రాలకు చెందిన యిద్దరు ముదిరిన సాంప్రదాయపరులను సుప్రీమ్ కోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని చూశారు కాని, సెనెట్ వారిని, నిరాకరించింది. అయితే ఆయన విలియమ్ రెహెన్‌క్విస్ట్‌ను సుప్రీమ్ కోర్టు న్యాయమూర్తిగా నియమించగలిగారు. ఈ రెహెన్‌క్విస్ట్ నల్లజాతి వారిని స్పానిష్ అమెరికన్లను వోటింగ్, యితర సందర్భాలలో వ్యక్తిగతంగా బెదిరించడమే కాకుండా వారిని, వేరుగా ఉంచడం పాటించాలని ప్రచారం చేసారు. రీగన్ రిపబ్లికన్ అధ్యక్షుడు అయిన తరువాత రెహన్‌క్విస్ట్‌ను సుప్రీమ్ కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. అంతేకాకుండా ఆయనకన్నా ఛాందసులు (కన్సర్వేటివ్) అయిన ఏన్‌టానిన్ స్కాలియా, రాబెర్ట్ బోర్క్‌లను సుప్రీమ్ కోర్టు న్యాయమూర్తులుగా నియమించారు. అయితే వారిని డెమోక్రటిక్ పార్టీ మెజారిటీగా వున్న సెనెట్ నిరాకరించింది.

వారి స్థానంలో న్యాయమూర్తిని సాండ్రాడే ఓ కనార్‌ను నియమించి, మొట్టమొదటిగా సుప్రీమ్ కోర్టు న్యాయమూర్తిగా ఒక మహిళను నియమించిన ఘనతను సంపాదించారు. అయితే ఈమె కూడా చాలా ఛాందసురాలు, అంతేకాకుండా రెహన్‌క్వెస్ట్‌కు సన్నిహిత స్నేహితురాలు. బుష్ సీనియర్ డావిడ్ సూటర్‌ను, క్లారెన్స్ థామస్‌ను సుప్రీమ్ కోర్టు న్యాయమూర్తులుగా నియమించారు. వారిలో డావిడ్, న్యాయమూర్తులలో ఉదారులతో (లిబరల్సు) కలిసిపోయారు. క్లారెన్స్ థామస్ మీద లైంగిక నేరాల ఆరోపణలు వున్నాయి. అమెరికన్ సుప్రీమ్ కోర్టు తొమ్మిది మంది న్యాయమూర్తులలో యిద్దరినే డెమొక్రటిక్ అధ్యక్షులు నియమించగలిగినా, రిపబ్లికన్ పార్టీ, సుప్రీమ్ కోర్టును వామ పక్ష స్థావరంగానే పరిగణిస్తున్నది. దానికి ప్రధాన కారణం ఓ కొనార్ న్యాయమూర్తులు సమానంగా ఒక విషయంపై విభేదించినప్పుడు, ఆవిడ న్యాయశాస్త్ర సాంప్రదాయంగా 'ప్రెసిడెంట్' అంటే అటువంటి విషయంలో అంతకు ముందు సుప్రీమ్ కోర్టు తీర్పు ఆధారంగా తాము ఓటు చేసేవారు.

సుప్రీమ్‌కోర్టు నిర్ణయాల ద్వారా అమెరికా సమాజ ఆదర్శాలను అభివృద్ధి నిరోధ పథకంలో మార్చడానికి వీలు లేకపోతున్నదని రిపబ్లికన్ పార్టీ చింత చెందుతున్నది. అమెరికా అసలు సిసలైన రాజ్యాంగాన్ని రూజ్‌వెల్టు తొక్కి బెట్టారని, అందుచేత కన్సర్వేటివ్ న్యాయమూర్తుల నియామకం ద్వారా, నిజమైన రాజ్యాంగాన్ని పునరుద్ధరించాలని రిపబ్లికన్ న్యాయవేత్తల ఆశయం. ఇప్పుడు ఓకనార్ పదవి నుంచి విరమించుకొంటున్నారు. ఈ సదవకాశాన్ని ఉపయోగించుకొని సుప్రీమ్ కోర్టు, పూర్తిగా రిపబ్లికన్ సిద్ధాంతాలకు కట్టుబడి వుండేట్లు మలుచుకోవాలని రిపబ్లికన్ పార్టీ తాపత్రయం.

అమెరికా సంయుక్త రాష్ట్రాల సుప్రీమ్ కోర్టు, రిపబ్లికన్ పార్టీ వైఖరి ప్రస్తుతించడానికి కారణం, ఒకప్పుడు అటువంటి తప్పుడు ధోరణులు, భారతదేశంలో వ్యక్తమయ్యాయి. ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లనేరదని 1975లో అలహాబాద్ హైకోర్టు తీర్పు యివ్వడంతో, ఇందిరాగాంధీ, ఆమె అనుచరులు తీవ్రంగాను, విపరీతంగాను స్పందించారు. ఆమె వెనువెంటనే సుప్రీమ్ కోర్టుకు అప్పీలు చేసుకోవడమే కాకుండా, అప్పటి పార్లమెంటులో అమెకున్న మూడొంతులలో రెండొంతులు కన్నా ఎక్కువ మెజారిటీ సంఖ్యాబలాన్ని ఆసరాగా తీసుకొని, అత్యయిక పరిస్థితిని ప్రకటించి, ఆమెకు అనుకూలంగా తీర్పురావడానికి కొన్ని రాజ్యాంగ అధికరణాలకు సవరణలు చేయడం జరిగింది. అప్పుడే రాజ్యాంగ పీఠికలో సోషలిజం అన్న పదం కూడా చేర్చబడింది.

అదే సందర్భంలో 'కమిటెడ్' జ్యుడిషియరీ వుండాలన్న అభిప్రాయాన్ని ఇందిరాగాంధీ వ్యక్తం చేశారు. 'కమిటెడ్' జుడిషియరీ అంటే ఒక సిద్ధాంత అవగాహనకికట్టుబడి వుండాలని, ఆ సిద్ధాంత అవగాహనకు అనుకూలంగా వివిధ చట్టాలను, ముఖ్యంగా రాజ్యాంగాన్ని వివరించి వ్యాఖ్యానించడం అని అర్థం చేసుకోవాలి. అంతేకాదు ఉన్నత న్యాయస్థానాలలో హైకోర్టు, సుప్రీమ్ కోర్టులో ప్రధాన న్యాయమూర్తిని సీనియారిటీని బట్టి నియమించనవసరం లేదన్న అభిప్రాయం కూడా వ్యక్తం అయింది. అయితే ఆమె ప్రకటించిన అత్యయిక పరిస్థితికి వ్యతిరేకంగా దేశంలో ఒక వెల్లువలాగ ప్రజలు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్య నాయకుల ఆధ్వర్యంలో ఉద్యమించడం వలన, రెండున్నర సంవత్సరాల తరువాత అత్యయిక పరిస్థితిని ఉపసంహరించి, ఎన్నికలు జరిపించక తప్పలేదు. ఆ ఎన్నికలలో జనతాపార్టీ గెలిచి కేంద్రంలో మొరార్జీ దేశాయి ఆధ్వర్యాన జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడింది. అయితే ఆ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల కన్నా ఎక్కువగా పరిపాలించలేకపోయింది. తిరిగి ఎన్నికలు జరుపక తప్పలేదు. ఆ ఎన్నికలలో తిరిగి ఇందిరా గాంధీ, కాంగ్రెస్ -ఐ పార్టీ విజయం సాధించింది.

ఆ తరువాత ఇటువంటి అవాంతరాలు జరుగకుండా, సుప్రీమ్ కోర్టు, హైకోర్టులలో సీనియారిటీని బట్టి ప్రధాన న్యాయమూర్తి, ఎవరి జోక్యం లేకుండా, పదవిని చేబట్టే సాంప్రదాయం నెలకొంది. న్యాయమూర్తుల నియామకంలో కూడా కేవలం కేంద్ర మంత్రి మండలికే పూర్తి అధికారం లేకుండా సుప్రీమ్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఆయన తన తోటి సీనియర్ న్యాయమూర్తులతో సంప్రదించి, వారి సలహాలను కేంద్ర ప్రభుత్వానికి అందచేయాలని, దానిని దృష్టిలో పెట్టుకొని, ఉన్నత న్యాయస్థానాల న్యాయమూర్తుల నియామకం జరగాలన్న సంప్రదాయం కూడా స్థిరపడిపోయింది.

కొన్ని కొన్ని సందర్భాలలో, రాజకీయ పార్టీలు, వాటి నాయకుల ఆలోచనలు వెర్రి తలలు వేయబోయినా, దేశంలో ప్రజాస్వామ్య చిహ్నాలు బలంగా నాటుకుపోవడమే కాకుండా, వామపక్ష భావాలకు ఎంచదగిన స్థాయిలో గౌరవం సమాజంలో చేకూరడం వల్ల ఎక్కడికక్కడ అటువంటి వికృత పరిణామాలు ప్రజలు ఎదుర్కోగలిగారు. అంతేకాదు ఆవేశంతో శ్రీమతి గాంధీ కొన్ని తప్పటడుగులు వేశారంటే దేశంలోని అభివృద్ధి నిరోధక శక్తులు ఆవిడమీద సాగించిన దుష్ప్రచారం కూడా కొంత కారణం అని చెప్పవచ్చు. ఇటువంటి పరిణామాలు పునరావృతం అయ్యే అవకాశం లేకపోలేదు. వాజ్‌పేయి ప్రధానిగా ఎన్.డి.ఏ. ప్రభుత్వ పరిపాలనే అందుకు ఉదాహరణ. చరిత్రను తిరిగి రాయించడం లాంటి ప్రయత్నాలు అప్పుడు జరిగాయి. అందుచేత ప్రజలు చైతన్య వంతులై అప్రమత్తులై అవసరమైనప్పుడు, మితవాద, అభివృద్ధి నిరోధక, మతతత్వ శక్తులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. ❑

పారిశ్రామికీకరణ - మహిళల ఉపాధిపై దాని ప్రభావం

డా. ఎమ్. వనమాల

ఈ పరిశీలనా వ్యాసం వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లోని మహిళల ఉపాధి అవకాశాలను పారిశ్రామికీకరణ నేపథ్యంలో పరిశీలిస్తుంది. పారిశ్రామికీకరణ వల్ల వివిధ వర్గాల్లో, కులాల్లో 1990ల తర్వాత మారిన ఉపాధి స్వభావాన్ని చర్చిస్తుంది. సాధారణంగా పై కులాల ప్రజలు వివిధ రంగాల్లో, నైపుణ్యం, విద్యా, భూ ఆదాయం కలిగి ఉంటారు. గణాంక వివరాల్ని చూస్తే గ్రామంలో 1/3 వంతు నిరక్షరాస్యులుగానూ, 1/4 వంతు ప్రాథమిక విద్యను అభ్యసించినవారుగానూ ఉన్నారు. 1/3 వంతు 6 నుండి 10వ తరగతి వరకు చదువుకున్న వాళ్ళున్నారు. మహిళల అక్షరాస్యత శాతం చాలా తక్కువ. ఎస్.సి. బి.సి. మహిళల్లో ఎక్కువ శాతం నిరక్షరాస్యులు. దీన్ని బట్టి చూస్తే ప్రభుత్వాల మద్దతు ఉన్న బలహీన వర్గాలు సైతం విద్యాస్థాయిలో వెనుకబడి ఉన్నాయి.

అగ్రవర్ణాలకు చెందిన వారిలో ఎక్కువ మంది కార్మికులుగా, ఆపరేటర్లుగా పనిచేస్తున్నారు. ఆధునిక పరిశ్రమలవల్ల వచ్చిన ఈ తరహా ఉపాధి కొంతమేరకు ప్రయోజనకరంగా ఉన్నది. వెనుకబడ్డ కులాల్లో ఎక్కువ మంది ప్రజలు నైపుణ్యం లేనివారుగా ఉన్నారు. వ్యవసాయరంగంలో ఉపాధి పొందుతున్నవారు ప్రధానంగా ఎస్.సి.లు కాగా అగ్రవర్ణాల సంఖ్య తక్కువ. వ్యవసాయదారులుగా ఉన్నవాళ్ళలో అగ్రవర్ణాలు ఎక్కువ వుండగా ఎస్.సి.లు మూడవ స్థానంలో ఉన్నారు. గ్రామంలో ఉండే అగ్రవర్ణాలకు, బి.సి. వర్గాలకు భూపంపిణీ ఒక మేరకు లాభదాయకంగా ఉన్నది. సగటు ఆదాయ స్థాయికి ఎస్.సి.లు దిగువన ఉంటే అగ్రవర్ణాలు కొంత మెరుగ్గా ఉన్నారు. పరిశ్రమల్లో పనిచేసే మహిళల నిష్పత్తి 1 శాతం కంటే తక్కువగా వున్నది. పురుషుల జనాభా నిష్పత్తిలో పోల్చినప్పుడు స్త్రీల జనాభా తక్కువగా ఉన్నది. అందులో వికలాంగుల సంఖ్య ఎక్కువ. ఈ పరిశీలనకు ఉపయుక్తంగా ఉండే నేపథ్యం ఇది.

1970ల్లో వ్యవసాయరంగంలో మహిళల స్థానం ప్రధానంగా ఉండేది. ఇది 1979-99కి వచ్చేసరికి భూమి వ్యవసాయేతర రంగాలకు మారడం వల్ల వ్యవసాయంలో ఉపాధి పొందుతున్న మహిళల సంఖ్య తగ్గిపోయింది. పెద్ద ఎత్తున భూమి వ్యవసాయేతర రంగాలకు మారడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నది. ఈ అభివృద్ధి క్రమం సమాజంలోని వివిధ వర్గాల, కులాల ప్రజలపై, కింది కులాల ప్రజలపై ముఖ్యంగా మహిళలపై వేసిన ప్రభావాన్ని ఈ వ్యాసం పరిశీలిస్తుంది.

సాగు యోగ్యమైన భూమి ఇతర రంగాలకు మారడం వల్ల ఆ రంగంలో పనిచేసే కుటుంబాలు వడ్డీ వ్యాపారాన్ని ఆశ్రయించారు. వడ్డీ వ్యాపారం పారిశ్రామికీకరణ వల్ల పెరుగుతున్న పట్టణాల్లో జరిగే నిర్మాణాల (భవన)కు వనరుగా మారింది. ఈ తరహా వ్యాపార కార్యకలాపాలు వరకట్నం లాంటి సామాజిక సంబంధాల్ని సైతం ప్రభావితం చేస్తున్నాయి. అంతేకాకుండా వ్యవసాయ రంగంలో పనిచేసే అన్ని కులాల్లోని మహిళల ఉపాధిపై భూ అమ్మకాలు తీవ్రమైన ప్రభావాన్ని చూపాయి. వెనుకబడిన కులాల్లోని ఎక్కువ మంది మహిళలకు ఇతర రంగాల్లో నైపుణ్యం లేకపోవడం వల్ల ఉపాధి కరువై పరిశ్రమల్లో కార్మికులుగా ఉపాధి వెతుక్కోవాల్సిన అనివార్యపరిస్థితికి నెట్టబడ్డారు. అందువల్ల పరిశ్రమల్లో కూడా సంఖ్య పెరిగి ఉపాధి కరువౌతున్నది. అట్లాకాకుండా వ్యవసాయరంగంలోకి వెళ్ళడం వల్ల శ్రామికుల సంఖ్య పెరిగి పనిదినాలు తగ్గిపోతున్నాయి.

సాగు యోగ్యమైన భూమి కోల్పోవడం వల్ల భూమి కొందరి చేతిలోనే కేంద్రీకృతమై శాశ్వతకౌలుకు కారణమౌతున్నది. శాశ్వత కౌలువల్ల, అనేక కుటుంబాలు వ్యవసాయంలోకి రావడం వల్ల గరిష్ట పరిమితులను దాటి కట్టుబాటు కౌలు పెరుగుతున్నది. వ్యవసాయంలో దొరికే పరిమితమైన పనుల్లో సైతం మహిళా కూలీలు పక్క గ్రామాల్లోని కాంట్రాక్ట్ కూలీల పోటీని ఎదుర్కోవాల్సి వస్తున్నది. కాంట్రాక్ట్ కూలి పనిలో ఉండే పని గంటల పద్ధతి వల్ల పని రోజులు తగ్గిపోతున్నాయి. ఈ పోటీని ఎదుర్కోవడానికి గ్రామంలోని మహిళలు గ్రూపులుగా ఏర్పడుతున్నారు. ఈ గ్రూపులు గుత్త పద్ధతిలో వేతనాలు తీసుకుని పంచుకుంటాయి. వేతనం సగటున ఒక్కరికి 6 రూపాయలు ఉంటున్నది. రోజుకు 4 గంటల పని మాత్రమే లభిస్తుంది. ఈ పద్ధతి వల్ల వేతనాల తగ్గుదల క్రమేణా తీవ్రమౌతున్నది. వేతనాల తగ్గుదల గృహిణుల సంఖ్య పెరగడానికి కారణమౌతున్నది. తక్కువ వేతనాలకు పనికి పోవడం కంటే ఇంట్లో ఉండడం వల్ల నష్టపోయేదేముంటుందన్న భావన ఏర్పడుతున్నది. ఈ స్థితి దీర్ఘకాలంలో నైపుణ్యం కోల్పోయేలా చేస్తుంది.

వ్యవసాయ రంగంలో నిరుద్యోగం పెరగడానికి ఇంకో కారణం సాగుయోగ్యమైన భూమి ఉన్నప్పటికీ వ్యవసాయానికి పెట్టుబడుల

వ్యయం పెరగడం. మహిళలకు సైతం ఉపాధి తగ్గిపోతున్నది. ఇందువల్ల శ్రామికుల సంఖ్య పెరిగి పరిశ్రమలకు తక్కువ వేతనాలకు కార్మికులు దొరికే స్థితి ఏర్పడ్డది.

పనిదినాల తగ్గుదల తీవ్రత గ్రామీణ ప్రాంతాల్లో వృత్తి కులాలపై కూడా ఉన్నది. చాకలి వృత్తిలో పురుషులు ప్రవేశించడం వల్ల మహిళలకు పనిలేకుండా పోయింది. గ్రామాల్లోకి నల్లా సౌకర్యం రావడం ఈ మార్పుకు కారణం. మహిళల పనుల్లోకి పురుషులు రావడానికి నిరుద్యోగం కారణం.

ఇంకోవైపు కుటుంబ యూనిట్ల ఉత్పత్తి ప్రారంభమైంది. ఈ పద్ధతివల్ల మహిళలు తమ వ్యక్తిత్వాన్ని కోల్పోవాల్సి వస్తున్నది. రాళ్ళు కొట్టే పరిశ్రమలోకి మహిళలు రావడం ప్రారంభమైంది. నైపుణ్యం ఉన్నప్పటికీ మహిళలు కావడం వల్ల తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న మహిళల కంటే పరిశ్రమల్లో పనిచేస్తున్న వారి సంఖ్య పెరిగింది. మండల, జిల్లా, రాజధాని నగరాలకంటే గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి వెతుక్కోవడం ఎక్కువైంది. ఇక్కడ కూడా పురుషుల వేతనాలకంటే మహిళా కార్మికుల వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయి. మహిళలు వేతనాలు పెంచుకోవడానికి ఉన్న రంగాల్లో డైరీ పరిశ్రమ ముఖ్యమైనది. ఈ రంగంలో కొంతమేరకు మెరుగైన వేతనాలు లభిస్తున్నాయి. మహిళలకు పనిదినాల కొరత ఈ డైరీ పరిశ్రమలో సైతం వెంటాడుతున్నది. మొత్తం వ్యవసాయేతర రంగాలనుండి (పురుషులు, మహిళలకు కలిపి) వస్తున్న ఆదాయం మొత్తం గ్రామ ఆదాయంలో సగం. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయేతర రంగాల్లో పనిచేసేవారి ఆదాయాన్ని పరిశ్రమల ఆధారిత రంగాల్లో పనిచేసే వారి ఆదాయంతో పోల్చినప్పుడు రెండింతలు ఎక్కువగా ఉన్నది.

మొత్తం గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయేతర రంగాల్లో పనిచేసే మహిళల వేతనాలు పరిశ్రమల్లో పనిచేసే మహిళల వేతనాలకంటే వదిరెట్లు ఎక్కువగా ఉంటున్నాయి. దీన్నిబట్టి చూస్తే వ్యవసాయేతర రంగాల్లోకి మహిళలు వెళ్ళక తప్పని స్థితి ఏర్పడుతున్నదని అర్థమౌతున్నది.

ఇంజనీరింగ్ పరిశ్రమలు తక్కువ వేతనాలకు శ్రమను దోచుకుని ప్రపంచస్థాయి కంపెనీలుగా ఎదగాలని చూస్తున్నాయి.

కొత్తగా ఏర్పడుతున్న పరిశ్రమలు త్వరగా లాభాలు గడించాలన్న ఉద్దేశంలో అవివాహిత మహిళల్ని కార్మికులుగా చేర్చుకుంటున్నాయి. ఈ పరిశ్రమలు చాలా తెలివిగా తమ సంస్థాగత వ్యవహారాల్లో, సాంకేతిక పరిజ్ఞానంలో మార్పులు చేసి ఇన్ఫార్మలైజేషన్‌ను,

గృహిణులుగా మార్చడం

వివిధ కులాలపై వర్గాలపై పారిశ్రామికీకరణ ప్రభావం పెరుగుతున్న కొద్దీ గృహిణుల సంఖ్య పెరిగే క్రమం ప్రారంభమైంది. 1970ల్లో మొత్తం పనిచేసే వయసున్న మహిళల్లో 24 శాతం గృహిణులుండగా 1989కి వచ్చేసరికి 31 శాతానికి పెరిగింది. 1999లో 59 శాతానికి చేరింది. రిజర్వు సైన్యంగా మారి కుటుంబంలో స్త్రీ పురుష విభజన ఏర్పడ్డది. ఎక్కువమంది మహిళలు ఇంటి పనులకు, పిల్లల్ని చూసుకోవడం లాంటి పనులకు పరిమితమౌతున్నారు.

1970ల తర్వాత వచ్చిన పారిశ్రామికీకరణ తమ భర్తలకు స్థిరమైన ఆదాయాన్ని చేకూర్చడం వల్ల స్త్రీలు ఇళ్ళకే పరిమితమవుతున్నారు. 10 శాతం మహిళలు పిల్లలు చిన్నవయసులో ఉండడం వల్ల ఇళ్ళకే పరిమితమౌతున్నారు. 58 శాతం మహిళలు ఇంట్లో పని భారం వల్ల, కుటుంబ పెద్దల ఆజ్ఞలవల్ల ఇళ్ళకే పరిమితమౌతున్నారు.

37 శాతం అగ్రకులాల, వర్గాల మహిళలు ఇంట్లో ఉండడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. 4 శాతం మహిళలు మాత్రమే వ్యాపారం చేయాలని ఉన్నా ఆర్థిక వనరుల కొరతవల్ల చేయలేకపోతున్నారు. 7 శాతం మహిళలు తమ స్వంత భూమిలో పనిచేసుకోవడానికి ఇష్టపడతారు.

5 శాతం మహిళలు అనారోగ్య కారణాలవల్ల పనిచేయలేకపోతున్నారు. ఇవి భూస్వామ్య కుటుంబాలు లేదా అధికార వర్గాలకు దగ్గరగా ఉండే కుటుంబాలు. కొన్ని కులాల్లో కుటుంబ పెద్దలు మహిళలు బయటకు వెళ్ళడానికి అంగీకరించకపోవడం వల్ల బయటికి వెళ్ళలేకపోతున్నారు. ఆ కులాలు 1) భట్రాజులు, 2) గౌడ, 3) తమ్మలి, 4) పద్మశాలి, 5) గాండ్ల.

రోజువారి కార్మికులను (క్యాజువల్స్), మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడం లాంటి మార్పులు చేశాయి. ఈ పరిశ్రమల్లో మహిళల్ని చిన్న చిన్న పనులు చేసే కార్మికులుగా నియమించి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు.

అందువల్ల ఏ పరిశ్రమల్లో విధాన నిర్ణయాలు తీసుకునే స్థాయిలో, నిర్వహణాస్థానంలో మహిళలు ఉండరు. పురుషాధిపత్యం ఉండడం వల్ల వృత్తినైపుణ్యం ఉన్నప్పటికీ సరియైన వేతనాలు పొందటం లేదు. పరిశ్రమల్లో శిక్షణ పేరుతో కార్మికులను ఆపరేటర్లుగా మూడేళ్ళ ఒప్పందంతో పనిచేయించుకుంటున్నారని ఈ పరిశీలనలో వెల్లడైంది. వాస్తవానికి శిక్షణకాలం మూడు నెలలు

మాత్రమే. ఏళ్ళకేళ్ళు ఈ ఒప్పందం ద్వారా తక్కువ వేతనాలకు పనిచేయించుకుంటున్నారు. పరిశ్రమ మేనేజ్‌మెంట్ ఏ కారణం చూయించకుండా మూడేళ్ళ కాలాన్ని పొడిగించవచ్చనే రాతపూర్వక ఒప్పందం తీసుకుంటున్నారు. దాంతోబాటు కార్మికులు వివాహం అయినతర్వాత పరిశ్రమల్లోకి రావడం వల్ల, కుటుంబం ఉండడం వల్ల కలిగే సంతృప్తి పరిశ్రమలో ఉత్పత్తి పెరగడానికి కారణమయి పరోక్ష సబ్సిడీగా ఉంటుంది. ఈ స్థితి పరిశ్రమల యాజమాన్యానికి అనుకూలంగా మారి తక్కువ వేతనాలకుపనిచేయించుకోవడం, వ్యతిరేకతను మానసికంగా చంపడం చేస్తున్నాయి.

శిక్షణకాలంలో కనీస వేతనాలు ఇవ్వాలని చట్టం ఉండగా పరిశ్రమలు చట్టాల్ని తమకు అనుకూలంగా మార్చుకుని మొత్తం ఉత్పత్తికాలానికి దీన్ని అమలు చేస్తున్నారు. శిక్షణలో ఉన్న కార్మికులకు క్యాజువల్ కార్మికులకంటే తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు. అంతకంటే ముఖ్యంగా చట్ట ఉల్లంఘన జరుగుతున్నది పనిగంటల విషయంలో. చట్టం ప్రకారం వారానికి అదనపు పని గంటలు కలుపుకుని మొత్తం పని గంటలు 54 గంటలు. అదనపు పనిగంటలకు అదనంగా వేతనం చెల్లించాలని చట్టం చెబుతుంది. పరిశ్రమలు 54 గంటల పని పద్ధతిని పాటించినా అదనపు పని గంటలకు వేతనాలు చెల్లించడం లేదు. సాధారణంగా పరిశ్రమల్లో మూడు షిప్టులు పని పద్ధతి ఉంటుంది. సరియైన పరిసరాలు లేకపోవడం, రవాణా సౌకర్యాల లేమి, పౌష్టికాహార లోపం పరిశ్రమల్లోని కార్మికులను తీవ్రంగా వేధిస్తున్నాయి. పరిశ్రమల స్థితిగతులు ఏవీ పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున పరిశ్రమలకు సబ్సిడీలు ఇస్తున్నాయి. ఎప్పటికప్పుడు ప్రభుత్వాలు పరిశ్రమలకు అండగా ఉంటూ అనేక సౌకర్యాలు సమకూరుస్తున్నాయి. అంతేకాకుండా కార్మికుల ఆందోళనలపై ప్రభుత్వాలు, పోలీసులు, అణచివేత వైఖరి ప్రదర్శించడం పరిశ్రమల యాజమాన్యానికి అనుకూలంగా మారింది. ఉపాధి అవకాశాలలేమి, మారిన పరిస్థితుల, ధోరణుల నేపథ్యంలో మహిళలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపాయి. పరిశ్రమల యాజమాన్యం కార్మికులు సంఘటితం కాకుండా కొత్త కొత్త పద్ధతులను ఎంచుకుంటున్నది. గ్రూపులుగా చేయడం, తేలిక, క్లిష్టమైన పనులను విభజించడం, నిర్వహణా సిబ్బంది, ఫ్లోర్ కార్మికులను విభజన చేయడం లాంటి పద్ధతులు అవలంబి స్తున్నాయి. వీటితో బాటు గ్రేడింగ్‌పద్ధతి, ఎవాల్యువేషన్ పద్ధతులను, డిస్క్రిమినేటరీ ఇంక్రిమెంట్స్ ఇవ్వడం, కార్మికుల్లో విధేయత పెంచే పద్ధతులు పాటిస్తున్నాయి. కార్మికుల వ్యతిరేకతను ఎదుర్కోవడానికి కామన్ ఎగ్రిమెంట్ గ్రూపులను, ప్రమాణ నియంత్రణ గ్రూపులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పద్ధతులు కార్మికుల్లో అభద్రతా భావాన్ని పెంచుతున్నాయి. ఇక పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల ఆరోగ్యం, సామాజిక భద్రతల విషయంలో యాజమాన్యాలు పూర్తి నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. ముఖ్యంగా ఇ.ఎస్.ఐ., ప్రావిడెంట్ ఫండ్ (పి.ఎఫ్)ల విషయంలో అలక్ష్యం చేస్తున్నారు. సాధారణంగా ఇ.ఎస్.ఐ.ని కార్మికులు ఆశ్రయించిన సందర్భాలు చాలా తక్కువ. పి.ఎఫ్. చెల్లించడంలో యాజమాన్యాలు తీవ్రమైన జాప్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. కార్మికులకు సరియైన సామాజిక భద్రత ఏర్పరచడంలో కార్మిక సంఘాల పాత్ర ప్రధానమైనది. కార్మిక సంఘాలు పూర్తిగా బలహీన పడ్డాయి. ప్రభుత్వాలు, 'కార్మికుల భద్రత పరిశ్రమ బాధ్యత' సూత్ర ప్రాయంగా వల్లిస్తూ పరిశ్రమలకు సబ్సిడీలు ఇచ్చేటప్పుడు ఎటువంటి అభ్యంతరాలుగానీ, పని పరిస్థితులను, కార్మికుల జీవన ప్రమాణాలను పెంచాలన్న షరతులుగాని పాటించడం లేదు.

ఉపాధి కల్పన, గ్రామీణ పేదరిక నిర్మూలన వంటి పథకాలు రూపొందించి మహిళాభివృద్ధికోసం స్వయం సహాయక గ్రూపులను ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మద్దతున్న సంక్షేమ పథకాల్లో స్వర్ణజయంతి గ్రామ రోజ్‌గార్ యోజన పథకాలు స్వయం సహాయక గ్రూపులకు నిధులు సమకూర్చుతున్నాయి. అట్లాగే స్వయం సహాయక గ్రూపులు యూనిట్లుగా ఉండడం వల్ల బ్యాంకులు ఆర్థిక వనరులు సమకూర్చే అవకాశం ఉంటుంది. బ్యాంకు నిబంధనల ప్రకారం స్వయం సహాయక గ్రూపులు పొదుపు చేసిన మొత్తానికి 3 నుండి 4 రెట్లు ఎక్కువ రుణాలు మంజూరు చెయ్యాలి.

ఈ పరిశీలనలో వెల్లడైన వాస్తవం ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నది. స్వయం సహాయక బృందాలకు వాణిజ్య బ్యాంకులు ఇస్తున్న రుణాలకంటే మూడు నుండి నాలుగు రెట్లు ఎక్కువగా పొదుపు జమలు ఉంటున్నాయి. ఈ తరహా బ్యాంకు కార్యకలాపాలు స్వయం సహాయక బృందాల సభ్యులపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నాయి.

స్వయం సహాయక బృందాలు పొదుపు చేసిన మొత్తం సమష్టిదిగా భావించడం వల్ల బ్యాంకులు మంజూరు చేసిన రుణాలకు వడ్డీ ఉండదు. అందుకు భిన్నంగా వాణిజ్య బ్యాంకులు ఈ బృందాలకు ఇచ్చిన రుణాలపై వడ్డీని వసూలు చేస్తున్నారు. ఈ వడ్డీరేటు నాబార్డ్ కంటే రెండు రెట్లు ఎక్కువగా వాణిజ్య బ్యాంకులు వేస్తున్నాయి. బృందం తన సభ్యుల కార్పస్ ఫండ్ అదనంగా వడ్డీరేటు విధిస్తుంది. ఈ వడ్డీరేటు వడ్డీ వ్యాపారి దగ్గరికంటే ఎక్కువగా ఉంటుంది. త్వరగా రుణాల్ని తిరిగి చెల్లించడం ద్వారా వడ్డీ భారాన్ని తగ్గించుకోవచ్చు. 36 నెలల రుణకాలం కంటే ముందు రుణం చెల్లించడానికి వీలులేదు. బ్యాంకుకు అనుగుణంగా పరపతి సూత్రాలుండడం వల్ల స్వయం సహాయక బృందాలు అనివార్యంగా వడ్డీ వ్యాపారం వైపు మళ్ళాయి.

మొత్తం స్వయం సహాయక బృందాల అసలు ఉద్దేశ్యమే పక్కకు పోయి వాణిజ్య బ్యాంకులు, నాబార్డ్ మొదలు బృందాల వరకు వడ్డీ వ్యాపారంగా మారి అభివృద్ధికోసం పెట్టిన కార్యక్రమం అభివృద్ధి వ్యతిరేక కార్యక్రమంగా మారింది.

స్వయం సహాయక బృందాల సభ్యులకు వచ్చిన రుణం ఏ కొత్త వ్యాపారాన్ని ప్రారంభించడానికి చాలకపోవడం వల్ల వడ్డీ వ్యాపారంలోకి మళ్ళిస్తున్నారు. ఇంకొంతమంది సభ్యులు కుటుంబ యూనిట్లలో గొర్రెలు, మేకల పెంపకం, వ్యవసాయం, చిన్న చిన్న వ్యాపారాలు, కేన్ వర్క్, డైరీ పరిశ్రమల్లో పెట్టుబడులుగా పెడుతున్నారు. బ్యాంకులు కుటుంబ యూనిట్లకు రుణాలు ఇవ్వడానికి ప్రాధాన్యతనిస్తాయి. కుటుంబ యూనిట్లలో పెట్టుబడిగా పెట్టినప్పుడు మహిళలకు తగిన స్వేచ్ఛ ఉండదు. లాభాలన్నిటినీ కుటుంబ పెద్ద తీసుకుంటాడు. అటువంటప్పుడు మహిళలు పితృస్వామిక వ్యవస్థ నుంచి బయటకు రాలేని స్థితి ఏర్పడుతున్నది. ఇలాంటి విధానాల వల్ల మహిళాసాధికారత సాధ్యం కాదు. కొన్ని వ్యక్తిగత యూనిట్లు కూరగాయల అమ్మకం, కుట్టుపని, టైలరింగ్ లాంటి చిన్న చిన్న వ్యక్తిగత వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టి కొంతమేరకు ఆర్థిక స్వేచ్ఛను అనుభవిస్తున్నారు.

ఇంకొంతమంది విద్యా, వైద్య రంగాల్లో, వినియోగం లాంటి రంగాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. మరికొంతమంది పెళ్ళిళ్ళకు వెచ్చిస్తున్నారు. ఇటువంటి వాటిల్లో కార్పస్ నిధులు వడ్డీ వ్యాపారికి ప్రత్యామ్నాయంగా ఉంటున్నాయి. అంతకంటే ప్రధానంగా ఈ బృందాల సేవలు పేద, బలహీన వర్గాలకు అందడం లేదు. స్వయం సహాయక బృందంలో నిర్మాణాత్మక అభివృద్ధికి ఎటువంటి సూచనలు, షరతులు లేవు.

ఈ అభివృద్ధి కార్యక్రమాల స్వభావం అభివృద్ధి ప్రాధాన్యత కంటే రాజకీయాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తోంది.

ప్రభుత్వాలు స్వయం సహాయక బృందాల సభ్యులను తమ అధీనంలో ఉంచుకునే కార్యక్రమంగా మారిపోయింది.

ఈ బృందాల లక్ష్యం స్థిరమైన అభివృద్ధి సాధించడం. స్థిరమైన అభివృద్ధి సాధించడానికి వివిధ రంగాల్లో మహిళల నైపుణ్యాన్ని పెంచే విధంగా ప్రోత్సహించాలి. ఈ తరహా అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వాలు ఎలాంటి శ్రద్ధ తీసుకోవడం లేదు.

ఈ అభివృద్ధి పథకాలు స్త్రీ, పురుషుల మధ్య అసమానతను, లింగవివక్షతను పెంచడానికి కారణమౌతున్నాయి. ఈ ధోరణుల వల్ల రాజ్యం, కుటుంబ, పెట్టుబడుల్లో ఆధిపత్యం కొనసాగుతున్నది.

ఈ కారణాలవల్ల మహిళలు ఇంటిపనులకు పరిమితం కావడం, పిల్లల పెంపకం లాంటి పనుల్లో కూరుకుపోయి సృజనాత్మకతకను కోల్పోతున్నారు. ఇలాంటి అనారోగ్యకరమైన, వొత్తిడితో కూడిన కుటుంబ వాతావరణంలో స్త్రీలు జీవిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలు లేకపోవడం వల్ల అనారోగ్యం, ప్రసూతి సమయంలో సంప్రదాయ వైద్య పద్ధతులను (మంత్రసాని) ఆశ్రయిస్తున్నారు. ఆధునిక పరిశ్రమలు మహిళల జీవితాల్లో దుర్భర పరిస్థితులు సృష్టించాయి. ఈ కొత్త పారిశ్రామికాభివృద్ధి వలస కార్మికులకు ప్రాధాన్యతనివ్వడం వల్ల గ్రామీణ జీవితంలో సమస్యల తీవ్రత పెరుగుతున్నది. వలస కార్మికులు వివాహేతర సంబంధాల్లోకి, వ్యభిచారంలోకి లాగబడుతున్నారు. ఈ పరిణామాలు కుటుంబ వ్యవస్థను దెబ్బతీస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మద్యం సేవించే వారి సంఖ్య కూడా పెరుగుతున్నది. కుటుంబ ఆర్థిక జీవితం చిన్నా భిన్నమౌతున్నది. స్త్రీ, పురుష నిష్పత్తిలో అసమానత పెరుగుతున్నది. స్త్రీ, పురుష జనాభా నిష్పత్తి 1.57:1గా ఉన్నది.

ఈ మొత్తం పరిశీలనలో ఎక్కడా చెప్పుకోదగ్గ అభివృద్ధి కనిపించదు. స్థూలంగా చూసినప్పుడు స్వయం సహాయక బృందాలు కొంతమేరకు మహిళలు సంఘటితం అయ్యేందుకు, సామాజిక శక్తిగా ఎదిగేందుకు దోహదపడడం, కొత్త ప్రపంచంలో మహిళలు అడుగిడడం కనిపిస్తుంది. పురుషులు ఆర్థిక అనివార్యత వల్లనైనా స్త్రీలు ఈ కొత్త ఆవరణలోకి రావడాన్ని ఆమోదించారు. అట్లా చూసినప్పుడు స్వయం సహాయక బృందాలు ఆర్థికాభివృద్ధి కంటే స్త్రీల సామూహిక పోకడల్లో మార్పు తేవడం, పరిమిత వ్యక్తిగత జీవితం నుండి విస్తృత ప్రజాజీవనంలోకి తేవడానికి పరిమితంగానైనా ఉపయోగపడ్డాయి.

చాలా పరిమితమైన అభివృద్ధి జరిగి గ్రామాల్లో కొన్ని గ్రూపులకే ఈ అభివృద్ధి ఫలాలు అంది వాళ్ళను ప్రశ్నించే వీలులేని వర్గాలుగా ఎదగడానికి దోహదపడ్డది. ఈ పరిణామాల్ని రాజకీయ, సాంస్కృతిక కోణాలనుండి పరిశీలించాల్సిన అవసరం ఉన్నది.

రాజకీయ అధికారంలోని మార్పులవల్ల విలువల పతనం ప్రతిఫలిస్తున్నది. ఈ తరహా రాజకీయాధికారం మొత్తం అభివృద్ధి, ముఖ్యంగా మహిళలపై తీవ్రమైన ప్రభావం వేసింది. కార్మిక వర్గానికి, మహిళలకు గౌరవప్రదమైన, స్వేచ్ఛాయుతమైన జీవితాన్ని ఇవ్వనందుకు ప్రస్తుత ప్రజాప్రతినిధులెవరూ ప్రజల విశ్వాసాన్ని పొందలేకపోతున్నారు. పారిశ్రామికీకరణ మహిళల ఉపాధిపై ఎక్కడా గుణాత్మక ప్రభావం వేయలేదు. ప్రత్యేకంగా చూసినపుడు బడుగు బలహీన వర్గాల మహిళల జీవితాల్లో ఎటువంటి మార్పు కనిపించదు. గ్రామీణ జీవితం సైతం ఎటువంటి ప్రతిఫలాల్ని పొందలేదు. అందుకు భిన్నంగా సామాజిక ఆర్థిక జీవితంపై ఎటువంటి ప్రత్యామ్నాయం లేకుండా ప్రతికూల ప్రభావాన్ని వేసింది.

అనువాదం: ప్రశాంత్

ఆర్థిక సంస్కరణలు : వ్యవసాయరంగంలో మహిళలపై ప్రభావాలు

డా. ఇ. రేవతి

భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక సంస్కరణలు పంతొమ్మిది వందల నలభై దశకం మధ్య నుండే మొదలయినప్పటికీ విధాన రూపంలో 1991లోనే రూపుదిద్దుకున్నట్లుగా భావించాలి. ఆర్థిక సంస్కరణల ముఖ్య లక్షణాలు రెండు చెప్పాలి: అవి (1) స్థూల ఆర్థిక స్థిరీకరణ (2) వ్యవస్థాగత సర్దుబాటు. భిన్న సామాజిక-ఆర్థిక వ్యవస్థలు కలిగివున్న పలు దేశాలు ఆర్థిక సంస్కరణల బాటలో పయనించాయి. ద్రవ్యలోటు పూరింపు, వ్యాపార చెల్లింపుల శేషంలో మెరుగుదల వంటి అంశాలు సంస్కరణల వలన అనుకూలంగా వున్నప్పటికీ అనేక దేశాల్లో స్థూల దేశీయ ఉత్పత్తిలో పెరుగుదల శాతం బాగా పడిపోయి కనీసం సంస్కరణల ముందు స్థాయికి కూడా చేరుకోలేకపోయింది. దీనికి తోడు నిరుద్యోగ శాతం, పేదరికపు స్థాయిలు ఎప్పుడూ లేనంతగా పెరిగాయి. ఇందుకు ప్రధాన కారణం సామాజిక రంగాలపై ప్రభుత్వ వ్యయం గణనీయంగా పడిపోవడమేనని అనేకమంది ఆర్థికవేత్తలు రుజువు చేశారు. ఆదాయ అసమానతలు గణనీయంగా పెరగటంతో అంతకు ముందు మధ్య, దిగువ మధ్య తరగతి వర్గాలలోని వారు క్రొత్తగా పేదరికంలోకి దిగజారిన సందర్భాలు సంస్కరణలు ప్రవేశపెట్టిన దేశాలలో కనిపిస్తున్నాయి. మన దేశంలో చేపట్టిన సంస్కరణల మొదటి దశలో భాగంగా ప్రభుత్వం వ్యయాన్ని కుదిస్తూ ఆదాయాన్ని పెంచుకునే మార్గాల అన్వేషణలో దేశంలో ప్రైవేటీకరణ ప్రక్రియను మొదలుపెట్టింది. అదేవిధంగా అంతకు ముందున్న ఆంక్షల రాజ్యాన్ని సరళీకరించి, సడలింపచేసి ప్రైవేట్ రంగంనుంచి, విదేశీ ప్రైవేట్ రంగం నుంచి పెట్టుబడులను ఆకర్షింపచేసే చర్యలను చేపట్టింది. ఈ ప్రక్రియలో భాగంగానే పారిశ్రామికంగా సరళీకరణ, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగం, వాణిజ్య రంగం, విదేశీ రంగాలలో గణనీయమైన సంస్కరణలు చేపట్టింది. అయితే, వ్యవసాయరంగంలో మొదటి దశలో ప్రత్యక్షంగా సంస్కరణలేమీ చేపట్టకపోయినా, ఆర్థిక వ్యవస్థ సరళీకరణ ప్రభావం ఈ రంగంపై కూడ కనిపిస్తూనే ఉంది.

డబ్ల్యు.టి.ఒ. ఒప్పందంలో భాగంగా వ్యవసాయ రంగ దిగుమతులపై ఆంక్షలు సరళీకరించిన తర్వాత వ్యవసాయ రంగంపై వేటు తీవ్రమయింది. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఒ.)లో సభ్యదేశంగా వున్నందున దిగుమతులపై అన్ని రకాల భౌతిక ఆంక్షలను సడలించి, దశలవారీగా సుంకాలను విధించే ఒప్పందానికి కట్టుబడవలసి వచ్చింది. అంటే దాదాపు 800 వ్యవసాయ రంగ వస్తువుల దిగుమతిపై ఏదో విధమైన పరిమాణాత్మక ఆంక్షలు కలిగివున్న పరిస్థితి నుంచి క్రమంగా 2000 సంవత్సరం నుంచి వీటిని సరళీకరిస్తూ వచ్చారు. దీనివల్ల మన దేశంలోని వ్యవసాయ రంగం ప్రపంచ మార్కెట్‌కు అనుసంధానం జరిగింది. అధ్యయనాలను పరిశీలిస్తే అర్థమయ్యేదేమిటంటే వ్యవసాయ ఉత్పత్తులకి సంబంధించి ప్రపంచ మార్కెట్ ధరలు మన దేశంలోని ధరలకంటే కూడా అస్థిరమయినవి. మన దేశంలో వ్యవసాయరంగ ఉత్పత్తి అస్థిరంగా వుంటూ కొంతవరకు ధరలు అస్థిరంగా వుండటానికి కారణమవుతుంది. అయితే, మన దేశంలో వ్యవసాయరంగ ధరలలో ఒడిదుడుకులను ఎప్పటికప్పుడు ప్రభుత్వం జోక్యం వల్ల కొంతవరకు స్థిరీకరించే పద్ధతి వుంది. ప్రపంచ వాణిజ్య ఒప్పందంలో భాగంగా భాగస్వామ్య దేశంలో ఏదయినా అధిక వ్యవసాయిక ఉత్పత్తులకు ఆంక్షలు వుండవు కనుక ఇతర మార్కెట్లలోకి సునాయాసంగా తరలించవచ్చు. దీని వల్ల దేశీయ వ్యవసాయ రంగ వస్తువులకు గిట్టుబాటు ధరలు రావు; ఉత్పత్తి వ్యయాలు అధికంగా వుంటూ సరయిన ధరలు రాక రైతాంగం విలవిలలాడటం మనకు కనిపిస్తూనే ఉంది. ఇదేకాక వ్యవసాయ రంగానికి ప్రభుత్వమిచ్చే మద్దతును కూడ షరతుల ప్రకారం తగ్గించాల్సిన పరిస్థితి వుంది.

సరళీకరణ విధానం నుంచి భారతదేశ వ్యవసాయ రంగం లాభపడవచ్చుననే వాదన మనకు వినిపిస్తూనే వున్నది. అయితే, ప్రపంచ వాణిజ్యంలో మన దేశ వాటా 1 శాతం కన్నా తక్కువే. అందులో 80 శాతం ఎగుమతులు వ్యవసాయేతర వస్తువులు, సేవలే. ప్రపంచ మార్కెట్ స్థాయికి మన వ్యవసాయరంగం ఎదిగే పరిస్థితి దేశీయంగా కనబడకపోగా, వాణిజ్య సరళీకరణ ఏ విధంగా ఉపకరిస్తుందో లేదో ప్రశ్నార్థకమే.

ఇక దేశీయంగా చూసినట్లయితే వ్యవసాయ రంగ పరిస్థితి నానాటికి దిగజారుతున్నట్లుగా వుంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత దశాబ్దపు మధ్యకాలం నుండి కూడా వ్యవసాయరంగం ఎదుర్కొనే సంక్షోభం ప్రస్ఫుటంగా కనబడుతూనే వుంది. దేశంలోకెల్లా అన్ని రాష్ట్రాలలోకన్నా ఎక్కువగా సరళీకరణ ఎజెండాను అమలు పరచిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. విదేశీ అభివృద్ధి ఏజెన్సీల సహాయంతో అమలవుతున్న కార్యక్రమాల కారణంగా గత ప్రభుత్వం వ్యవసాయరంగంపై ఆధారపడ్డ జనాభా శాతాన్ని 70 శాతం నుంచి 40 శాతానికి కుదించే "విజన్" విధాన పత్రాన్ని అమలుపరచింది. ఈ రకమైన విధానాల అమలులో అత్యధికంగా

వున్న సన్న, చిన్నకారు రైతుల, గ్రామీణ ప్రజల భాగస్వామ్యం ఏమీలేదు. తమకు సమాచారంగాని ఆమోదంగానీ తమ ప్రమేయంగాని లేకుండా జరిగిన విధాన మార్పువల్ల ఇవ్వాళ చిన్న రైతాంగం, మహిళలు అనేకరకాల దుష్ప్రభావాలను చవిచూస్తున్నారు. ఇది ఏ రకంగా "అభివృద్ధి" అవుతుందో అర్థంకాదు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మన దేశంలోని అన్ని రాష్ట్రాలలోకెల్లా ప్రథమంగా నవ్య ఉదారవాద సంస్కరణలకు నాంది పలికిన రాష్ట్రం. "ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పునర్నిర్మాణ పథకం" (1999-2004) ప్రకారం రాష్ట్రంలో ద్రవ్య సంస్కరణలు, ప్రభుత్వ వ్యయ కుదింపు, ఆదాయ పెంపుతో పాటు పెట్టుబడి విధానానికి ప్రాధాన్యతను కల్పించారు. దీర్ఘకాలిక పెట్టుబడి పథకాలకు, స్వల్పకాలిక కోశ సంస్కరణలను అనుసంధానం చేశారు. స్థూల ఆర్థిక సంస్కరణలలో భాగంగా ప్రపంచ బ్యాంకు సంక్షేమ పథకాల కుదింపును ఆదేశించింది. సబ్సిడీ బియ్యం పథకం కిందనున్న లబ్దిదారుల సంఖ్యను 85% నుంచి 30%కు 2001-02 వరకే తగ్గించాలని, ఉద్యోగిత స్థాయిని తగ్గించాలని, ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగిత స్థాయిని తగ్గించాలనేవి స్థూలస్థాయిలో చేపట్టిన విధానాలు. ఇంక రంగాలవారీగా చేపట్టిన సంస్కరణల ముఖ్య ఉద్దేశం వివిధ రంగాలలో ప్రైవేట్ వనరులను రాబట్టి, అందించే సేవలకు ప్రతిఫలం రాబట్టే పద్ధతిని అనుసరించారు. ఈ విధమైన సంస్కరణలు ముఖ్యంగా విద్యుత్, నీటిపారుదల, రోడ్లు, ఓడరేవులు, ఇంకా సామాజిక అవస్థాపనయిన విద్య, ఆరోగ్యం వంటి రంగాలలో మనకు కనబడుతుంది. విద్యుత్ రంగంలోనయితే పంపుసెట్లపై టారిఫ్ పెంపుదల, విద్యుత్ చార్జీల పెంపు, నీటిపారుదల రంగంలో నీటి ఉపయోగదారుల సంఘాలకు నీటి నిర్వహణ బాధ్యతను అప్పగించటం, నిర్వహణ వ్యయాలను వారే భరించటం వంటివి వున్నాయి. అట్లాగే విద్య, వైద్య రంగంలో కూడా ఉన్నత విద్య, వ్యయ సేకరణ 30 శాతానికి పెంచారు. అంతకుముందు ప్రభుత్వ రంగంలో అందించే వైద్య రంగ సేవలను ప్రైవేట్ రంగం ఫీజు ప్రాతిపదికన అందించే పద్ధతిని ప్రవేశపెట్టారు. ఒక్క మాటలో చెప్పాలంటే రాష్ట్రం వ్యయపరంగానే కాక, విధాన పరంగా కూడా ప్రపంచ బ్యాంకు మీద ఆధారపడే పరిస్థితిని కల్పించారు.

సరళీకరణ ప్రక్రియ: మహిళలపై ప్రభావం

పైన పేర్కొన్న ఉదారవాద విధానాల ప్రభావం సామాన్య జన జీవనంపై వివిధ కోణాలలో కనబడుతున్నది. వ్యవసాయరంగం మొదటి దశ సంస్కరణలలోకి ప్రత్యక్షంగా రాకపోయినా వాణిజ్య సరళీకరణ ప్రభావాలు కనబడుతూనే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే రైతుల ఆత్మహత్యల అంశంలో ప్రథమంగా నిలుస్తుంది. 1996-97లో ప్రారంభమైన రైతు ఆత్మహత్యలు నేటి వరకు నిరాటంకంగా కొనసాగుతూనే వుండటం వ్యవసాయ సంక్షోభాన్ని తేటతెల్లం చేస్తుంది. ఆర్థిక సంస్కరణలు - ప్రభావం అనే విషయాన్ని విశ్లేషించేదానికి ముందు వ్యవస్థలోని అసమానతలు ఏవిధంగా వున్నాయనేది చూడాల్సి వుంటుంది. అంటే కనీస అసమానతలను (కుల, లింగ, వర్గ ప్రాతిపదికగా నున్న అసమానతలు) తొలగించే అవకాశం వున్నప్పటికీ తొలగించలేకపోగా వున్న అసమానతలపైన మార్కెట్ శక్తులను ప్రవేశపెట్టడం వలన బాగా దెబ్బతినే వారు క్రింది స్థాయివారే. మార్కెట్ పరంగా తాము చేసే పనులకు గుర్తింపు ఇంకా లభించని వ్యవసాయరంగంలోని స్త్రీలు, చిన్న, సన్నకారు రైతాంగం బాగా సతమతమయ్యే పరిస్థితుల్లో ఇరుక్కుపోయారు.

వ్యవసాయరంగంలోని సంస్థాగత మార్పులను పరిశీలించినట్లయితే అత్యధిక కమతాలు ఒక్క హెక్టేరుకన్నా తక్కువ పరిమాణం కలిగినవే. అంటే ఇటీవలి కాలంలో ఆవిర్భవించిన వ్యవసాయిక వ్యవస్థ ప్రధానంగా సన్న, చిన్నకారు వ్యవస్థగానే చెప్పుకోవాలి. ఈ వర్గం వ్యవసాయదారులు పెట్టుబడి వనరులు తక్కువగా కలిగి వున్నారనేది కూడా వాస్తవమే. ఎన్.సి. వ్యవసాయరంగంలో ఉద్యోగితకు సంబంధించిన కొన్ని అంశాలను పరిశీలిస్తే స్త్రీలు అధికంగా కార్మికులుగా ఇంకా స్వంత వ్యవసాయదారులుగా వున్నారు. మహిళల ఉద్యోగితకు సంబంధించిన లక్షణాలను పరిశీలించినట్లయితే ఎక్కువగా వారు తక్కువ వేతనం, తక్కువ భద్రత, తక్కువ ఎదుగుదల, తక్కువ నైపుణ్యం ఉన్న పనులలో వున్నారు.

మహిళల శ్రమశక్తి దాదాపు 90.4 శాతం అనియత రంగంలోనే కేంద్రీకృతమయివుంది. ఇందులో ప్రధాన రంగాలు వ్యవసాయం, చేనేత రంగాలు. ఈ రెండు రంగాలు కూడా సరళీకరణ కారణంగా అనేకానేక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ముడిసరుకుల (యార్న్) ఎగుమతి సరళీకరణ వలన యార్న్ ధర అనేక రెట్లు పెరిగిన ఫలితంగా చాలా సహకార స్పిన్నింగ్ మిల్లులు మూతబడ్డాయి. ఉపాధి కరువయి అనేక కుటుంబాలు సంక్షోభంలో పడ్డాయి. గ్రామీణ వ్యవసాయేతర రంగంలోని ఉపాధి అవకాశాలు మహిళలకు పెద్దగా లేవు. పాడి పరిశ్రమ, కొంతవరకు నీటి పారుదల సౌకర్యాలు గల ప్రాంతాలలో మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది. వ్యవసాయేతర ఉపాధి అయిన సెరికల్చర్ కూడా సంక్షోభంలో పడిపోయింది. అనంతపురం జిల్లాలో పట్టు పరిశ్రమ వ్యవసాయ రంగంలోని వారికి అనుబంధ ఉపాధి వనరుగా వుండేది. మల్బరీ తోటల, పట్టు పురుగుల పెంపకం మహిళలకు ఉపాధి కల్పించేది. అయితే దిగుమతి సరళీకరణ ప్రభావం వలన చైనానుండి అతి తక్కువ ధరగల పట్టు (చైనా సిల్క్) మన మార్కెట్లలోనికి రావడం వలన ఇక్కడ తయారయ్యే పట్టుకు డిమాండ్ కోల్పోవడం, యూనిట్ వ్యయం ఆదాయం కన్నా

అధికంగా వుండడం వల్ల పట్టుపరిశ్రమ బాగా దెబ్బతిన్నది. అదేవిధంగా వేరుశనగ రైతులు కూడా పెద్ద ఎత్తున ఉపాధి కోల్పోయారు. తక్కువ ధరగల పామాయిల్ దిగుమతుల వలన దేశీయంగా వేరుశనగ ధరలు బాగా పడిపోయాయి.

ఒకవైపు సరళీకరణ ప్రభావం ఆర్థిక వ్యవస్థ మీద, వ్యవసాయ రంగంమీద పై విధంగా వుంటున్న విషయం పక్కన పెడితే, ఇంకోవైపున ప్రపంచ బ్యాంకు పేద వర్గాల ప్రజలు, ముఖ్యంగా మహిళలు అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములంటూ, సామాజిక సేవల కల్పనలో ప్రభుత్వ బాధ్యత ఇక వుండదంటూ అనేక రంగాలలో భాగస్వామ్య పద్ధతి వారి సాధికారతకు దోహదపడుతుందనే వ్యూహాన్ని కూడా రచించింది.

సాధికారత వ్యూహాన్ని పరిశీలించేముందు అసలు ఉపాధి లక్షణాలు, స్వభావంపై మహిళలకు ఎంతవరకు నియంత్రణ వుందనేది ముఖ్యాంశం. మహిళా సాధికారత మహిళలకోసం, వారి అభివృద్ధి కోసం కాకుండా, కుటుంబాల పిల్లల సంక్షేమం కోనమనేది ప్రభుత్వ అభిప్రాయం. అందుకే మహిళలు విద్యావంతులయితే కుటుంబం, పిల్లలు విద్యావంతులవుతారని, మహిళలు ఆర్జన పరులయితే కుటుంబ సంక్షేమానికి మార్గమవుతారని మాత్రమే భావిస్తారు. అంటే మహిళలను అభివృద్ధికి వాహికలుగా చూస్తున్నారే తప్ప వారి అభివృద్ధి కోసం మాత్రం కాదు. మొత్తం అభివృద్ధి క్రమం అంతా కూడా మహిళల జీవితాలను దెబ్బతీసే విధంగా వుంటూ, ఏవో కొన్ని ప్రాజెక్టులు, మహిళల సాధికారత కోసం చేపట్టడం వలన స్త్రీల సమస్యలు ఏ విధంగా కూడా ఉద్దేశించబడవు. ఆర్థిక సాధికారత కేవలం ఉద్యోగిత దృష్టినుండే కాకుండా, ఏ రకమైన ఉద్యోగంలో మహిళలకు ప్రవేశం లభిస్తుంది, వేతన వివక్ష ఏవిధంగా వుంది, కనిష్ట వేతనాలు అందుతున్నాయా లేదా, ఉద్యోగ అభద్రత స్థాయి ఇవన్నీ కూడ పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలు.

గ్రామీణ ప్రాంతాలలో స్త్రీ సాధికారత అనేది కేవలం స్వయం సహాయక బృందాల ఏర్పాటు, పొదుపు జమతోనే కాకుండా వారికి వనరులపై నియంత్రణ ఎంతవరకు వుందనేది ముఖ్యమవుతుంది. వ్యక్తిగతంగా, కుటుంబ ఆస్తిలోగాని, సామాజిక ఆస్తులలోగాని, ప్రభుత్వం పంపిణీ చేసే భూమికి పట్టాదారులుగాగాని అన్ని రకాల వనరులకు అందుబాటు పరిమితంగా వుంటే సాధికారతకు అర్థం ఏముంటుంది. సాధికారత అంటే అసమాన బరువు బాధ్యతలు కావని మైత్రేయి కృష్ణరాజ్ అంటారు. స్త్రీలకు భూమిపై హక్కులు వాస్తవంగా లేవుకనక వారు స్వతంత్రంగా బ్యాంకు రుణం పొందే అవకాశం లేదు. అయితే ఇటీవల భర్త పూచీదారుగా వుంటే స్త్రీ రుణం పొందే అవకాశాన్ని బ్యాంకులు కల్పిస్తున్నాయి.

పేదరికమనే అంశానికి కూడా జండర్ కోణం వుంటుంది. పేదరికమంటే కేవలం ఆదాయ లేమి మాత్రమే కాదు. ఆదాయం, ఆస్తి, స్త్రీలకు అందుబాటులోకి లేకపోయే అవకాశం వుంది. స్త్రీలకు ఎంచుకునే అవకాశం లేదు. తమకు సంబంధించిన అంశాలలో కూడా తమ నిర్ణయాన్ని అమలు పర్చుకునే అవకాశం తక్కువగా వుంటుంది. స్త్రీలలో పేదరికాన్ని చూపించే అంశాలు క్రింది విధంగా వుండవచ్చు

1. గృహం లోపల అసమాన హక్కులు
2. కుటుంబ, సామాజిక వనరులకు అసమాన అందుబాటు
3. గృహంలో, సమాజంలో అసమాన బరువు బాధ్యతలు
4. గృహంలోపల, వెలుపల శ్రమ విభజన సంక్లిష్టంగా వుండటం

పై కోణాలనుండి చూస్తే గ్రామీణ స్త్రీలు పేదరికానికి ఇంకా ఎక్కువ చేరువగా వున్నట్లు ప్రస్ఫుటమవుతుంది.

వ్యవసాయ రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులు చాలావరకు చిన్న వ్యవసాయదారుల బతుకుదెరువుకు భంగం కలగచేస్తున్నాయి. మార్కెట్ ఉనికి ఎక్కువగా వుండటం వలన సాంప్రదాయ పద్ధతులు పూర్తిగా అంతరించి అన్నిటికీ మార్కెట్‌పై ఆధారపడటం ఎక్కువయింది. మార్కెట్ కొరకు పండించే పంటలు, మార్కెట్ ఆధారిత వనరుల ఉపయోగిత, ఫలితంగా పర్యావరణ క్షీణత ఇవన్నీ స్త్రీలపై భారం అధికంచేసేవే. సన్న చిన్నకారు రైతాంగపు జీవన ఆధారాలు భగ్నమైన ఫలితమే ఇవాళ మనం రోజూ చూస్తున్న రైతుల ఆత్మహత్యలు. రైతు కుటుంబాల భారం స్త్రీలపై పడుతున్నప్పటికీ వీరు ఈ విపత్తును ఎలా ఎదుర్కొంటున్నారనేది క్లిష్టమయిన ప్రశ్న. వ్యవసాయ రంగం ఎదుర్కుంటున్న సంక్షోభం నుండి తప్పించడానికి కొన్ని విధాన చర్యలు చేపట్టడం ప్రభుత్వ కనీస బాధ్యత.

1. వ్యవసాయరంగంపై ఆధారపడిన శ్రమశక్తి ఇంకా ఎక్కువగానే వుంది కనక వీరికి ఈ రంగంలో నిలదొక్కుకునేలా చర్యలు తీసుకోవాలి.
2. స్త్రీలను వ్యక్తులుగా, రైతులుగా గుర్తిస్తూ సంస్థాగత సహాయాన్ని అందచేయాలి.
3. అన్ని గ్రామీణ ప్రభుత్వ పథకాలలో కనీసం 33 శాతం మహిళలకు కేటాయించాలి.

గ్రామీణ ప్రాంత అభివృద్ధికి ఎక్కువ నిధులను వెచ్చిస్తూ, ప్రభుత్వం మార్కెట్‌ను ఒకమేరకు నియంత్రిస్తూ ఇంకోవైపున నిర్దేశిస్తూ వున్నప్పుడే మార్కెట్ అవతకవతకలు తగ్గే అవకాశం వుంటుంది. గ్రామీణ వ్యవసాయేతర రంగంలోని వివిధ ఉపాధి మార్గాలు కలిగేలా విలువ సంకలన ఉత్పత్తి పద్ధతులను చేపట్టాలి. ఇవి చేపట్టడానికి ప్రైవేట్ పెట్టుబడిని ఆహ్వానించవచ్చు.

ఇవాళ వున్న సంక్షోభానికి కారణం ప్రభుత్వ విధానాలే గనక ప్రభుత్వమే సంక్షోభాన్ని తొలగించే చర్యలు కూడ చేపట్టవలసి వుంది. అప్పుడే ప్రజలపై భారం తొలగుతుంది. ❑

అస్తిత్వ వైరుధ్యాల బంతాటలో చట్టసభల్లో మహిళల స్థానాల కేటాయింపు బిల్లు

- యం. రత్నమాల

చట్టసభల్లో స్త్రీలకు 33 శాతం స్థానాల కేటాయింపు బిల్లు ఈ సారికూడా ఓ.బి.సి., మైనారిటీ వాదాల వంకతో, పితృస్వామ్య భావజాలంతో ఎదురవుతున్న ఆటంకాల గండాన్ని గడిచి గట్టెక్కుతుందన్న సూచనలు కన్పించడం లేదు. అధికారానికి వచ్చీ రాగానే ప్రతీ కొత్త ప్రభుత్వం భేతాళున్ని భుజాన మోస్తున్న విక్రమార్కుడిలా బిల్లును తీసుకుపోయి పార్లమెంటులో ఆమోదానికి ప్రవేశపెట్టడం 'ఏకాభిప్రాయం' అన్న చిక్కుముడి ప్రశ్నకు చిక్కి విక్రమార్కుడు సమాధానంతో సంతృప్తి చెంది కూడా తిరిగి చెట్టెక్కిన బేతాళున్ని పట్టుకొని తినడానికి మళ్ళీ చెట్టెక్కిన విక్రమార్కుడి తీరున మళ్ళీ బిల్లుపెట్టడం గోడక్కొట్టిన బంతిలా బిల్లు మళ్ళీ వీగిపోవడం గత పది సంవత్సరాలుగా సాగుతూ వస్తున్న తంతు. షరా మామూలుగా ఏకాభిప్రాయం కోసం పార్లమెంటు వెలుపల రాజకీయ అఖిల పక్ష పార్టీలలో అధికార పార్టీ అధ్యక్షుల వారూ, దేశ ప్రధానీ చర్చించడం ఎప్పటి లెక్కనే అయిపోయింది. 33 శాతం అక్కర్లేదు. పది శాతంలో సరిపెట్టుకోవాలని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి సమాజ్‌వాద్ పార్టీ నేత ములాయంసింగ్ యాదవ్ పాతపాటే పాడారు. ఈసారి పాటకు ఆయన మరో కొత్త పల్లవికూడా చేర్చారు. ఏ సీటులో ఎవరు (స్త్రీయా, పురుషుడా) అన్నది ఎన్నికల కమిషన్ కాదు ఆ పార్టీలు నిర్ణయించాలి అని తేల్చారు. మహిళలకు రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వడానికి మా పార్టీ వ్యతిరేకం కాదంటూనే ఇది మగవాళ్ళ ప్రయోజనాలను ఫణంగా పెట్టి మాత్రం కాదన్నారు. ఇక లల్లూగారి తీరే వేరు. ఏది చెప్పినా కొట్టినట్లు చెప్పడమే. ఇదీ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా, ప్రధాని మన్‌మోహన్‌సింగ్ బిల్లుపై ఏకాభిప్రాయం కోసం నిన్నా ఇవ్వాళ చేసిన ప్రయత్నాలకు దక్కిన ఫలం. ఇక ఏకాభిప్రాయం ఎండమావే. గతంలోని ఐక్య సంఘటన ప్రభుత్వాలు, ప్రస్తుతం ఐక్యసంఘటన ప్రభుత్వం తమ కనీస ఉమ్మడి కార్యక్రమంలో చట్టసభల్లో మహిళల ప్రత్యేక స్థానాల కేటాయింపు కోటా హామీ ఇచ్చిన విధంగా బిల్లు ప్రవేశపెట్టడమూ ఏకాభిప్రాయం లేదన్న కారణంతో చేతులెత్తేయడంలోనూ, ఓటింగ్ పెట్టకుండా బిల్లు అటకెక్కించడంలో మాత్రం ఏకాభిప్రాయంతో వ్యవహరిస్తున్నాయి.

చట్టసభల్లో స్త్రీలకు 33 శాతం స్థానాల కేటాయింపుపై జరుగుతున్న వాదోపవాదాల తీరు 1920, 30 దశకాల్లో స్త్రీల కోటా హక్కు, రాజకీయ ప్రాతినిధ్య హక్కులపై జరిగిన చర్చల్లోనూ కనిపిస్తుంది. స్త్రీలకి పురుషులకి ఒకే రకంగా స్థానం ఇవ్వాలనే డిమాండ్‌తో శ్రీమతి సరోజిని నాయుడు ఒక మహిళా బృందంతో మౌంటింగ్ చేమ్స్‌ఫర్డును కలిసింది. ఆస్థి, విద్య తదితర నిబంధనలు లేకుండా స్త్రీ పురుషులందరికి సమాన సార్వత్రిక ఓటు హక్కు ఇవ్వాలని, స్త్రీలకు సీట్లు కేటాయించడం, నామినేట్ చేయడం వంటి ప్రత్యేక అవసరాలను కల్పించాలని కోరుతూ అఖిల భారత మహిళా మహాసభ (ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ - ఏ.ఐ.డబ్ల్యు.సి.) భారతీయ మహిళల సంస్థ (ఉమెన్ ఇండియన్ అసోసియేషన్ - డబ్ల్యు.ఐ.ఎ.) మొదలైన మహిళా సంస్థలు 1932లో వోటు హక్కుల కమిటీకి నివేదించారు. 1926లో భారతీయ మహిళల సంస్థ (ఉమెన్ ఇండియన్ అసోసియేషన్ - డబ్ల్యు.ఐ.ఏ.) డాక్టర్ ముత్తు లక్ష్మీరెడ్డిని మద్రాసు శాసన సభకు సిఫారసు చేసింది.

ఆవిధంగా డాక్టర్ ముత్తులక్ష్మి రెడ్డి మద్రాసు శాసన సభలో మొట్ట మొదటి మహిళా శాసన సభ్యురాలయ్యారు. (ప్రస్తుత 33 శాతం మహిళా కోటా ఉద్యమం సందర్భంగా కూడా మహిళా ఉద్యమం పక్షాన పార్లమెంటు శాసన సభ ఎన్నికల్లో అభ్యర్థుల్ని పోటీ పెట్టాలని చర్చించడం వరకు చేశాయి కానీ పోటీ పెట్టలేదు. ఈ మహిళా రిజర్వేషన్ ఉద్యమ నేపథ్యం ఆధారంగా కొన్ని రాష్ట్రాలలో మహిళా రాజకీయ పార్టీలు కూడా పుట్టుకొచ్చాయి కానీ ఆచరణ ప్రాతిపదికలేని కారణంగా నిలదొక్కుకోలేదు. కొత్తగా ఎన్నుకునే శాసన సభల్లో కొంతకాలం వరకు స్త్రీలకు 20 శాతం రిజర్వేషన్లు కావాలని ఈ సభ్యులను ప్రభుత్వ గుర్తింపు పొందిన మహిళా సంఘాలు సిఫారసు చేసిన వారిలో నుంచి ప్రాతినిధ్య నిష్పత్తిలో ఎంపిక చేయాలని చాలా కాలం డబ్ల్యు.ఐ.ఏ. డిమాండ్ చేసింది. అఖిల భారత మహిళా మహాసభ (ఏ.ఐ.డబ్ల్యు.సి.) భారతీయ మహిళా సంస్థ (డబ్ల్యు.ఐ.ఏ.)తో సహా, రాజకీయ పార్టీలు, సంస్థలు మహిళలకు చట్టసభల్లో ప్రత్యేక కేటాయింపుల పట్ల భిన్నాభిప్రాయాలు కలిగి ఉన్నాయి. కాలక్రమంలో వారి వారి అభిప్రాయాల్లో మార్పులు చేర్పులు చోటుచేసుకున్నాయి. మహిళల కోటాలో కుల మత ప్రాతిపదికన ప్రత్యేక కేటాయింపు వాదాలు కూడా 1930లలో కూడా ఉన్నాయి. అఖిల భారత మహిళా మహాసభ వోటు హక్కుల పోరాట కమిటి అభిప్రాయ సమీకరణ సందర్భంగా బేగం షానవాజ్ వంటి ప్రముఖ స్వాతంత్ర్య పోరాటకారులు వారి భిన్నాభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుని నమోదు చేసుకోకుండా నిరాకరించి తోసి పుచ్చిన విషయాన్ని ప్రస్తుతం మహిళల రాజకీయ రిజర్వేషను సమర్థించే వారిలో భిన్నాభిప్రాయాలు కలవారు ఒకరిపై ఒకరు చూసుకుంటున్న పరస్పర నిందారోపణల సందర్భంగా గుర్తు తెచ్చుకుని గుణపాఠం నేర్చుకోవాలి. బేగం షానవాజ్ భిన్నాభిప్రాయాల్ని తిరస్కరిస్తూ "స్త్రీలందరూ ఒకటేనన్న సత్యం మర్చి పోవడానికి వీల్లేదు. మాలో

అత్యంత ప్రతిభ ఉన్న వారినే మేం కౌన్సిల్‌కు పంపాలనుకుంటున్నాం కాబట్టి మేం కుల, మత తత్వాలను అంగీకరించం'' అన్న వాదనను బేగం షకీనా మయుజూదా తీవ్రంగా వ్యతిరేకించారు. ముస్లిం స్త్రీలు విద్యావిషయంలో వెనుకబడి ఉన్నారు కనుక వారు సంయుక్త ఓటర్ల జాబితా నుంచి ఎన్నిక కాని పక్షంలో వారి ప్రాతనిధ్యం సమస్య ఎట్లా పరిష్కరిస్తారని బేగం షకీనా మయుజూదా ప్రశ్నించారు. ఇదేవిధంగా ప్రస్తుతం స్త్రీలకు రాజకీయ కేటాయింపుల్ని కోరుతూనే దళిత, మైనారిటీ ప్రాతిపదికపై ప్రత్యేక ప్రాతినిధ్యాన్ని వ్యతిరేకించే వారు స్త్రీ జనం ఏకాండి శిలా సమానులు (మోనో లిథికల్- ఏకశిలా సదృశం) కనుక ప్రత్యేక కేటాయింపులు అక్కర్లేదు అంటున్నారు. ఆయా కులాల మతాల స్త్రీల స్థితిగతుల్లోనూ (ఆర్థిక, రాజకీయ సామాజిక స్థితిగతుల్లో) తారతమ్యాలు ఉన్నాయి అన్నది వాస్తవం. స్త్రీ పురుష ఆధిక్య, అధీన స్థితిగతుల కారణంగానే కదా స్త్రీలకు రాజకీయ ప్రాతనిధ్య ప్రత్యేక కేటాయింపు కోరుతున్నది. మరి ఇదే విధంగా దళిత, మైనారిటీ స్త్రీల స్థితిగతుల తారతమ్యాల కారణంగా వారికి ప్రత్యేక కేటాయింపు కోరడాన్ని వ్యతిరేకించడం ప్రజాస్వామిక ధోరణి అవుతుందా? స్త్రీలంతా ఏకాండి శిలా సమానులన్న అవాస్తవిక వాదన, అస్తిత్వ ఉద్యమాల అవగాహన లోపం అనైక్యతకు దోహదం అయ్యి మిత్ర వైరుధ్యాలు శత్రు వైరుధ్యలుగా పరిణమించడానికి ఏవిధంగా దారి తీస్తాయో ఈ మాయావతి, ఉమాభారతి, లల్లూప్రసాద్ యాదవ్, ములాయం సింగ్ యాదవ్ మొదలైనవారు, కొందరు స్త్రీవాదులు ఒకరిపై ఒకరు సంస్కార హీనంగా చేసే విమర్శలే నిదర్శనం.

వలన పాలనలో జరిగిన స్త్రీల రాజకీయ హక్కుల, నిర్ణయాధికార వ్యవస్థలో ప్రత్యేక ప్రాతినిధ్య కేటాయింపుల చర్చ తిరిగి అంతర్జాతీయ మహిళా సంవత్సరం సందర్భంగా 1975లో భారత దేశంలో స్త్రీల స్థితి (హోదా)పై డాక్టర్ వీణా మజుందార్ కన్వీనర్‌గా ప్రభుత్వం నియమించిన కమిటి నివేదికలో పేర్కొన్న రాజకీయాల్లో స్త్రీల వెనుకబాటుతనం, పరిష్కారానికి చేసిన సూచనలతో మొదలైంది. స్థానిక ప్రభుత్వాలను పటిష్టం చేయడానికి 1957లో ప్రభుత్వం నియమించిన బల్వంతరాయ్ కమిటి ప్రతి పంచాయితీలోనూ కనీసం ఇద్దరు స్త్రీలకు తప్పనిసరిగా అవకాశం కల్పించాలని సూచించింది. ఉత్తరప్రదేశ్ మినహా (ఇప్పుడు కూడా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ములాయం తీవ్ర వ్యతిరేకుల్లో ఒకరు. చరిత్ర కొనసాగింపు) అన్ని రాష్ట్రాలు ఈ సూచనను అంగీకరించినప్పటికీ ఆచరణలో అమలు చేయలేదు. ఆ తర్వాత 1975లో డాక్టర్ వీణా మజుందార్ ఆధ్వర్యంలోని భారత దేశంలో మహిళల హోదా కమిటి రాజకీయాల్లో మహిళల ప్రాతనిధ్యం పురుషులకంటే ఎంతో వెనుకబడి ఉందని పేర్కొంది. ఈ స్థితిలో మార్పులు తేవడానికి ప్రతిపంచాయితీకి ఒక మహిళా పంచాయితీని ఏర్పాటు చేయాలని, ఈ మహిళా పంచాయితీని మహిళలే ఎన్నుకోవాలని సూచించింది. అయితే సర్వసాధారణంగా ప్రజలు ఒత్తిడి చేస్తే తప్ప కమిటీలు వేయరు, వేసినా నివేదికల సూచనలను అమలు చేసిన పాపాన పోరు, కనుక సహజంగానే ఈ సూచనలు అమలుకు నోచుకోలేదు. కొంతకాలం తర్వాత 1978లో పంచాయితీ విధానం తీరుతెన్నులపై పరిశీలన జరిపిన అశోక్ మెహతా కమిటి నివేదిక ''ఎన్నికల్లో స్త్రీలెవరూ గెలవకపోయినప్పటికీ పోటీ చేసిన అభ్యర్థుల్లోనించి అత్యధిక మెజారిటీ ఓట్లు పొందిన మహిళా అభ్యర్థులిద్దరిని పంచాయితీ సభ్యులుగా కో ఆప్ట చేసుకోవాలని'' సూచించింది. కొంత కాలం వరకు పట్టించుకోలేదు. కానీ కొన్నేళ్ళ తర్వాత చాలా రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయితీ ఎన్నికల్లో ప్రతి పంచాయితీలో రెండు స్థానాలను స్త్రీలకు కేటాయిస్తూ పంచాయితీ ఎన్నికల చట్టం సవరించాయి. దీంతో ఈ రాష్ట్రాల పంచాయితీ మహిళలకు స్థానం దొరికింది. 1983లో దేశంలోనే మొదటి సారిగా కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీ సంస్థల ఎన్నికల్లో మహిళలకు 25 శాతం స్థానాలు కేటాయిస్తూ పంచాయితీ చట్టంలో సవరణ చేసింది. 1987 పంచాయితీ ఎన్నికల్లో కర్నాటక రాష్ట్రంలో దేశంలో కెల్లా అత్యధిక సంఖ్యలో మహిళలు పంచాయితీ సంస్థలకు ఎన్నికయ్యారు. ఆతరువాత 1988లో మహిళా జాతీయ ప్రణాళికా దృక్పథం (నేషనల్ ఫర్స్పెక్టివ్ ప్లాన్ ఫర్ ఉమెన్) పంచాయితీ సంస్థలు, అన్ని స్థానిక సంస్థలు, పార్లమెంటులోనూ రాష్ట్ర సభల్లో 1/3వ వంతు స్థానాలను మహిళలకు కేటాయించాలని సూచించింది. కానీ ఈ కోటా అమలు విధానం స్పష్టంగా సూచించలేదు. 1981లోనే మహిళలకు పంచాయితీల్లో, స్థానిక సంస్థలో 1/3వ వంతు స్థానాలు మహిళలకు కేటాయిస్తూ పంచాయితీరాజ్ ఎన్నికల చట్టానికి సవరణ చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లును అన్ని రాజకీయ పార్టీలు సూత్రప్రాయంగా అంగీకరించినప్పటికి సవరణ తీరుతెన్నులపై భిన్నాభిప్రాయాల కారణంగా పార్లమెంటు ఈ సవరణను తిరస్కరించింది. తిరిగి 1993లో 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయితీ ఎన్నికల్లో 1/3 వంతు స్థానాలను మహిళలకు కేటాయిస్తూ పార్లమెంటు చట్టం చేసింది. ఈ చట్టం తేవడానికి సంవత్సరం ముందుగానే 1992లో పశ్చిమ బెంగాల్ మార్క్సిస్టు ప్రభుత్వం రాష్ట్ర పంచాయితీ ఎన్నికల్లో 1/3వ వంతు స్థానాలను మహిళలకు కేటాయిస్తూ చట్టం చేసింది.

కనీస ఉమ్మడి ప్రణాళికలో ప్రకటించిన మేరకు 1996 సెప్టెంబర్‌లో దేవెగౌడ ప్రభుత్వం లోక్‌సభలో మొదటిసారిగా 33 శాతం స్థానాలు మహిళలకు కేటాయించటానికి బిల్లు ప్రవేశపెట్టడానికి అవసరమైన 81వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. చట్ట సభల్లో మహిళల ప్రాతనిధ్యాన్ని పెంచడానికి ప్రత్యేక స్థానాలు కేటాయింపులు (రిజర్వేషన్లు) అవసరాన్ని అన్నీ రాజకీయ పార్టీలు సూత్రప్రాయంగా అంగీకరించాయి.

(మిగతా 32వ పేజీలో)

తగ్గుతున్న మహిళల జనాభా

ఎస్. పుణ్యవతి

మాదీ స్వంత్ర దేశం,
మాదీ స్వతంత్ర జాతి

అంటూ చిన్నప్పుడు బడిలో పాడుకున్న పాటలు ఇప్పటికీ చెవుల్లో గింగురుమంటున్నాయి. ఈ ఆగస్టు 15కి స్వతంత్ర భారతికి 58 ఏళ్ళు నిండుతాయి.

పరాయి పాలకుల పీడన నుండి జాతికి స్వాతంత్ర్యం వచ్చిన సుదినాన్ని పండుగగా జరుపుకుంటున్నాము. ఎటొచ్చీ దేశంలోని మహిళలకే ఇంకా స్వతంత్రం రాలేదు. సొంత ఇంటిలోనే పరాయి బతుకు అందరిదైతే, తినడానికి తిండి చేయడానికి పని దొరక్క కులరక్కసి కోరల్లో నలుగుతూ పరాయీకరించబడ్డ బతుకులు అనేకమంది స్త్రీలవి.

దేశంలో స్త్రీల దుస్థితికి అద్దం పట్టేది తరుగుతున్న స్త్రీ జనాభా. 2001 లెక్కల ప్రకారం ప్రతి వెయ్యిమంది పురుషులకి 933 మంది స్త్రీలు ఉన్నారు. అదే స్వాతంత్ర్యానికి పూర్వం ప్రతి వెయ్యి మంది పురుషులకు 972 మంది స్త్రీలు, 1901లో 80 లక్షల మంది పురుషులకన్నా తక్కువ ఉండగా నేడు ఆ సంఖ్య 18.5 కోట్లకు చేరింది. 2001 జనాభా లెక్కల ప్రకారం 5 సం॥లోపు వయస్సున్న పిల్లల్లో స్త్రీ పురుష జనాభా నిష్పత్తి 927కి పడిపోయింది. 11 రాష్ట్రాలలో జాతీయ సగటు కంటే తక్కువ ఉంది. పట్టణ ప్రాంతాల్లో ఈ నిష్పత్తి 906కి పడిపోయింది. హర్యానా, పంజాబ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలలో ఈ నిష్పత్తి ఇంకా తక్కువగా ఉంది. అందుకే అన్నాడు ప్రఖ్యాత నోబుల్ గ్రహీత 'అమార్త్యసేన్' భారతదేశంలో కోట్లాది మంది స్త్రీలు మాయమయ్యారు అని.

వైద్య శాస్త్రం ప్రకారం మగ పిండాలకన్నా, ఆడపిండాలే గట్టివని, రోగనిరోధక శక్తి కూడా ఆడ శిశువుల్లో ఎక్కువని డాక్టర్లు చెబుతారు. అయినా స్త్రీ జనాభా, ఆడశిశువుల జనాభా తగ్గడానికి కారణం ఆడపిల్లల పట్ల వివక్షే. ఆడపిల్లల పట్ల నిర్లక్ష్యం పసిగుడ్డుగా ఉన్నప్పటి నుంచీ మొదలవుతోంది. ప్రేమగా పెంచడంలో, తిండి పెట్టడంలో, వైద్యంలో, విద్యలో... అన్నింటా వివక్ష ఉంటోంది. ఫలితంగా ఆడపిల్లల్లో చనిపోయే వారి సంఖ్య ఎక్కువే. అంతేనా... అతి బాల్యవివాహాలు, చిన్న వయసులో కాన్పులు, అత్తింట్లో స్వేచ్ఛ లేక తిండికి కూడా నోచుకోని స్థితి, వరకట్నం, అభద్రతా... అన్నీ కలిపి స్త్రీ జాతికి 'సహజ' మరణాలపాలు చేస్తున్నాయి.

పుట్టకముందే ఆడ పిండాలను చంపడం ప్రస్తుత హైటెక్కు నీతి. ఉన్న చట్టాలు కాగితాల్లోనే దాగున్నాయి. లింగ నిర్ధారణ పరీక్షలు నిరోధించే పి.యస్.డి.టి. యాక్టు అమలుకు నోచుకోలేదు. వరకట్న నిషేధం చట్టం లాగే ఇది కూడా ఉంది. లింగ నిర్ధారణ పరీక్షలు జరిపినందుకు ఒక్క డాక్టరయినా శిక్షింపబడ్డ దాఖలాలు లేవు.

సమాజంలో పాతుకుపోయిన పురుషాధిక్య భావజాలం, ఆస్తివారసత్వం, కొడుకు ప్రాధాన్యత ఉన్న సంస్కృతీ సాంప్రదాయాలు, వరకట్న దురాచారం ఆడ శిశువు పుట్టుకనే ప్రశ్నిస్తున్నాయి. ఎక్కడైతే సంపదలు పెరుగుతున్నాయో అక్కడ పురుషాధిక్యత, పుత్ర సంతానం ప్రాధాన్యత ఇంకా పెరుగుతుంది. ఫలితంగా వ్యవసాయం, పరిశ్రమలు బాగా అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లోనూ, జిల్లాల్లోను స్త్రీ జనాభా ఆందోళనకరంగా తగ్గిపోతోంది. 6 సం॥లలోపు బాలికల్లో స్త్రీ పురుష నిష్పత్తి రాష్ట్రాలవారీగా చూస్తే పంజాబులో 1000కి 798 కాగా, హర్యానాలో 820, ఢిల్లీలో 865, గుజరాత్ 878, హిమాచల్ ప్రదేశ్ 897గా ఉంది. 800 కంటె తక్కువ ఆడపిల్లల నిష్పత్తి గల జిల్లాలు 81 ఉన్నాయి. అది కూడా పంజాబ్, హర్యానాల్లోనే ఎక్కువగా ఉన్నాయి. ఫతేపూర్ సాహిబ్ జిల్లాలో ప్రతి 1000 మంది మగ పిల్లలకు 766 మంది ఆడ పిల్లలు. మన రాష్ట్రంలో బాగా వెనుకబడిన విజయనగరం జిల్లాలో ప్రతి 1000 మంది మగ పిల్లలకు 981 మంది బాలికలు కాగా, హైదరాబాద్ మహానగరంలో 950 బాలికలు.

1991లో 800 కన్నా తక్కువ బాలికలు గల జిల్లా దేశంలో ఒక్కటి కూడా లేదు. అంటే ఫ్యూడల్ అణచివేతకు, నూతనంగా సంస్కరణల దోపిడీ తోడయిన ఫలితం ఇది. సంస్కరణలు ఒకవైపు స్త్రీల అణచివేతను, సమాజంలోని అసమానతలను పెంచుతున్నాయి. మరోవైపు కుటుంబంలో స్త్రీ 'గృహ దాస్యాన్ని' కీర్తిస్తూ అదే కుటుంబ గౌరవంగా చూపెడుతున్నాయి. తమ వ్యాపారాల కోసం పాతకాలపు సాంప్రదాయాలను ప్రోత్సహిస్తూ కుటుంబంలో స్త్రీల అసమానతను స్థిర పరుస్తున్నాయి. సినిమాలు, టీవిలు అందుకు సాధనాలుగా ఉపయోగపడుతున్నాయి.

ఇంటా బయటా పెరుగుతున్న హింస దిగజారుతున్న స్త్రీ స్థానానికి నిదర్శనం. గృహహింస స్త్రీని జీవించే హక్కుకు దూరం చేస్తోంది. హత్యలకు గురవుతున్న స్త్రీలలో నూటికి 70 మంది భర్తల చేతుల్లోనే హతులవుతున్నారని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ చెబుతోంది. గృహ హింస కారణంగా గత మూడు సంవత్సరాల్లో 20 వేలకు పైగా స్త్రీలు చంపబడ్డారు. టెర్రరిస్టు దాడుల కన్నా

ఎక్కువగా 'డొమెస్టిక్' టెర్రిజం కారణంగా స్త్రీల ప్రాణాలు పోతున్నాయి. స్త్రీల మీద, బాలికల మీద లైంగిక హింస అతిదారుణంగా పెరిగిపోతోంది. 2003 లెక్కల ప్రకారమే ఢిల్లీ నగరంలో స్త్రీలపై నేరాలు 50% పెరిగాయి. అధికశాతం లైంగిక నేరాలకు కుటుంబంలోని పురుష సభ్యులే కారణమవుతున్నారు.

సమాజంలో స్త్రీ స్థానానికి స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యానికి మధ్య బలీయమైన సంబంధం ఉంది. చాకిరిలో స్త్రీలదే ప్రధాన పాత్ర అయినప్పటికీ సంపదలను అనుభవించడంలో మాత్రం స్త్రీలది అట్టడుగుస్థాయి. ఐక్యరాజ్య సమితి అభివృద్ధి నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాపితంగా మొత్తం శ్రమలో మూడింట రెండు వంతులు స్త్రీలు చేస్తారు. ఆదాయంలో కేవలం 10వ వంతు, ఆస్తుల్లో 1% కన్నా తక్కువ కలిగి ఉన్నారు. స్త్రీల వేతనాలు పురుషుల వేతనాల కన్నా 40% తక్కువ. అదే నివేదిక ప్రపంచ వ్యాపితంగా స్త్రీలు 11 ట్రిలియన్ డాలర్ల కనిపించని శ్రమ చేస్తారని స్త్రీలు చేసిన పనిని తగ్గించి చూపిన కారణంగా ఇప్పటికే సమాజంలో వారికున్న స్థానం మరింత తగ్గుతోందని పేర్కొంది. కాగా స్త్రీలతోపాటు స్త్రీల సంపాదన కూడ భర్త / అత్తింటి ఆధిపత్యంలోకి పోతున్న పరిస్థితి ఉంది.

పితృస్వామ్య కుటుంబ వ్యవస్థ బలంగా వేళ్ళూనుకొన్న మన వంటి మూడవ ప్రపంచ దేశంలో స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యం ఇంకా తక్కువ. ఆస్థివారసత్వ చట్టాలు స్త్రీకి వ్యతిరేకంగానే ఉన్నాయి. మన రాష్ట్రంలో యన్.టి.ఆర్. ప్రభుత్వం రెండు దశాబ్దాల క్రితమే సమాన ఆస్తి హక్కు నిచ్చినప్పటికీ ఆచరణలో అమలు జరిగింది శూన్యం.

సంపదల సృష్టిలో స్త్రీల శ్రమ ప్రధానంగా ఉన్నా, స్థిరమైన ఆదాయం, మెరుగైన పని పరిస్థితులు ఉన్న సంఘటిత రంగంలో మాత్రం స్త్రీల పాత్ర నామమాత్రం. సుమారు 8 కోట్ల మంది సంఘటిత రంగ కార్మికులలో కేవలం 50 లక్షల మంది మాత్రమే స్త్రీలు. కోట్లాది భారతీయ మహిళలు వ్యవసాయం బీడి, భవన నిర్మాణం, మత్స్య పరిశ్రమ వంటి అసంఘటిత రంగంలోనే ఉన్నారు.

నూతన ఆర్థిక విధానాలు స్త్రీల ఉపాధిని ఇంకా దెబ్బ తీస్తున్నాయి. సంఘటిత రంగంలో ఎక్కువ మంది మహిళలు ఉపాధ్యాయ, నర్సింగ్, ఆఫీసు నిర్వహణ వంటి సేవారంగాల్లోనే ఉన్నారు. ప్రయివేటీకరణ, కంప్యూటరీకరణ కారణంగా ఆ ఉద్యోగాల్లో కూడా మహిళలకు గ్యారంటీ లేకుండా పోయింది. సమాజంలో స్త్రీలపట్ల ఉన్న వివక్షను విదేశీ స్వదేశీ పరిశ్రమాధిపతులు కూడ మహిళల శ్రమ దోపిడీకి వినియోగించుకొంటున్నారు. కార్మిక చట్టాలు ఉల్లంఘిస్తూ మహిళల్ని గృహ కార్మికులుగా, కాంట్రాక్టు కార్మికులుగా, ఎక్స్‌పోర్ట్ కేంద్రాల్లో కారుచౌకగా పనిచేయించు కుంటున్నారు. సంస్కరణలు స్త్రీల దైన్యస్థితిని పెంచుతున్నాయి.

సంస్కరణల ఫలితంగా స్త్రీ మార్కెట్లో సరుకుగా మారింది. బాలికలు యువతులు వ్యభిచార కొంపలకు అమ్ముడుపోతున్నారు. ఎయిడ్స్‌కు బలై మరణిస్తున్నారు. సెక్స్ కుంభకోణాల్లో రాజకీయ నాయకులే మహిళల్ని పావులుగా వుడుకుంటున్నారు. దత్తత పేరుతో ఆడపిల్లల వ్యాపారం నిరాఘాటంగా సాగుతోంది.

పురుషాధిక్య భావజాలాన్ని కొంతైనా బ్రద్దలు కొట్టడానికి ఉద్యమాల్లో, రాజకీయాల్లో స్త్రీల పాత్ర దోహదపడుతుంది. కాని ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో స్త్రీల స్థానం ఆఫ్రికా దేశాల కన్నా హీనంగా ఉంది. దేశ స్వాతంత్ర్యం కోసం అశేష త్యాగాలెన్నో చేశారు. నాయకుల పిలుపునందుకుని ఉద్యమాల్లోకి ఉరికారు, లాఠీ దెబ్బలు తిన్నారు. జైళ్ళకు వెళ్లారు. 'ప్రీతి లత ఒడేదార్' వంటి యువకిశోరాలు ఉరికంబాలెక్కారు. ఝన్సీ లక్ష్మి, సరోజినీ నాయుడు, కెప్టెన్ లక్ష్మి వంటి నేతల కృషి, సాహసం అపూర్వం. అయినా చట్టసభల్లో మహిళల శాతం ఎనిమిదికి మించడం లేదు. దశాబ్ద కాలంగా మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటు గదుల్లో చెదలు పడుతోంది. మన రాజకీయ వ్యవస్థలో ఘనీభవించిన పురుషాధిక్యతకిది నిదర్శనం.

గత 58 సంవత్సరాల కాలంలో అసమానతలు పెరిగాయేగాని తరగలేదు. స్త్రీ, పురుష అసమానతలు ఇంకా పెరిగాయి. స్త్రీలపై అణచివేత ఇంకా పెరిగింది. ఇది వాస్తవిక పరిస్థితి. స్త్రీ పుట్టుక స్వేచ్ఛా స్వాతంత్రాలు ప్రశ్నార్థకమైన ఈ దేశ స్వాతంత్ర్యం ఎవరికోసం? స్త్రీల స్థితిలో మార్పు వచ్చినప్పుడే స్త్రీ సంపూర్ణ స్వేచ్ఛ స్వాతంత్రాలను అనుభవించినప్పుడే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్లు. అదే అసలైన పండుగ రోజు.

❑

వచ్చే సంచికలో....

దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితి - ఫోకస్

గుడ్‌గాఁవ్ కార్మిక ఆందోళన - పూర్వాపరాలు

రాష్ట్రంలో మునిసిపల్ ఎన్నికలు

రాష్ట్రంలో ఉల్ఫోవిజ్ - మళ్ళీ అమ్మకానికి ఆంధ్రప్రదేశ్

అసంపూర్ణ ఎజెండాగా స్త్రీ విద్య

కాత్యాయనీ విద్మహే,
తోట జ్యోతీరాణి

"విద్యలేక వివేకం నశించింది. వివేకం లేక నైతికత నశించింది. నీతి లేక అభివృద్ధి కుంటుపడింది. అభివృద్ధి లేక సంపద అదృశ్యమైంది. సంపద లేక శూద్రులు క్షీణ దశకు చేరుకున్నారు. చదువు లేక ఇంతటి దుస్థితి దాపురించింది.

- జ్యోతిరావ్ పూలే

మానవ సంబంధాలలోని అన్ని అసమానతలను, దోపిడీ పీడనలను నిర్మూలించడానికి కావలసిన చైతన్యాన్ని పోరాట స్ఫూర్తిని ఇచ్చేది విద్య అని చరిత్ర కాలాల నుండి ఋజువవుతూనే ఉంది. అసమానలు, దోపిడీ పీడనలు యధాతథంగా కొనసాగటం వల్ల ప్రయోజనం పొందే వర్గాలు విద్యను అందరికీ అందుబాటులోకి రాకుండా చేయటం చూడా ఒక చారిత్రక వాస్తవమే. సమాజంలో అసమానలకు దోపిడీలకి, పీడనకు మూలం వర్గం, వర్ణం, జెండర్. అసమానతల కొనసాగింపుకు ఈ మూడు ప్రాతిపదికల మీదనే విద్య నిరాకరించబడుతుంది. ఈ ప్రయోజనాల వైరుధ్యంతో కూడిన సంఘర్షణే విద్యకు సంబంధించిన చరిత్ర కూడా.

రాజ్యం బలపడి విద్య ఒక వ్యవస్థగా రూపుదిద్దుకొనే క్రమంలో అభివృద్ధి చెందిన బ్రాహ్మవిద్య, క్షాత్రవిద్య రెండూ కూడా వర్గ వర్ణ జెండర్ పరిమితులలో రూపొందినవే. అందువల్లనే స్త్రీలకు వేదవిద్యగాని, శస్త్ర విద్యగాని సహజ విద్యలు కాకుండా పోయాయి. పితృస్వామ్య సమాజ అస్తిత్వానికి అనుగుణంగా స్త్రీ ప్రజ్ఞ 'గృహకృత్య నిర్వహణ'కు సంబంధించినదని ఉపనిషత్తుల కాలానికే స్థిరపడింది. దీని ప్రభావం ఎంతటిదంటే వేల సంవత్సరాలు గడిచిన తరువాత బ్రిటిషు వలసపాలనలో ఉదార విద్యా విధానం అమలులోకి వచ్చి స్త్రీలకు ఇందులో ప్రవేశం లభించినప్పటికీ స్త్రీ విద్య గృహకృత్య నిర్వహణకు సంబంధించినదిగానే వుండాలన్న ధోరణిని వ్యక్తీకరించేటంతటిది. ఇటీవలికాలంలో ఈ ధోరణి కొంత మారినట్లు కనిపిస్తుంది. స్త్రీలు శాస్త్ర సాంకేతిక విద్యలో తమ ప్రతిభను నిరూపించుకొనేందుకు పెరిగిన అవకాశాలు దీనిని సూచిస్తున్నాయి. అయితే స్త్రీలు ఏ చదువులు చదివినా అంతిమంగా గృహకృత్య నిర్వహణే స్త్రీల ధర్మమన్న భావం మాత్రం చెక్కుచెదరక పోవటం గమనించగినది. ఈ వైరుధ్యాల సంక్లిష్ట సామాజిక సందర్భంలో విద్య స్త్రీల హోదా స్థితిగతులను ఎంతమేరకు గుణాత్మకంగా ప్రభావిం చేయగలుగుతుందనేది చర్చనీయాంశమవుతున్నది.

I

వలస ప్రయోజనాలకోసం వచ్చిన ఉదార స్వభావం గల ఇంగ్లీషు విద్యావిధానంలో అన్ని వర్గాల, వర్ణాల ప్రజలకు ప్రవేశం లభించటంతో అందులో భాగంగానే స్త్రీలకు కూడా సామాజిక విద్యలో స్థానం లభించింది. ప్రారంభంలో వలస ప్రభుత్వం స్త్రీ విద్య గురించి అంతగా పట్టించుకోకపోయినా క్రైస్తవ మిషనరీలు, బ్రహ్మ సమాజం వంటి హిందూమత సంస్కరణ సంస్థలు స్త్రీ విద్యకోసం చేసిన కృషి తక్కువదేమీ కాదు. 1854 నాటికి దేశం మొత్తం మీద 626 బాలికా పాఠశాలలు ఏర్పడి 21,755 మంది బాలికలకు విద్యనందించటం ఆ కృషిలో భాగమే. ఫలితంగా స్త్రీ విద్యపట్ల తూర్పు ఇండియా కంపెనీ దృక్పథంలో కూడా కొంత మార్పు వచ్చింది. భారతదేశానికి గవర్నర్ జనరల్‌గా వున్న లార్డ్ డల్హౌసీ (1848-1856) స్త్రీ విద్య ద్వారా మాత్రమే సమాజంలో ప్రముఖమైన, ప్రయోజనకరమైన పరిణామాలను సాధించగలమని ప్రకటించటం గమనార్హం. ఈ క్రమంలోనే హంటర్ కమీషన్‌గా ప్రసిద్ధిగాంచిన ఇండియన్ ఎడ్యకేషన్ కమీషన్ భారతదేశంలో విద్యాభివృద్ధిని సమీక్షించింది. బాలికలకు ప్రాథమిక పాఠశాలలను, ఉపాధ్యాయ శిక్షణా సంస్థలను ఏర్పాటు చేయాలని సూచించింది.

ఈ కమీషన్ బడికి వెళ్ళవలసిన ఆడపిల్లలలో 98 శాతం బడికి వెళ్ళటం లేదన్న వాస్తవాన్ని గుర్తించి ఈ సమస్య పరిష్కారానికి బాలికల పాఠశాలలకు ఉదారంగా నిధులు కేటాయించాలని, బాలికలకు ప్రత్యేక ఉపకార వేతనాలు, బహుమతులు ఇవ్వాని సిఫారసు చేసింది. ఈ కమీషన్ స్త్రీ విద్యకోసం పనిచేస్తున్న పండిత రమాబాయి వంటి విద్యావంతులైన స్త్రీలను కూడా సంప్రదించింది. అయితే అప్పటికే సామాజిక హక్కులు నిరాకరించబడిన శూద్రులకు, స్త్రీలకు విద్యవల్లనే విముక్తి అని గుర్తించి పనిచేస్తున్న జ్యోతిరావ్ పూలే మాత్రం హంటర్ కమీషన్ పని తీరులోని పరిమితులను గుర్తించి విమర్శించాడు. హంటర్ కమీషన్ సంపన్న వర్గాలవారిని, క్రైస్తవ మిషనరీలను మాత్రమే సంప్రదించిందని, శూద్రుల, రైతుల స్థితిగతులను పరిగణనలోకి తీసుకొనలేదని ఆయన ఆరోపణ. ఆ మేరక హంటర్ కమీషన్ సంబోధించిన స్త్రీ విద్య పరిధిలోకి భారతదేశంలోని మెజారిటీ స్త్రీలు రాలేదన్నది వాస్తవం.

భారతదేశంలోని అతి కొద్దిమంది స్త్రీలకు మాత్రమే అందుబాటులోకి వచ్చిన ఈ విద్య స్వరూప స్వభావాలు అనేక

పరిమితులకు లోబడి రూపొందినవే. అస్తిత్వంలో వున్న స్త్రీ పురుష సంబంధాలకు సంబంధించిన భావజాలమే ఈ పరిమితులను నిర్దేశించింది. ఇంగ్లీషు విద్యా విధాన స్వభావం అందరికీ ఒకే రకమైన విద్యను అందించటం. కానీ భారతదేశంలో స్త్రీ విద్య ప్రస్తావన వచ్చేసరికి అది పురుషుల విద్యకంటే భిన్నంగా వుండాలన్న భావం బలంగా వ్యక్తమైంది. స్త్రీ కూతురిగా, భార్యగ, కోడలిగా, తల్లిగా నిర్వహించవలసిన విధులను గురించి తెలియచేసే పురాణ గాథలు, స్త్రీత్వాన్ని నిలబెట్టే అంశాలు, వంటపని, కుట్లు, అల్లికలు మొదలైన వాటిల్లో నైపుణ్యాన్ని పెంచే అంశాలు పాఠ్యాంశాలుగా స్త్రీ విద్య రూపొందించే ప్రయత్నాలు కూడా జరిగాయి. స్త్రీ వివాహ హోదా కూడా స్త్రీ విద్యా స్వభావాన్ని నిర్దేశించిన సందర్భాలు వున్నాయి. డి.కె. కార్వే వితంతు స్త్రీల విషయంలో విద్య వాళ్ళను ఆర్థికంగా స్వతంత్రులను చేసేదిగానూ, వాళ్ళ గురించి వాళ్ళు ఆలోచించుకొని నిర్ణయాలు తీసుకొనేటట్లు చేసేదిగానూ ఉండాలని చెప్పినప్పటికీ అవివాహిత స్త్రీల విషయంలో మాత్రం పరాధీనతను ప్రబోధించటమే విద్య స్వభావంగా వుండాలని భావించటం గమనించదగింది. స్త్రీలను మంచి భార్యలుగా, తల్లులుగా, మంచి ఇరుగు పొరుగుగా సుశిక్షితులను చేసే ఉద్దేశంతోనే ఆనాటి బాలికాపాఠశాలలు నడపబడ్డాయి. ఇటువంటి స్వభావం కలిగిన స్త్రీ విద్య భారతదేశ పురుష సమాజం చేత ప్రశంసించబడింది. ఈ పితృస్వామిక అధికార స్వభావానికి కొద్దిగా భిన్నంగా పండిత రమాబాయి స్త్రీలకు తమ శరీరాల గురించి, తాము నివసిస్తున్న ప్రపంచం గురించి అవసరమైన జ్ఞానాన్నివ్వటం విద్య ప్రాథమిక స్వభావంగా వుండాలని భావించింది. స్త్రీలు ఆర్థికంగా తమ కాళ్ళమీద తాము నిలబడటానికి వీలైన వృత్తి విద్యలలో నైపుణ్యాన్నివ్వటం కూడా రమాబాయి లక్ష్యం.

భారతదేశంలో స్త్రీ విద్య గురించి అనీబిసెంట్ వ్యక్తం చేసిన భావాలు సంస్కర్తల అభిప్రాయం కంటే భిన్నంగా లేవు. 1901లో స్త్రీల విద్య గురించి వ్రాసిన వ్యాసంలో స్త్రీలు విద్యావంతులు కాకపోతే భారతదేశ ప్రగతి నిలిచిపోతుందని హెచ్చరించింది. అయినప్పటికీ భారతీయ స్త్రీలకు పాశ్చాత్య విద్య అనుకూలమైంది కాదని ఆమె విశ్వాసం. ఆమె ఉద్దేశంలో పాశ్చాత్య విద్య స్త్రీలను స్త్రీత్వం నుండి దూరం చేస్తుంది.

19వ శతాబ్దంలో స్త్రీ విద్యకోసం జరిగిన కృషి ఫలితంగా విద్యావంతులైన మొదటితరం స్త్రీలు 20వ శతాబ్ది ప్రారంభానికి తమ తోటి స్త్రీలను విద్యావంతులను చేయటానికి ఉద్యమించారు. స్త్రీ విద్యకు అవరోధంగా వున్న కౌటుంబిక సామాజిక కారణాలను గుర్తించి సంబోధించటం కనిపిస్తుంది.

1903 జూన్ నెల హిందూసుందరి పత్రికలో అచ్చయిన భండారు అచ్చమాంబ, ఉపన్యాసం స్త్రీ విద్యావ్యాప్తికి విద్యావంతులయిన యువతుల కర్తవ్యాన్ని గుర్తుచేసింది. స్త్రీల ఉపేక్ష, బాల్య వివాహాలు, పెళ్ళి తరువాత ఆడపిల్లలను పాఠశాలలకు పంపే, సంస్కృతి లేకపోవటం, బాలికా పాఠశాలల్లో తరచు పురుషులే ఉపాధ్యాయులుగా వుండే పరిస్థితి స్త్రీ విద్యకు అవరోధంగా వున్నాయని అచ్చమాంబ ఈ ఉపన్యాసంలో గుర్తించి చెప్పింది. స్త్రీలకు మధ్యాహ్నం తీరిక వేళ కనుక ఆ సమయంలో పాఠశాలలను నడపడం మంచిదని, విద్యావంతులైన స్త్రీలు బాలికలకు వంతులవారీగా పాఠాలు చెప్పే బాధ్యత తీసుకోవాలని, ప్రతి తల్లి తన కూతురి చదువు గురించి శ్రద్ధ చూపాలని ఆమె ఆశించింది. 1910 నాటికి జాతీయస్థాయిలో ఏర్పడిన 'భారత స్త్రీ మహామండల్' స్త్రీ విద్యకు పరదా పద్ధతిని ఒక అవరోధంగా గుర్తించింది. మహిళా సంఘాలు స్త్రీ విద్యా ద్వేషాన్ని నశింపచేయటానికి ఉపయోగ పడవలెనన్న ఆకాంక్ష ఆనాటి స్త్రీలది. స్త్రీ విద్యా స్వభావం పురుషుల విద్యవలె ఉద్యోగాలకు మాత్రమే ఉపయోగపడేది కాక మత ఆరోగ్య శాస్త్ర జ్ఞానానికి, గృహ నిర్వహణకు సంబంధినదిగా ఉండాలన్న అభిప్రాయం కూడా ఆనాటి స్త్రీలు ఆదుర్తి భాస్కరమ్మ వంటివారు వ్యక్తం చేశారు. స్త్రీల ఉన్నత విద్య కొరకు తీర్మానాలు చేశారు. స్త్రీల ఉన్నత విద్య కొరకు ప్రతి జిల్లాలో ఒక హైస్కూలు స్థాపించాలని, బాలికా పాఠశాలలో స్త్రీలనే ఉపాధ్యాయినులుగా ఏర్పరచాలని, ఉపాధ్యాయినులకు ఎక్కువ జీతం ఇయ్యాలని ప్రభుత్వాన్ని కోరారు. పదహారు సంవత్సరాలు రాకుండా బాలికలకు పెండ్లిండ్లు చేయకూడదని, బాల్య వివాహాలు దూషింపదగినవని, యుక్త వయస్సు వచ్చిన బాలికలను కూడా పాఠశాలలకు పంపాలని బీద వితంతువుల విద్యను ప్రోత్సహించటానికి ఉపకార వేతనాలు కొనసాగించాలని - 1914 ఏప్రిల్ 11, 12 తేదీలలో బెజవాడలో జరిగిన ఐదవ ఆంధ్రమహిళా సభ చేసిన తీర్మాణాలు స్త్రీ విద్యపట్ల పెరిగిన అనుకూల చైతన్యానికి సూచికలు.

జాతీయోద్యమం ముమ్మరమవుతూ రాజకీయాలలో స్త్రీల చురుకైన భాగస్వామ్యం పెరిగే కొద్దీ స్త్రీలు నాగరిక పౌర సమాజంలో తమను తాము మనుషులుగా, సమ భాగస్వాములుగా గుర్తించాలని జరిగిన ఐదవ ఆంధ్ర మహిళా సభ చేసిన డిమాండ్ చేసే స్థాయికి ఎదిగారు. స్త్రీకి ఒక విద్య, పురుషునికి మరొక విద్య అన్న భేదభావన క్రమంగా వెనుకబడింది. 'అందరికీ ఒకే విద్య' అన్నది ఆమోద యోగ్యమవుతూ వచ్చింది. స్వాతంత్ర్యానంతర భారత దేశంలో అది ఒక రాజ్యాంగ బద్ధమైన హక్కుగా స్త్రీలకు అందుబాటులోకి వచ్చింది.

II

భారత దేశానికి స్వాంత్ర్యం వచ్చిన రోజున జవహర్‌లాల్ నెహ్రూ ఒక ఉపన్యాసంలో పేదరికాన్ని, అజ్ఞానాన్ని, అనారోగ్యాన్ని అవకాశాలలో అసమానతను అంతం చేయటం దేశం ముందున్న కర్తవ్యం - అని ప్రకటించాడు. దానికి అనుగుణంగానే భారత రాజ్యాంగం పీఠిక పౌరులందరికీ స్థితిగతులలో, అవకాశాలలో

(మిగతా 39వ పేజీలో)

గర్భంలోనే ఆడపిల్లలను చంపటం ఏ నాగరికతకు నిదర్శనం?

- డా. పి.రాంమోహన రావు

మన దేశంలో అందరికీ అబ్బాయే కావాలి. అబ్బాయి పుడితే ఆనందం, అమ్మాయి పుడితే 'అయ్యో' అని బాధపడడం చూస్తున్నాం. కాన్పు అవగానే ఆడపిల్ల అని చెప్పగానే మళ్ళీ ఆడపిల్లేనా అని చప్పరించడం పరిపాటి. అదే విధంగా ఈ సారి అబ్బాయి పుట్టక పోతాడా అని అనుకుంటూ వరుస బెట్టి ముగ్గురు ఆడపిల్లలను కన్నవారిని కూడా చూస్తున్నాం. అబ్బాయి పుట్టకపోగా పుట్టిన ముగ్గురు ఆడపిల్లలను పెంచలేక పడే బాధలను కూడా చూస్తున్నాం.

మొగపిల్లవాడు లేకపోతే వంశం పోతుందని, పున్నామ నరకం వస్తుందని రకరకాలుగా పాతుకుపోయిన నమ్మకాల వలన కాని ఆడపిల్లల పెళ్ళిళ్ళ సమయంలో సామాజికంగా వస్తున్న ఇబ్బందుల వలన కాని ఇలాంటి ఆలోచనలు వస్తున్నాయి. అంతేగాక అబ్బాయిలు అయితే పని చేస్తారు, అమ్మాయిలపై చేసే ఖర్చు ఎక్కువ లాంటి ఆలోచనల వలన కూడ ఆడ శిశువులను చంపివేసేందుకు కన్న తల్లిదండ్రులే ప్రయత్నించడం నిజంగా దుఃఖ దాయకమే. మరొకరకమైన సమస్య కూడా కనిపిస్తుంది. గర్భం రాగానే ఆడో మగో నిర్ధారించి అమ్మాయి అయితే అబార్షన్ చేయించుతున్నారు. మాటిమాటికి అలా చేయించడం వలన అనారోగ్యం పాలు కావటం కూడా జరుగుతూనే వున్నది.

అందుబాటులో వున్న లెక్కల ప్రకారం ఏడాదికి 20 లక్షల మంది బాలికలు గర్భంలో వుండగానే హత్యకు గురవుతున్నారు. మగ పిల్లలతో కూడా కలుపుకుంటే ఈ సంఖ్య ఇంకా పెరుగుతుందనుకోండి. కాని ప్రతి సంవత్సరం 1.2 కోట్ల మంది ఆడపిల్లలు పుడుతుంటే వారిలో కనీసం 30 లక్షల మంది కూడా 15వ పుట్టిన రోజు చూడలేకపోతున్నారంటే అందుకు కారణం ఎవరు? ఈ సమాజంలో వున్న మూఢ విశ్వాసాలు, పేదరికం, ఆచారాలు, స్త్రీల పైన చులకన తనమే కావచ్చు.

మన దేశంలో 2001 జనాభా లెక్కల ప్రకారం ప్రతి వెయ్యి మంది పురుషులకు, స్త్రీల సంఖ్య 933 మాత్రమే. ప్రపంచంలో అనేక దేశాలలో పురుషుల కన్నా స్త్రీల సంఖ్య ఎక్కువ. ఉదాహరణకు యూరప్‌లో 1000 మంది స్త్రీలకు 970 మంది పురుషులు మాత్రమే ఉన్నారు. మన దేశంలో కూడా కేరళలో పురుషుల కంటే స్త్రీలే ఎక్కువ. ప్రతి వెయ్యి మంది పురుషులకు, 1058 మంది స్త్రీలు ఉన్నారు. 1901 నాటి నుండి స్త్రీ జనాభా తగ్గుతోందని లెక్కలు తెలుపుతున్నాయి. ఆనాడు స్త్రీ, పురుష నిష్పత్తి 972: 1000 గా వుంటే 1991 కి వచ్చే సరికి ఈ నిష్పత్తి 927: 1000గా మారిపోయింది. అంటే స్త్రీల సంఖ్య ప్రతి వెయ్యి మందికి 45 మంది తగ్గిపోతున్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందిన పంజాబ్, హర్యానా రాష్ట్రాలలో కూడ ఈ నిష్పత్తి, పంజాబ్‌లో 876: 1000 గాను, హర్యానాలో 861: 1000 గాను ఉన్నది. రాజస్తాన్, బీహార్ రాష్ట్రాలలో ఈ నిష్పత్తి మరీ దారుణం. ఆడ శిశువులు చంపివేయబడుతున్నారు. అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు.

ఈనాడు మన దేశంలో స్త్రీలకు చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్ కొరకు పోరాడుతున్నారు. మొన్నటి పి.టి. ఉష, నిన్నటి కరణం మల్లేశ్వరి, నేడు సానియా మన దేశ ప్రతిష్ఠను కాపాడిన సంగతి మన కందరికీ తెలిసినదే. కాని ఇదంతా నాణానికి ఒక వైపు మాత్రమే. మరొక వైపు పలు గ్రామాలలో, పట్టణాలలో ఆడ శిశువులు పుట్టిన మరుక్షణమే చంపి వేయబడుతున్నారు. ఉత్తర భారత దేశంలోనయితే మంత్రసానితో కొద్ది రూపాయలకే పుట్టిన ఆడపిల్లలను చంపించివేస్తున్నారు. పుట్టిన ఆడశిశువును చంపటానికి రకరకాల మార్గాలు అన్వేషిస్తున్నారు. హర్యానాలో రోడ్డుమీద పెద్ద పెద్ద బోర్డులు కనిపిస్తాయి. దానిమీద ఏమని ఉంటుందో తెలుసా? "ఇప్పుడు రు. 500 పెట్టి వదుల్చుకుంటారా? లేక ఆమె పెళ్ళికి 5 లక్షలు ఖర్చుపెడతారా" అని! న్యాయస్థానం ఆ బోర్డుమీద నిషేధం పెడితే దాన్ని మార్చి మరోరకమైన స్లోగన్ మొదలు పెట్టారు. అదేమంటే "అమ్మాయా లేక అబ్బాయా తేల్చుకో" అని. ఏదో ఒకరకంగా వదిలించుకునేదానికే ప్రయత్నం జరుగుతుంది. ఈ వ్యవస్థలో ఇన్ని అడ్డంకుల మధ్య పుట్టిన ఆడపిల్ల, పుట్టిన తరువాత కూడా అనేక వత్తిడులకు గురి అవుతుంది. మన దేశంలో బాలికల మరణాలు, బాలుర మరణాల కంటే ఎక్కువ. బాలికలలో నిరక్షరాస్యత ఎక్కువ. కారణం ఆడపిల్లలకు చదువు అవసరం లేదనే భావం ఎక్కువ మందిలో నాటుకుపోయింది. అలాగే ఆరోగ్య వైద్య సదుపాయాలు కూడా ఆడపిల్లలకు సరిగా అందుబాటులో లేవు. అంతే కాక ఆడుకునే వయస్సులోనే అమ్మను చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఏదో ఒక విధంగా ఆడపిల్లలను వదిలించుకునే ప్రయత్నంలో భాగమే చిన్న వయస్సులోనే పెండ్లి చేసి పంపించేయడం. దీని వలన చిన్న వయస్సులోనే పిల్లలను కనిపెంచవలసి వస్తుంది. తద్వారా స్త్రీ శరీరం క్షీణించిపోతుంది. అంతే కాక పుట్టిన శిశువులు తక్కువ బరువుతో, అనారోగ్యంగా ఉండటం తద్వారా జాతి నిర్వీర్యం అవుతుంది.

ఈ రకంగా కడుపులో ఉన్నపుడు లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా ఆడపిల్లలను పిండ దశలోనే నలిపి వేయడం, ఒక వేళ పుడితే పుట్టిన పసికందుని రకరకాల పద్ధతుల్లో హతమార్చడం, అదీ తప్పితే ఆడపిల్లలకు తల్లి పాలు త్వరగా ఆపివేయడం లేదా చిన్న వయస్సు నుండే చదువు మానిపించి ఆమెపై అధిక పని భారం మోపటం, ఆహారం సరిగ్గా అందించకపోవడం అవసరమైనప్పుడు సరిగ్గా వైద్య సదుపాయాలు అందించకపోవడం తెలియకుండానే జరిగిపోతుంది. పైపెచ్చు చిన్న వయస్సులోనే పెళ్ళిళ్ళు, కాన్పులు- వీటితో పాటు మూఢ నమ్మకాలు, ఆచారాలు, హానికలిగించే అలవాట్లు పైగా చదువు లేనందున ఉన్న సదుపాయాల గురించి, హక్కుల గురించి తెలియక పోవడం, పేదరికం-ఇలా అనేక కారణాల వల్ల ఆడపిల్లలు అనేక మంది మొదట చెప్పినట్లుగా 15వ పుట్టిన రోజును చూడలేక పోతున్నారు.

అంతే కాక జాగ్రత్తగా చూసినట్లయితే ఈనాటి ఆధునిక టెక్నాలజీ కూడా ఆడ పిల్లలని పుట్టక ముందే చంపేయడానికి సహకరిస్తున్నది. ఉదాహరణకు అల్ట్రా సౌండ్ టెక్నిక్కుల ఆధారంగా, 3-4 నెలలకే గర్భంలో ఉన్నది ఆడపిల్లా లేక మగ పిల్లవాడో తెలిసిపోతుంది. దీనితో ఆడపిల్ల వద్దు అనుకునే వారు అబార్షన్ చేయించుకుంటున్నారు. 3 నెలలకంటే ముందుగానే అమ్నియో సెంటిసిస్ పరీక్ష ద్వారా కూడా లింగ నిర్ధారణ పరీక్షలు చేయవచ్చు. నిజానికి ఈ పరీక్షలు జన్యుపరమైన దోషాలను ముందస్తుగా గుర్తించడానికి ఉపయోగించుకోవాలి. కాని స్వార్థం సైన్స్‌ని లింగ వివక్షకు వినియోగించుతోంది.

ఇది మొదటగా 1979లో అమృత్‌సర్‌లో ఆరంభమయింది. తరువాత ఇలాంటి కేంద్రాలు పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలో ఊరూర విస్తరించి లింగనిర్ధారణ ప్రకటించుకోవడం మొదలు పెట్టాయి. దీనిని వ్యతిరేకిస్తూ 1986లో 'ఫోరమ్ అగెనెస్ట్ సెక్స్ డిటర్మినేషన్ అండ్ సెక్స్ ప్రీసెలక్షన్స్' అనే సంస్థ ముంబాయిలో ఏర్పాటు అయింది. ఈ సంస్థ కృషి ఫలితంగా మహారాష్ట్ర ప్రభుత్వం 1988లో 'మహారాష్ట్ర రెగ్యులేషన్ ఆఫ్ ప్రీనేటల్ డయాగ్నస్టిక్స్ టెక్నిక్స్ యాక్ట్' పేర ఒక చట్టాన్ని చేసి లింగనిర్ధారణ పరీక్షల్ని పూర్తిగా నిషేధించింది. అయినా కూడా డాక్టర్లు, ప్రజలు ఆ చట్టాన్ని సులువుగా అతిక్రమించి లింగ నిర్ధారణ చేసుకుంటూనే ఉన్నారు. చివరికి 1994లో కేంద్ర ప్రభుత్వం కూడా లింగ నిర్ధారణ పరీక్షలను నిషేధిస్తూ ఓ చట్టాన్ని రూపొందించింది. 'ప్రీనేటల్ డయాగ్నొస్టిక్ టెక్నిక్స్, రెగ్యులేషన్ అండ్ మిస్యూజ్' అనే చట్టాన్ని దాదాపు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదించాయి. ఈ చట్టం ప్రకారం అమ్నియో సెంటిసిస్, కోరియన్ బయాప్సీలు పూర్తిగా నిషేధించబడినాయి. అల్ట్రా సౌండ్‌ను కూడా లింగనిర్ధారణ కొరకు వాడకూడదు.

అయినా 'మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ 1971' చట్టాన్ని దానిలో ఉన్న లొసుగులను అడ్డంబెట్టుకుని, గర్భస్రావాలు జరిగిపోతూ వచ్చాయి. ఈ చట్టం ప్రకారం స్త్రీకి గర్భం వలన ప్రాణహాని కలుగుతుంటే గాని, పుట్టబోయే శిశువుకి, శారీరక మానసిక సమస్యలు తీవ్రస్థాయిలో ఉంటాయన్నప్పుడు గాని, లేదా గర్భం మానభంగం వలన వచ్చివుంటేగాని, లేక కుటుంబనియంత్రణ పద్ధతులు విఫలమవటం వలన గర్భం వచ్చి ఉంటేగాని, గర్భస్రావం చేయవచ్చును. 12 వారాలు దాటి 20 వారాలు లోపు అయితే, ఇద్దరు వైద్యులు అంగీకరించితే గాని అబార్షన్ చేయించకూడదు. దీనికి తోడు జనంలో ఆడపిల్లల ఎడ ఉన్న విముఖత్వం కూడా ఈ పరిస్థితికి దోహదం చేస్తోంది. అయితే పరిస్థితిలో ఉన్న తీవ్రతను గుర్తించి, 2001 లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి మొత్తం దేశంలోని అన్ని స్కానింగ్ కేంద్రాలకు, వైద్యులకు ప్రత్యేకంగా సర్క్యులర్ పంపించి, చట్టాన్ని ఉల్లంఘించినవారికి 5 సంవత్సరాల జైలు శిక్ష విధించుతామని హెచ్చరిక జారీ చేశారు. ఈ ప్రయత్నం హర్షణీయమే, కాని చాలా ఆలస్యంగా జరిగిన ప్రయత్నం. అయినా ఇంకా చాలా చోట్ల అల్ట్రా సౌండ్‌ను లింగనిర్ధారణ కోసం ఉపయోగిస్తూనే ఉన్నారు. ఈనాడు దేశంలో 20 వేలకు పైగా అల్ట్రా సౌండ్ క్లినిక్‌లు ఉన్నాయి. ఒక్క పంజాబ్‌లోనే 2 వేలు ఉన్నాయి.

ఇలా లింగ నిర్ధారణ అనంతరం ఆడపిల్ల అని తేలితే 6వ నెలలో కూడా, ప్రమాదమని తెలిసి కూడా, గర్భస్రావం చేయించుకోడానికి సిద్ధపడుతున్నారు. అంతేగాదు వైద్య శాస్త్రంలో అత్యాధునిక పరిశోధనలు, పోకడల ఆధారంగా స్త్రీ వివక్ష కొత్త రూపాన్ని సంతరించుకుంటోంది. ఇలాంటి పద్ధతుల్లో ఎరిక్‌సన్ పద్ధతి ఒకటి. ఈ పద్ధతి ప్రకారం వీర్యకణంలోని ఎక్స్, వై క్రోమోజోములను విడదీస్తారు. కేవలం పురుష సంతానోత్పత్తికి తోడ్పడే 'వై' క్రోమోజోములను మాత్రమే స్త్రీ గర్భాశయంలోనికి ప్రవేశపెడుతారు.

ఇన్ని రకాలుగా స్త్రీ జాతిని నాశనం చేసుకుంటున్నాము.

పోతే స్త్రీ శిశువుల పరిస్థితిని మెరుగుపరిచేందుకు, కేంద్ర ప్రభుత్వం 1990 నుండి 2000 వరకు స్త్రీ శిశు దశాబ్దంగా ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అనేక పథకాలను ప్రవేశపెట్టాయి. మనరాష్ట్రంలో కూడా ఇలాంటివే అనేక పథకాలు ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

అయితే ఈ సమస్యకు పరిష్కారం కేవలం చట్టాలు రూపొందించడమే అనుకుంటే పొరపాటే అవుతుంది. ఈ విష సంస్కృతిని అంతమొందించాలి అనుకుంటే....

- ప్రజలలో సమస్యపై అవగాహన కల్పించాలి. లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోకుండా ప్రజలను, చేయకుండా డాక్టర్లను సిద్ధపరచాలి.
- మహిళలకు ఆర్థిక కార్యక్రమాలలో భాగస్వామ్యం కల్పించి ఆర్థిక స్వయం సమృద్ధి సాధించేలా వారిని ప్రోత్సహించాలి, మహిళా అక్షరాస్యతను పెంచాలి.
- అబార్షన్‌ల తరువాత ఎదురయ్యే శారీరక మానసిక సమస్యల గురించి మహిళలకు అవగాహన కల్పించాలి.

❑

'అరచేతిలో స్వర్గం' కానున్న ఆదివాసీ బిల్లు!

- విద్యాభూషణ్

చేపడుతున్న పథకాల అమలు, ఫలితాలను సమీక్షించుకోకుండానే, రానున్నకాలంలో అరచేతిలో స్వర్గాన్ని సృష్టిస్తామన్న భీకరాలతో అధికారాన్ని పదిలపర్చుకోవాలనుకోవడం... పాలకవర్గాలకు పరిపాటయ్యింది. భవిష్యత్ కార్యాచరణను ఏకరువుపెట్టి, అంతవరకూ మీరు మీ ప్రాణాలను ఉగ్గబట్టి ప్రభుత్వానికి సహకరించండని కోరడం సర్వసామాన్యమైపోయింది. ఆత్మహత్యలతో అల్లాడుతున్న రైతాంగ పరిస్థితులను సమీక్షించిన జయతీఘోష్ నివేదిక అమలు హామీ నిన్నటిదైతే, నేడు ఆదివాసీల అటవీ హక్కుల గుర్తింపుతో కేంద్రం ప్రకటించిన 'ఆదివాసీబిల్లు' తాజా ఉదాహరణ. వాస్తవానికి ఈ ఆదివాసీలు సర్వసభ్య సమాజంకు అవలగా విసిరేసిన ఒంటరి జీవనాన్ని గడుపుతుంటే కనీస ఆరోగ్య, ఉపాధి కల్పనా అవసరాలను పట్టించుకోకుండా, ఈ తాజా బిల్లు ప్రతిపాదన ద్వారా ఉపశమనం కల్పించే ప్రయత్నానికి పాలకులు సిద్ధపడుతున్నారు. ఈ ముసాయిదా బిల్లును ప్రతిపాదిస్తూ, సూచనలు, సలహాలను ఆహ్వానించింది కేంద్రం. అయితే ఇక్కడ ఈ ముసాయిదా బిల్లును ఇంగ్లీషులో విడుదల చేస్తూ, ఆదివాసీల సూచనలను కోరడంలోనే ప్రభుత్వపు 'చిత్తశుద్ధి' తేటతెల్లం అవుతుంది. ఇంతకీ ఈ ఆదివాసి బిల్లులో ప్రభుత్వ ప్రతిపాదనలేంటో చూద్దాం!

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆదివాసీల సమగ్రాభివృద్ధికై ఈ తరహా జాతీయ విధాన ప్రకటనను వెలువర్చడం ఇదే ప్రథమం. వారి జీవన శైలికి భంగం కలగని రీతిన బహుముఖ - విధాన అభివృద్ధిని సాధించనున్నామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించుకుంది. ఈ సమగ్ర అభివృద్ధి ద్వారానే ఆదివాసీలు నాగరిక ప్రపంచానికి చేరువకాగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది.

దేశ జనాభాలో సుమారుగా 8.08 శాతం వున్న ఆదివాసీల జనాభా సుమారుగా 678 లక్షలు.. అంటే సుమారు 6.8 కోట్లు. వీరి ప్రత్యేక జీనవశైలి, భిన్న సంస్కృతి, భౌగోళికంగా కొండ ప్రాంతాలకు పరిమితం అవడం వంటి ప్రత్యేక కారణాల వల్ల రాజ్యాంగ పరంగా, 342 అధికరణం ద్వారా గుర్తింపబడినట్టు 1950లో దేశాధ్యక్షులవారు ప్రకటించారు. 698 తెగలుగా గుర్తింపబడిన గిరిజనుల్లో 75 తెగలు అత్యంతంగా వెనుకబడినట్లు ప్రభుత్వాలు గుర్తించాయి.

యింతవరకూ ఈ గిరిజనాభివృద్ధికై అనేక చర్యలు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించినా, జాతీయ స్థాయిలో విధివిధాన ప్రకటనను వెలువర్చడం ఇదే ప్రథమం. అయితే 1952లో నాటి ప్రధాని నెహ్రూ హయాంలో పంచశీల సూత్రాలుగా గిరిజనాభివృద్ధికై ప్రతిపాదించడం జరిగింది. అవి.

1. గిరిజనాభివృద్ధిని వారి స్వాభిమానం మేరకే చేపట్టాలి.
2. వారి పోడు భూములు, అటవీ హక్కులను గౌరవించాలి.
3. బయటివారి ప్రమేయాన్ని కుదిస్తూ గిరిజనాభివృద్ధి పాలనా నియంత్రణలో వారికే తగు శిక్షను కల్పించాలి.
4. గిరిజనుల సాంఘిక, సంస్కృతీ విధానాలకు భంగం కలగకుండా గిరిజనాభివృద్ధిని చేపట్టాలని
5. ఈ అభివృద్ధి వారి జీవన విధాన మెరుగదల లక్ష్య దిశగానే చేపట్టాలని సూచించారు.

కాని సుమారు అర్ధ శతాబ్ది ఆచరణలో, వీరి 'గిరిజనాభివృద్ధి' వారి సంప్రదాయ అనారోగ్యాల నుంచి సైతం కాపాడలేని వాస్తవం నేడు మన ముందున్న సత్యం.

మరోవైపు 1999లో గిరిజనాభివృద్ధికై ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పర్చిన ఘనతా మన పాలకులదే. ఈ మంత్రిత్వ శాఖ ఏర్పడిన అనంతరం గిరిజనాభివృద్ధి తగినంతగా అభివృద్ధి చెందలేదన్న వాస్తవాన్ని గుర్తెరిగి, తగు అభివృద్ధిని సాధించే లక్ష్యంతో ఈ జాతీయ విధానాన్ని రూపొందించింది.

గిరిజనుల్లో విద్యాభివృద్ధి అనుకున్నంతగా సాధించలేకపోయామన్న వాస్తవాన్ని ప్రభుత్వం గుర్తించింది. 1991 నాటి జనాభా లెక్కలమేరకు మైదాన ప్రాంతాల్లో అక్షరాస్యత 52.21 శాతంగా నమోదైతే, గిరిజనుల్లో అక్షరాస్యత 29.60 శాతంగానే నమోదైంది. స్త్రీల అక్షరాస్యతా విషయానికొస్తే 18.19 శాతమే. ఈ అనల్ప అక్షరాస్యత కల పేదరికానికి తోడుగా పాఠశాలల ఏర్పాటు, ఉపాధ్యాయుల నియామకంలో అశ్రద్ధ ప్రధానంగా వుంటాయి. వీటన్నింటినీ అధిగమిస్తూ ఈ నూతన జాతీయ విధానంలో కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో 'సర్వశిక్ష అభియాన్'ను నిర్వహించాలని, విద్యా వసతులు లేని ప్రాంతాల్లో నూతన పాఠశాలలు, హాస్టళ్ళను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇక్కడ మనకు అభ్యంతరకరమైన అంశం... గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికే వునికిలో వున్న పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేసి సక్రమ నిర్వహణకు ఉపక్రమించకుండా, మళ్ళీ నూతనంగా ఏర్పాటు చేయడం అవసరమా? అన్నదే. ఇక్కడి విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, పాఠ్యపుస్తకాలను అందివ్వాలని; ప్రాథమిక విద్యా స్థాయి వరకూ వారికి మాతృభాషలోనే

విద్యాబోధన జరగాలన్నది మరో సూచన. ఇందుకు స్థానిక గిరిజన యువతనే వినియోగించాలన్నది కీలకాంశం. గిరిజనుల సంప్రదాయ విలువిద్య, నృత్య రీతులు, జానపదగీతాలు వంటి సాంస్కృతిక అంశాలను పరిరక్షించాలి. అటవీ విజ్ఞానం, ఉద్యానవన పెంపకం, పశుపోషణ, వంటి రంగాల్లో గిరిజన యువతకు శిక్షణను ఇచ్చేందుకై సాంకేతిక విద్యా సంస్థలను ఆయా ప్రాంతాల్లో నెలకొల్పాలన్నది ప్రధాన సూచన. ఇంతేకాకుండా గిరిజనులు సంప్రదాయ సిద్ధంగా అలవర్చుకున్న ఔషధ మొక్కల వినియోగం, పోడు వ్యవసాయ ధోరణుల్లో చేపడుతున్న సాగునీటి కల్పనా విధానాలు, వాగులు వంకలను దాటేందుకై నిర్మించుకున్న కొయ్య వంతెనలు... రుతుపవన ఆగమనాల అంచనాలు మున్నగు అంశాలను నిక్షిప్తపరచి, ఈ సంప్రదాయ విజ్ఞానాన్ని రానున్న తరాల్లో ఆయా యువత అందివ్వాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. గిరిజనేతర ప్రాంతాల్లోనూ ఈ విజ్ఞానాన్ని తగురీతిన ప్రాచుర్యం పొందేలా చెయ్యాలని, ఈ జాతీయ విధానం సూచిస్తుంది.

ప్రకృతితో కలగలసి సహజీవనం చేస్తున్న గిరిజనులకు ఆరోగ్యం ప్రధాన ప్రతిబంధకమౌతుంది. అక్షరాస్యత లేక సరైన ఆరోగ్య జాగ్రత్తలు పాటించకపోవడం, రక్షిత మంచినీటి వసతి, బలవర్ధక ఆహారలేమి, పేదరికం వీరి అనారోగ్యానికి మూల హేతువులు. 58 ఏళ్ళ స్వతంత్ర్య పాలన వీరికి కనీసపు రక్షిత మంచినీటి సౌకర్యాన్ని సైతం కల్పించలేకపోయింది. వీరి అజ్ఞానం నేటికీ వీరి ఆరోగ్యాన్ని మంత్ర తంత్ర విద్యలకు ఫణంగా పెట్టే పరిస్థితులకు నెలవై వున్నాయంటే అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. ఈ నేపథ్యంలో జాతీయ ఆదివాసీ బిల్లు మూడు అంచెల ఆరోగ్య పరిరక్షణ విధానాన్ని రూపొందిస్తుంది. గ్రామస్థాయి ఆరోగ్య కార్యర్తలు, ఆపై మిడ్‌వైఫ్స్ స్థాయి మహిళా కార్యకర్తలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు. గిరిజనుల జనాభాకు అనుకూలంగా ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఓ సూచన. ఇందుకు సైదోడుగా సంప్రదాయ వైద్య విధానాన్నీ ప్రోత్సహించాలని సూచించారు. ఔషధ వృక్ష సంపదను అభివృద్ధి చేసేలా గిరిజన యువతకు శిక్షణను ఇవ్వాలని ఓ సూచన. గిరిజన ప్రాంతాల్లో తలెత్తుతున్న ఆరోగ్య రుగ్మతలపై తగు పరిశోధనలు చేపట్టేలా ప్రోత్సహించాలని బిల్లులో సూచించారు.

యిక నిర్వాసితుల సమస్య:

డ్యాంలు, సాగునీటి ప్రాజెక్టులు, భూగర్భ ఖనిజ నిల్వల అన్వేషణ వంటి చర్యలు చేపట్టినపుడు అనివార్యంగా గిరిజనులను వారి జీవన ప్రాంతాలనుంచి వేరే ప్రాంతాలకు తరలించాల్సి వస్తుంది. 1990 నాటికి సుమారు 85.39 లక్షల గిరిజనులను వారి నివాసాలనుంచి ప్రాజెక్టుల నిర్మాణానికి అనువుగా తరలింపుకు గురయ్యారు. వీరి పునరావాసానికి ప్రభుత్వం ఏ తరహా చర్యలు చేపట్టినా, వారికి ఆమోదం కాదు. ప్రకృతి ఒడిలో స్వేచ్ఛగా కొనసాగించే వారి జీవన సరళి, అధునాతన నగర జీవనాలకు భిన్నమైంది కావడంతో అలవికాని సమస్యలను వారు ఎదుర్కొన వలసి వస్తుంది.

గిరిజనుల తరలింపు.

యిది రాజ్యాంగంలోని ఐదో షెడ్యూలును అతిక్రమించే చర్యే అవుతుంది. అందుకనే గిరిజనుల తరలింపును, జాతి ప్రయోజనాల రీత్యా అనివార్యమైతేనే చేపట్టాల్సి వుంటుంది. అది వారి సహజ జీవన శైలికి ఉన్నతమైన ప్రత్యామ్నాయాన్ని చూపించిన మీదటే తరలించాల్సి వుంటుంది.

పునరావాస కల్పనకై జాతీయ బిల్లు ప్రతిపాదనలు.

1. వీరు కోల్పోయిన భూమికి బదులుగా భూమిని కేటాయించాలి. కుటుంబానికి ఐదు ఎకరాలను...
2. కొత్త రిజర్వాయర్లలో ఈ గిరిజన తెగలకు చేపలుపట్టే హక్కును కల్పించాలి.
3. వీరు నిర్వాసితులు అవుతున్న కారణంగా, అటవీ ఆదాయాన్ని కోల్పోతున్నందుకు ప్రత్యామ్నాయంగా, సంవత్సరం ఆరునెలల వ్యవసాయ పనిదినాల వేతనాన్ని అదనంగా చెల్లించాలని బిల్లులో ప్రతిపాదించారు. ప్రస్తుతం తక్షణం ఖాళీ చేయించేసి తరువాత పునరావాస ప్రయత్నాలను చేపట్టడం, ప్రతిపాదించడం జరుగుతూ వుంది. వీరి జీవన సంస్కృతీ విలువలు కోల్పోకుండా సహజీవనం చేసే తెగ అంతటికీ ఒకే నూతన ప్రాంతంలో పునరావాసం కల్పించాలన్నది మరో ప్రధాన ప్రతిపాదన. కనీస సామాజిక ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ఈ పునరావాస ప్రాంతాల్లో కల్పించాలి. రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ వసతి, పారిశుధ్యం, రక్షిత మంచినీటి సరఫరా, విద్యా, వైద్య సదుపాయాలను కల్పించాల్సి వుంది. ప్రజా పంపిణీ వెసులుబాటుతో పంచాయితీ కార్యాలయం, కమ్యూనిటీహాలు వంటి వసతులనూ కల్పించాలి. ఇంతవరకూ పునరావాస కల్పనకై తగు నిర్దిష్ట సూచనలే లేని నేటి నేపథ్యంలో ఈ సూచనలు అమలయ్యేవేనా? అన్పించక తప్పకడంలేదు.

అటవీ గ్రామాల పునరుద్ధరణ

అటవీ ప్రాంత అభివృద్ధితో ముడిపెట్టుకున్న గిరిజనుల జీవన సాఫల్యానికి అటవీ గ్రామాలను మరింత సమున్నతంగా అభివృద్ధి పర్చాల్సి వుందని జాతీయ బిల్లు ప్రతిపాదిస్తుంది. ఆచరణలో సుమారు 5,000 అటవీ గ్రామాలు ఏ తరహా సదుపాయాలు లేక తండాలుగానే మిగిలిపోయి వుండడం ప్రత్యక్ష సాక్ష్యం. ఈ అటవీ గ్రామాలను, ఆదాయ వనరుల స్థాయికి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా వుందన్నది బిల్లు ప్రతిపాదన.

యిందుకుగాను విద్యా వైద్య ప్రాథమిక సదుపాయాల కల్పన విద్యుత్, సమాచార వ్యవస్థల ఏర్పాటు ఆదాయ సమస్యనధిగ మించేందుకుగాను ప్రజా పంపిణీ వ్యవస్థతోపాటు, ఆహార నిల్వల ఏర్పాటు, ఆర్థిక స్థాయి పెరుగుదలకై పశుపోషణ, అధునాతన సేద్యపు విధానాల్లో శిక్షణ, ఆదాయ వనరుల పెంచేరీతిన సంస్థాగత రుణ వసతికల్పన, వన సంరక్షణా విధానాల ప్రోత్సాహంతో... ఉమ్మడి అటవీ పోషణ విధానాలను ప్రవేశపెట్టడం, సమగ్ర అటవీ ప్రాంత అభివృద్ధి విధానాలను ప్రవేశపెట్టడం, అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్ విధానాల రూపకల్పన ప్రధానమైనది. ఇప్పటివరకూ గిరిజన సహకార సంస్థల నిర్వహణా తీరును సమీక్షించుకోవలసి వుంది. లేకుంటే చర్వితచరణంగానే అవుతుందీ ప్రతిపాదన.

అస్థిర సేద్యంతో అడుగంటుతున్న ఉత్పాదన

గిరిజనులు నిర్దిష్ట భూ వసతిలో సక్రమ సేద్యపు విధానాలను చేపట్టని కారణంగా వీరి పోడు వ్యవసాయపు దిగుబడి నామమాత్ర మౌతుంది. అధునాతన సేద్య పరికరాలను - విధానాలను అవలంబించక సంప్రదాయ సేద్యానికే పరిమితమౌతున్నారు. కేవలం ఉపశమన విధాన ప్రక్రియగానే ఈ పోడు వ్యవసాయం కొనసాగుతుంది. నిలకడగా భూసార మెరుగుదల వంటి ప్రయత్నాలకు దూరంగానే ఇది కొనసాగుతుంది. ఇందుకుగానూ పోడు భూములపై యాజమాన్య హక్కులను కల్పించడం ద్వారా మెరుగైన సేద్యాన్ని చేపట్టవచ్చని ఆదివాసీ బిల్లులో ప్రతిపాదించారు. ఉత్పత్తి మెరుగుదలకై శాస్త్రవేత్తలు దృష్టిని సారించాల్సి వుందని సూచించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అవసరమైన ఆహార ధాన్యాలను సరఫరా చేస్తూ, వాణిజ్య పంటలను పండించేలా ప్రోత్సహించాలి. పోడు వ్యవసాయానికి బదులుగా ప్రత్యామ్నాయ సేద్యాన్ని చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు.

గిరిజనులపరమైన భూ వసతిని లాండ్ రికార్డుల్లో నమోదు చేసి వారి హక్కుల్ని భద్రపరిచేలా చేయాలని ఆదివాసీ బిల్లులో ప్రతిపాదించారు. ఈ రికార్డులను పంచాయితీ కార్యాలయాల్లో అందుబాటులో వుంచాల్సి వుంది. గిరిజనుల భూ వివాద పరిష్కారాల్లో లాండ్ రికార్డులు లభ్యంకాని పక్షంలో స్థానికుల మౌఖిక సాక్ష్యాలను (నే) పరిగణలోకి తీసుకోవలసి వుంది. గిరిజనుల భూములను గిరిజనేతరులకు బదలాయించరాదు. అనివార్యమై అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం గిరిజనుల భూములను వినియోగించాల్సి వస్తే ప్రత్యామ్నాయ భూ వసతిని కల్పించాలి.

గిరిజనుల మేధోపర హక్కుల రక్షణకు చర్యలు తీసుకోవాల్సి వుంది. గిరిజనుల భాషా పరిరక్షణకై చర్యలు చేపట్టాలి.

రాజ్యాంగ రీత్యా ఐదారు ప్రకరణాలలోని 244(1), 244(2) ఆర్టికల్స్ ప్రకారం గిరిజన ప్రాంతాల పరిరక్షణను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై వుంది. తగు సలహా మండలిని ఏర్పాటు చేసి కాలానుక్రమంగా చర్చిస్తూ చర్యలు తీసుకోవాల్సి వుంది. ప్రైవేటు రుణ విధానాలను నివారించాల్సి వుంది. జిల్లా / ప్రాంతీయ మండలి ఏర్పాట్లను చేపట్టి గిరిజన ప్రాంతాలను పటిష్టం చేయాల్సి వుంది. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఎ) ద్వారా సమగ్ర గిరిజనాభివృద్ధి పథకాలను చేపట్టాలి. గిరిజన యాజమాన్య నిర్వహణలో గిరిజనుల సాధక బాధకాలు తెలిసినవారి సేవలను వినియోగించాలి. గిరిజనాభివృద్ధికై సమగ్ర పరిశోధనలు చేపట్టే దిశగా చర్యలను చేపట్టాలని ఆదివాసీ బిల్లు 2005 ప్రతిపాదిస్తూ వుంది.

ఈ ప్రతిపాదిత అంశాలన్నింటినీ యధాతథంగా అమలు పర్చగలిగితే కాస్తో కూస్తో మంచి జరగొచ్చు. కానీ పాలకుల 58 ఏళ్ళ ఆచరణ ఇందుకు పూర్తి భిన్నంగా వున్నందున బిల్లులో అంశాలు... ఆచరణాత్మక సందేహాన్నే కలిగిస్తున్నాయి.

పైగా ఈ ఆదివాసీ బిల్లుకు 1980 నాటి అటవీ చట్టంలోని అంశాలే పునాదిగా కన్పిస్తున్నాయి. 1980 నాటికి ఆదివాసీ సాగులోని పోడు భూముల్ని గుర్తించే పట్టాలిస్తామంటున్నారు. అటవీ శాఖ ఆదివాసీలపై నమోదు చేసిన కేసుల ఆధారంగానే భూములను గుర్తిస్తామంటున్నారు. పైగా కుటుంబానికి రెండున్నర హెక్టార్ల భూమినే కేటాయిస్తామంటూ, భూ పట్టాలు యిచ్చిన తరువాత అటవీ చెట్లపై చెయ్యి వేస్తే వెయ్యి రూపాయల జరీమానా అని, పైగా, వారి అటవీ హక్కునే రద్దు చేస్తామని హెచ్చరిస్తున్నారు. అడవి జంతువులను, ప్రాణులను కాపాడే బాధ్యతను ఆదివాసులకే అంటగట్టారు. కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులు, సిబ్బంది ఏమి చేసినా ఆదివాసులకు అడిగే హక్కు కానీ, కోర్టుకు వెళ్ళే హక్కు గానీ లేదంటున్నారు. ఇది మునుముందు అటవీ ప్రాంతాల్లో భూగర్భ ఖనిజాల వేటకు ప్రాతిపదికగా కన్పిస్తుంది. గత పాతికేళ్ళలో పోడు భూములకు పట్టాలు ఇవ్వకపోవడమే కాకుండా, సమిష్టి వన యాజమాన్యం (జాయింట్ ఫారెస్ట్ మేనేజ్‌మెంటు) కమ్యూనిటీ ఫారెస్టు మేనేజ్‌మెంట్ పథకాల ద్వారా ఆదివాసీల్లో చీలికలు తగాదాలకు నెలవయ్యేలా వ్యవహరించిన అనుభవాలూ మనముందు వున్నాయి.

యిన్ని ప్రాథమిక సమస్యలను పరిష్కరించే దిశగా, 'ఆదివాసీ బిల్లు 2005'ను రూపొందించకుండా, అరచేతిలో స్వర్గం చూపే విధంగా తయారుచేసి, సూచనలు సలహాలు కోరుతూ కేంద్రం ముసాయిదాను విడుదల చేసింది. గిరిజన ప్రాంతాల్లో, ఆంగ్లంలో విడుదలైన వీరి ముసాయిదాపై చర్చ జరిగే అవకాశం ఎంత శాతమో, ఈ ఆదివాసీ బిల్లు - 2005 ద్వారా గిరిజనులకు ప్రయోజనం అంత శాతం మేరకేనన్నది నిర్వివాదాంశం. సమస్య పరిష్కార దిశగా ప్రతిపాదనలుండాలిగానీ, ఆచరణ యోగ్యం కాని వాగాడంబరం సమస్యను మరింత జఠిలం చేస్తుందనేది చారిత్రక సత్యం. ❑

సంస్కరణల ఫలితాలే రైతుల ఆత్మహత్యలు

- డి.వి. రామకృష్ణారావు

వ్యవసాయమే అన్ని సంస్కృతులకు మూలమని చెప్తారు. 70% జనాభా ఆధారపడే వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయడం అంటే మెజారిటీ జీవన విధానాన్ని నిర్లక్ష్యం చేయడమే. జీవనాధారం, ఉపాధికాధారమైనటువంటి వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల ఎదుర్కోబోతున్న సంక్షోభం ఏమిటో మనం, మన ముందు తరాలు చూడబోతున్నాయి.

దేశంలోనే వ్యవసాయ సమృద్ధి సాధించిన రాష్ట్రంగా వినుతికెక్కిన ఆంధ్రప్రదేశ్ ఇపుడు ఆత్మహత్యల పాలవుతోంది.

చరిత్రలోకి పోయిచూస్తే రైతులు ఎప్పుడు ఆత్మహత్య చేసుకోలేదు. సమాజంలో వివిధ సమూహాలు, వ్యవసాయేతర రంగంలో వారు వేరే కారణాల వల్ల చనిపోవడం వుండేది. కానీ ఇపుడు స్వయంగా రైతులే ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. 1985-87 ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో పత్తిరైతులు తెల్లదోమతో నష్టపోయి ఆత్మహత్య చేసుకున్నారు. మళ్ళీ నూతన ఆర్థికవిధానాల అమలు, దాని తీవ్రత ఎదుర్కొనే క్రమంలో 1997 నుంచి చాలా ఉధృతస్థాయిలో అన్ని ప్రాంతాల రైతులు మరీ ముఖ్యంగా తెలంగాణా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కొన్ని సందర్భాలలో కుటుంబం మొత్తంగా సామూహికంగా కూడా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వ్యవసాయరంగ సంక్షోభం మిగిలిన రంగాలను కూడా తాకుతోంది అనేది మనం చేనేత కార్మికులు, రోడ్డున పడ్డ పారిశ్రామిక కార్మికులు, ఉపాధిఅవకాశాలు లేని నిరుద్యోగ యువత ఇలా వేరు వేరు సమూహాల్లో చూడవచ్చును. వ్యవసాయ సమాజం నిర్వీర్యమైపోతుంటే కలిగే దుష్ప్రభావంగానే అర్థం చేసుకోవాలి.

తెలంగాణా, రాయలసీమ, కోస్తాంధ్ర అనే తేడా లేకుండా ఆముదం రైతు నుండి పత్తి, వరి, చెరకు రైతుల దాకా ఆత్మహత్యలు చేసుకున్నారు. కందులు, మినుములు, పెసలు, మిరప, కూరగాయలు, జొన్న, సజ్జ, పసుపు, వేరుశెనగ ఇలా ఏ పంట చూసినా నష్టమే. రైతు ఏది పండిస్తే అదే నష్టదాయకం అన్న స్థితి. ఇప్పుడు రాష్ట్రంలో రైతు టమాటా కిలో పావలాకు, పత్తి క్వింటాలుకు రు.1200, మిరప క్వింటాలుకు రు.1200-1500లకు అమ్ముకునే పరిస్థితి. రైతు ఉత్పత్తికయిన ఖర్చు ఆధారంగా కోరుకునే గిట్టుబాటుధరలో సగం నుంచి 1/4 వంతుకు 1/8వ వంతుకు అమ్ముకునే మార్కెట్ దోపిడీ కొనసాగుతోంది.

రైతుల ఆత్మహత్యలు దేశవ్యాప్తంగా పరిశీలిస్తే 75% ఆంధ్రప్రదేశ్ నుంచే అని అర్థమవుతుంది. దీనర్థం చంద్రబాబు నాయుడు పాలనలో ఎంత దూకుడుగా సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాలు అమలయ్యాయో అర్థం చేసుకోవాలి. అయితే ఈ విధానాలను ప్రారంభించిన ఘనత అప్పటి ప్రధాని పి.వి.నరసింహారావు, ఆర్థికమంత్రిగా ఉన్న మన్‌మోహన్‌సింగ్‌లదే. తరువాత వచ్చిన జనతాదళ్, ఎన్.డి.ఎ., వామపక్షాల మద్దతుతో ఉన్న ఇప్పటి యు.పి.ఎ వరకు అవే విధానాలు అమలుచేస్తున్నాయి. ఇపుడు జెండా, పార్టీ అనే తేడాలేకుండా ఒకటే అజెండాగా ఎల్.పి.జి. విధానాలు అమలవుతున్నాయి. అందువల్ల మెట్ట, మాగాణం తేడా లేకుండా రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి.

విదేశీ అప్పులను అనుత్పాదక రంగాలకు వెచ్చించడం, ఆదాయంలో 25% తెచ్చిన అప్పులకు వడ్డీలకుగాను, 15% రక్షణ రంగానికి అన్ని ప్రభుత్వాలు వెచ్చిస్తున్నాయి. వ్యవసాయాన్ని అభివృద్ధి పర్చి, దానికి అనుబంధంగా వ్యవసాయాధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయడం వల్ల ఇటు వ్యవసాయ సమాజం, అటు యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయి. మన లాంటి వ్యవసాయాధారిత దేశంలో మన శక్తియుక్తులన్నింటిని వ్యవసాయంపై పెట్టడం వల్లే మనకు మేలు జరుగుతుంది. డెబ్బై శాతం జనాభా ఆధారపడిన వ్యవసాయానికిస్తున్న సబ్సిడీలన పరిశీలిస్తే పాలకులకు వ్యవసయంపై ఉన్న చిత్తశుద్ధి మనకు తేటతెల్లమవుతుంది. (పట్టిక-1)

(పట్టిక-1)

వివిధ దేశాల్లో వ్యవసాయానికిస్తున్న సబ్సిడీలు		
జపాన్	-	72.5%
కొలంబియా	-	54.0%
దక్షిణకొరియా	-	61.0%
యూరప్	-	37.0%
చైనా	-	34.0%
పాకిస్తాన్	-	26.0%
అమెరికా	-	26.8%
ఇండియా	-	3.0% (అంతకన్నా తక్కువ)

వేరే రాష్ట్రాలతో పోల్చిచూస్తే ఆంధ్రప్రదేశ్‌లో 82% రైతులు

అప్పులపాలైనారు. తరువాత స్థానాల్లో వరుసగా తమిళనాడు (74.5%), పంజాబ్ (65.4%), కర్ణాటక (61.6%), మహారాష్ట్ర (54.8%) ఉన్నాయి.

రైతు చేస్తున్న అప్పుల్లో కేవలం 36% మాత్రమే బ్యాంకుల నుండి కాగా మిగిలిన 64% వడ్డీ వ్యాపారులు, బంధుమిత్రుల నుంచి తీసుకుంటు న్నారు. వడ్డీవ్యాపారుల నుంచి తెచ్చిన అప్పులకు సంవత్సరానికి 60% వరకు వడ్డీలుంటున్నాయి. వరుసగా 4-5 ఏళ్ళు వర్షాలు లేక, పంటనష్టమై, గిట్టుబాటు ధరల్లేక, ఉన్నది అమ్ముకునే స్థితిలోకి అనివార్యంగా నెట్టబడుతున్నారు. అయితే ఆత్మహత్యలు చేసుకుంటున్నవారిలో ప్రధానంగా చిన్న, సన్నకారు రైతులు, అత్యధికంగా కౌలుదారులు. కౌలుదారులకైతే బ్యాంకు అప్పులు కూడా దొరకవు.

రైతులకూ, వ్యవసాయానికీ అప్పివ్వడానికి వెనుకాడే ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా తేలిన 3లక్షల కోట్ల రూపాయల మొండి బకాయిలను వసూలు చేయడానికి మీనమేషాలు లెక్కబెడ్తున్నాయి. డబ్బులు లేవు, ఆర్థికపరిస్థితి బాగోలేదంటూనే వేల కోట్ల కుంభకోణాల్లో మునిగిపోయాయి. ఒక్క భోఫోర్స్ కుంభకోణం పరిశోధించడానికి 250 కోట్ల ఖర్చు అయింది. ఫలితం మాత్రం శూన్యం. ఈ ఉదాహరణ మచ్చుకు మాత్రమే. ఇలా ఎన్నో కమిషన్లు, ఎన్నో కుంభకోణాలు, వేలకోట్ల ప్రజాధనం, ప్రజా సమయం వాటి పరిశోధనలకు ఖర్చుపెట్టడం జరుగుతోంది.

గ్రామీణ అభివృద్ధి కోసం పెడుతున్న ఖర్చు 1985-90ల్లో స్థూల జాతీయోత్పత్తిలో 14.5% కాగా 90ల తర్వాత 8% గా, 1998 నుంచి 6% కన్నా తక్కువకు పడిపోయింది. గత 5 సంవత్సరాల్లో గ్రామీణ అభివృద్ధికోసం పెడుతున్న ఖర్చు సగటున సంవత్సరానికి 30 వేల కోట్ల చొప్పున తగ్గించు కుంటూ పోయారని లెక్కలు చెప్తున్నాయి. అంటే పాలకులు 75%గా జనాభా ఉన్న గ్రామాలపైన, మొత్తంగా వ్యవసాయంపైన ఎటువంటి దృక్పథం, ప్రణాళిక కలిగివున్నారో ఈ అంకెలు మనకు చెప్తున్నాయి.

1990ల తర్వాత వ్యవసాయానికి పెడుతున్న పెట్టుబడి 300% కన్నా అధికమయ్యింది. ముఖ్యంగా మెట్టప్రాంత రైతులు (ముఖ్యంగా తెలంగాణా, రాయలసీమ)పెట్టే ఖర్చులో అదనంగా బోర్లు వేసుకోవడం, కరెంటు ఖర్చు తోడవుతున్నాయి. ఉన్నబోర్లు కాలిపోతే మళ్ళీ కొత్తబోర్లు వేసుకుంటూ పెట్టుబడి ఇబ్బడి ముబ్బడిగా పెరిగి, వడ్డీలపై వడ్డీలు పెరిగి అసలు కట్టలేని పరిస్థితి నుంచి బయటపడలేక ఆత్మగౌరవంతో చనిపోతున్నారు.

అమర్త్యసేన్ వంటి ఆర్థికవేత్తలుగానీ, నిన్నటి జయతిఘోష్ నివేదికగానీ సంక్షేమానికి, వ్యవసాయానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యతను నొక్కి చెప్పాయి. కారణాలొకటైతే మనపాలకులూ, కొంతమంది మేధావులూ రైతులు తాగుడుకు బానిసలవ్వడం వలన, జూదమాడడం వలన, అక్రమసంబంధాలవలన, మానసికరోగులని, డబ్బుకు ఆశపడి, తిన్నదరక్కని.......ఇలా రకరకాలుగా సమస్యను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇంతేకాకుండా చాలా అశాస్త్రీయంగా వరుణదేవుడు కరుణించలేదనే సులభమార్గాన్ని ఎంచుకున్నారు.

జయతీఘోష్ నివేదిక ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆ పరిస్థితికి కారణం పాలకుల విధానాలేనని నిర్ద్వంద్వంగా ప్రకటించింది. రైతును మార్కెట్‌కు వదిలివేయడం, సహకార సంస్థల రద్దు, వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి లేకపోవడం, మొత్తంగా ఈభారం చిన్న, సన్నకారు, కౌలురైతులపై పడిందని తేల్చి చెప్పింది.

ప్రత్యామ్నాయాలు సూచిస్తూ కౌలుదార్ల వివరాలతో సహా పట్టాపుస్తకాలు రూపొందించాలని, నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు అందేటట్లు చూడాలని, విత్తన బిల్లు-2004ను అమలు చేయాలని, కౌలుదార్లతో సహా అందరికి బ్యాంకు అప్పు అందివ్వాలని, సరైన సాంకేతిక సలహాలివ్వడానికి కావల్సిన సిబ్బంది నియామకాలు చేపట్టాలని ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో అమూల్యమైన, వాస్తవాధారితమైన సలహాలు,సూచనలు చేశారు. కాగితాలపై అన్నీ ఆమోదించినప్పటికీ వాస్తవానికి ఏ ఒక్కటి ఇంతవరకు ఆచరణకు నోచుకోలేదు.

ఒక 2004 సంవత్సరంలోనే రెండు వేలకు పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు ఉన్నరిపోర్టుల ఆధారంగా అర్థమవుతోంది.

రైతుల ఆత్మహత్యల వివరాలు:

ముదిరిన సంక్షోభం వల్ల రైతులు విపరీతమైన నిరాశలో కూరుకపోయి తమకు తోచిన ఏకైక పరిష్కారంగా ఎన్నుకొన్నారు. ప్రభుత్వం మారినా ఆశ ఏమి చిగురించలేదు. తన మరణ

పట్టిక	
1997-2002	2,600
1997-2002	2,600
2003	500 పైన
2004	2,000
2005	2000కు పైగా (ఏప్రిల్ వరకు)

వాంగ్మూలంలో "నా చావుకు ఎవరు కారణం కాదని, పంటకై చేసిన అప్పులే కారణమని" అమాయకంగా ప్రకటిస్తున్నారు. అసలు సంగతి పాలక విధానాలు, ప్రైవేటీకరణ, గ్లోబలైజేషన్ పేరు జరుగుతున్న సంస్కరణలు.

కర్షుడి చావుకి పలు కారణాలన్నట్లు నూతన ఆర్థిక విధానాలు, పర్యావరణ వ్యతిరేక విధానాలు, మార్కెట్ దోపిడీ, గిట్టుబాటు ధరలు లేకపోవడం, అప్పులూ వడ్డీలూ, కల్తీ విత్తనాలూ, పురుగుమందులూ , తప్పుడు వ్యవసాయ పద్ధతులు, పాత ఉత్పత్తి పరికరాలు- ఇలా ఎన్నో ఉన్నాయి. ఎక్కడ చూస్తే అక్కడ ముట్టుకుంటే సమస్యలు ముసురుకుంటాయి.

ఆదుకొని, అక్కున చేర్చుకోవాల్సిన వ్యవస్థలన్నీ బాధ్యతా రహితంగా చూస్తూ ఉన్నాయి. అన్నం పెట్టిన చేతులు రాజధాని హైదరాబాద్ నగరంలో అడ్డా కూలీలుగానూ, పనిలేకపోతే అడుక్కుతినో జీవితాన్ని వెళ్ళదీస్తున్నారు. అప్పుల వాళ్ళ వృత్తివాళ్ళకూ, ఇంటి అవసరాలకూ రైతులు కిడ్నీలు కూడా అమ్ముకున్న ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. గ్రామాల్లో విపరీతమైన వలసలు ఒకపక్క, దిక్కుతోచక పిల్లల ఆకలి తీర్చడానికి చివరకు శరీరాన్ని అమ్ముకునే పరిస్థితిలోకి నెట్టబడుతున్న స్త్రీల పరిస్థితి మరోపక్క ఇపుడు కళ్ళకుకట్టినట్లు కనిపిస్తోంది.

పాలకులెవరైనా చిత్తశుద్ధితో రైతులను ఆదుకొనేందుకు తగిన ప్రణాళికతో వెంటనే కార్యరంగంలోకి దూకకపోతే మనకు, భవిష్యత్ తరానికి తినడానికి గింజలుండవనేది కఠినమైన వాస్తవం. "అన్ని శక్తులు వ్యవసాయానికే"- అన్న స్ఫూర్తితో పనిచేస్తేనే ఈ వ్యవసాయ సమాజాన్ని బతికించుకోగలం. ఇంత పెద్ద యెత్తున కొనసాగుతున్న ఆత్మహత్యల పర్వాన్ని ఏదో వ్యక్తిగత కారణాలనే వితండ వాదన పక్కన బెట్టి, దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్ అనే స్ఫూర్తితో పనిచేస్తేనే ఈ మానవ సమాజం, వ్యవసాయ సమాజం మనగలుగుతుంది. స్వయంగా హైకోర్టు (7.06.05న) రాష్ట్ర ప్రభుత్వాన్ని మందలించి, రైతుల ఆత్మహత్యలకు కారణాలు వెంటనే కనుక్కోవాల్సిందిగా ఆదేశించింది. ఆ నివేదికను వెంటనే అందించాల్సిందిగా కోరింది. ఇప్పటికైనా పాలకులు చిత్తశుద్ధిని ప్రదర్శించకపోతే చేతులుదాటాక ఎవరినీ అని ప్రయోజనం వుండదు. వ్యవసాయాధారిత సమాజంలో రైతులే ఆత్మహత్య చేసుకుంటే మిగిలినవారంతా బతికే అర్హత కోల్పోతున్నట్లే. ❑

(20వ పేజీ తరువాయి)

కానీ బిల్లును యథాతథంగా ఆమోదించడానికి వామ పక్ష పార్టీలు మినహా మిగతా పార్టీలు ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా వ్యతిరేకించారు. ఆ తర్వాత 1998 జూలైలో భారతీయ జనతాపార్టీ సంకీర్ణ ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడానికి చేసిన ప్రయత్నాన్ని మాయావతి ములాయంసింగ్ తదితరులతోపాటు బి.జె.పి. ప్రతినిధి ఉమాభారతి ఇంకా కొందరి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవలసి వచ్చింది. పార్లమెంటులో బిల్లు ప్రవేశ పెట్టకుండా అడ్డుకోవడానికి ప్రయత్నించిన వారు ఈ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు, వాఖ్యానాలకు స్త్రీవాదులు ప్రతి వ్యాఖ్యానాలు ఎంత సంస్కార రహితంగా ఎంతో కాలం పత్రికల్లో పార్లమెంటులో కొనసాగిన విషయం దేశ ప్రజలకు అనుభవమే. 1998 జూలైలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం బిల్లును పార్లమెంటు గడపదాకా తీసుకెళ్ళి బిల్లు ఆమోదింప చేయగలగడం మాట అటుంచి కనీసం ప్రవేశపెట్టలేకపోయింది.

1997 నించి ఆయా పార్టీలు, వ్యక్తిగత స్థాయిలో కొందరు పార్లమెంటు సభ్యులు బి.సి.లకు, మైనారిటీలకు ముఖ్యంగా ముస్లిం మైనారిటీలు మహిళలకు 33 శాతం కేటాయించే స్థానాల్లో బి.సి.లకు మైనారిటీలకు కూడా ప్రతి కోటా కావాలని కోరుతున్నారు. 1996 డిసెంబర్‌లో పార్లమెంటుకు సమర్పించిన జయంత్ సెలక్ట్ కమిటి నివేదిక కూడా బి.సి.లకు మైనారిటీల ప్రత్యేక కోటాను తిరస్కరించింది. నాగాలాండ్ వంటి కొన్ని ఈశాన్య రాష్ట్రాలు తప్ప ఏ పార్టీ కూడా మహిళలకు చట్టసభల్లో ప్రత్యేక స్థానాలు కేటాయింపును ఇప్పుడు మొత్తంగా వ్యతిరేకించడం లేదు. కేటాయించే స్థానాల సంఖ్య హెచ్చుతగ్గుల సమస్య, మహిళలకు కేటాయించిన స్థానాల్లో స్త్రీలకు మైనారిటీలకు ప్రత్యేక దామాషా కేటాయింపును కోరుతున్నారు. గెయిల్ ఓంవిట్, మధు కిశ్వర్ వంటి కొందరు మహిళా ఉద్యమకారులు కొన్ని సందేశాలు, ఈ కేటాయింపు అమలు మెరుగు పరచడానికి చేసిన సూచనలతో కూడినవే. బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. నామమాత్రంగా ఉన్న స్థితిలో బిల్లెందుకు గట్టెక్కడం లేదని చూస్తే చట్ట సభల్లో మహిళలకు 33 శాతం కావాలంటూనే వారు బి.సి. మైనారిటీల వాటాను వ్యతిరేకిస్తూ బిల్లు ఆమోదం పొందకుండా ఉండడానికి కారణమవుతున్నారు. స్త్రీల స్థితిగతులు ఏకాండి శిలా సమానమైనవి ఎంతమాత్రం కాదన్న భౌతిక వాస్తవికను గుర్తించి బి.సి. మైనారిటీలకు కేటాయింపును అంగీకరించినప్పుడే ఇది సాధ్య పడుతుంది. ములాయం సింగ్ పదిశాతమే నన్న మొండి పట్టు మానుకొని పక్షంలో బిల్లుపై ఏకాభిప్రాయం కోసం వేళ్ళాడ్డానికి స్వస్థి చెప్పి బిల్లు ఓటింగుకు పెట్టాలి. అస్థిత్వ ఉద్యమ భావజాలాల మధ్య వైరుధ్యం పరస్పరం అర్థం చేసుకుని అసమానతల్ని అధిగమించడంలో పరస్పర సహకార వైఖరికి బదులు ఎవరి యుద్ధాలు వారివే నన్న శత్రు వైరుధ్యం పెంచుకునే పాక్షిక ప్రయోజన వైఖరులు మానుకొనంత వరకు పితృస్వామ్య అగ్రవర్ణ, అగ్రకుల దోపిడీ వర్గాల ఆధిపత్య ఎత్తుగడలను, అణచివేతను ఎదుర్కొని ధ్వంసం చేసే క్రమానికి దూరం అవడమే. ఇప్పటికైనా బి.సి.లకు, మైనారిటీలకు కూడా ప్రత్యేక స్థానాలు కల్పించే విధంగా చట్టసభల్లో మహిళలకు 33 శాతం స్థానాలు కేటాయించే బిల్లు ఆమోదానికి ఉభయ ధోరణులకు చెందిన వారు అంగీకరించాల్సి వుంది. అట్లా అంగీకరించని పక్షంలో ఓటింగు పెట్టి (ఆమోదించి వారు అత్యధికం, వ్యతిరేకించేవారు అతిస్వల్పం) పార్లమెంటు వెంటనే బిల్లుని ఆమోదించాల్సి ఉంది. ❑

గ్రామీణ రుణభారం

వి.హనుమంతరావు

(ఆంధ్రదర్శిని, 1959లో, నలభై ఆరు సంవత్సరాల కింద రాసిన ఈ వ్యాసం ఇవాళ్టికీ అవసరమైనదిగా, సమయోచితంగా ఉండడం వల్ల పునరుక్తిగా ప్రచురిస్తున్నాం - సం.)

నేటి భారతదేశంలోని గ్రామీణ ఆర్థిక పరిస్థితుల్లో రైతాంగానికి 'రెక్కాడితే కాని డొక్కాడ'దన్నట్లు అప్పుతెస్తేనేగాని వ్యవసాయం సాగదు. చాలామందికి పొట్ట కూడా గడవదు.

భారతదేశ జనాభాలో నూటికి 83 వంతులు, అంటే 35.10 కోట్ల జనాభాలో 29.50 కోట్లమంది గ్రామాల్లోనే నివసిస్తున్నారు. ఈ గ్రామ జనాభాలో 8.57 కోట్లమంది మాత్రమే స్వయం పోషకంగా ఉంటున్నారని, మిగతా వారంతా కొంతవరకో, పూర్తిగానో ఆధారం లేకుండా బ్రతుకలేనివారనే లెక్క తేల్చారు. అసలు గ్రామాల్లోగాని, పట్టణాల్లో గాని వ్యవసాయం మీదనే ఆధారపడేవారు నూటికి 70 మంది వున్నారని, అంటే దేశంలోని ప్రతి పదిమందిలో ఏడుగురు వ్యవసాయంమీదనే ఆధారపడుతున్నారని మన జనాభా లెక్కలు తెలియజేస్తున్నాయి.

ఈ గ్రామీణ ప్రజానీకం ముఖ్యంగా, వ్యవసాయం జీవనాధారంగా ఉన్న ప్రజలు సుఖంగా సంతృప్తిగా జీవిస్తుంటేనే జాతీయార్థిక జీవనం సౌష్ఠవంగా వుంటుంది.

సుమారుగా స్వయం పోషకంగా వుంటూన్న మన గ్రామీణ ఆర్థిక విధానం బ్రిటిషు సామ్రాజ్యవాదుల పరిపాలనలో తలక్రిందులైంది. రైతాంగం అప్పులపాలైంది. దేశంలో మొత్తం రుణభారాన్ని అంచనా వేయటానికి 1911 నుంచి అనేక సంస్థలు ప్రయత్నాలు చేశాయి. ఈ క్రింది పట్టిక ఆ ప్రయత్నాల ఫలితాలను సూచిస్తుంది:.

విచారణ జరిపినవారు	సంవత్సరం	రుణభారం
సర్ ఎడ్వర్డ్ మెక్లగన్	1911	300 కో.
ఎమ్.ఎల్.డార్లింగ్	1925	600 ,,
సెంట్రల్ బ్యాంకింక్	1929	900 ,,
ఎడ్వయిజరీ కమిటీ		
ప్రొఫెసర్ పి.జె.థామస్	1935	1200 ,,
రిజర్వు బ్యాంకు	1937	1800 ,,

ఒక అంచనా ప్రకారం ఈనాడు మన దేశంలో గ్రామీణ రుణభారం రెండువేల కోట్ల రూపాయలు!

రుణభారం - అంచనా

ఈ గ్రామీణ రుణభారం ఆంధ్రప్రదేశ్‌లో ఎంతవుందో తెలుసుకోవటానికి మనకు లెక్కలు లేవు. కాని అటు అవిభాజ్య మద్రాసు రాష్ట్రంలో వున్నపుడు, ఇటు తెలంగాణ ప్రాంతం హైద్రాబాదు రాష్ట్రంలో వున్నపుడు కొన్ని పరిశీలనలు జరిగాయి.

అప్పటి మద్రాసు రాష్ట్రంలో ఎంతమేరకు అప్పులున్నాయో విచారించే నిమిత్తం 1895-1946 సంవత్సరాల మధ్యకాలంలో ఐదుసార్లు ప్రయత్నం జరిగింది.

1895లో విచారణ జరిపిన సర్ ఫ్రెడరిక్ నికల్సన్ మొత్తం అప్పు రూ. 45 కోట్లుగా అంచనా వేశాడు. 1930లో విచారణ జరిపిన మద్రాసు బ్యాంకింగ్ విచారణ కమిటీ దానిని రూ.150 కోట్లుగా అంచనా వేసింది. అంటే 35 సంవత్సరాల కాలంలో రుణభారం మూడువంతులుపైగా పెరిగిపోయిందన్నమాట. 1930లో విచారణలు జరిపిన డాక్టరు పి.జె.థామస్, డబ్ల్యు.ఆర్.ఎస్. సత్యానాథన్ ఇద్దరూ కూడా దానిని రూ. 200 కోట్లుగా అంచనా వేశారు.

ఆంధ్రలోని కొన్ని జిల్లాలలో 1930 సంవత్సరంలో రుణభారంతో యెంతమంది క్రుంగిపోతున్నారో ఈ క్రింది పట్టిక తెలియజేస్తుంది:

(ఇచట యిచ్చిన సంఖ్యలు వందలో భాగం)

ఆస్తిదారులు	కృష్ణా	పశ్చిమ గోదావరి	తూర్పు గోదావరి
రు.500లోపు ఆస్తిగలవారు	55.77	69.31	91.84
రు. 500-1,000	38.22	43.44	44.39
రు. 1,000-5,000	25.97	26.15	27.30
రు. 5,000-10,000	19.49	21.99	22.58
రు. 10,000-20,000	16.82	18.28	18.78
రు. 20,000 పైన	14.63	19.48	23.82

ఎంత ఆస్తి తక్కువ వుంటే, అంత ఎక్కువ భారంలో మునిగి వున్నారని పై పట్టిక తెలియజేస్తుంది. వారిమీద రుణభారం ఎంతో కూడ తెల్సుకోవాల్సి వుంది.

కృష్ణా జిల్లా	
రైతుకున్న సగటు భూమి (ఎకరాలు)	రైతుకున్న సగటు అప్పు (రూ.లో)
1.70	237
3.55	137
5.60	541
11.50	193
17.44	138
34.49	95
పశ్చిమ గోదావరి	
1.25	275
1.98	281
5.10	1,307
9.09	462
39.90	182

దీనిని బట్టి 1930 సంవత్సరంలోనే అయిదు ఎకరాల భూమి ఉన్నా కూడా, భూమి నుంచి వచ్చే ఆదాయం చాలక అప్పులు చేసి బ్రతకాల్సిన పరిస్థితి వుందని విదితమవు తుంది.

ఈ రుణభారాన్ని గూర్చి మద్రాసు ప్రభుత్వ ఆర్థిక వేత్త బి.వి.నారాయణస్వామి విచారణ జరుపగా 1939 నాటికి 271.9 కోట్లకు పెరిగిందని తేలింది. అయితే యుద్ధానంతరం 1945 నాటికి 217.7 కోట్లకు తగ్గిందని అంచనా వేశారు.

ప్రభుత్వ చట్టాలు

1937-38 సంవత్సరాల్లో రుణ నివారణకు అప్పటి మద్రాసు ప్రభుత్వం కొన్ని చట్టాలు అమలుపరచి, రుణ భారాన్ని తగ్గించటం వల్ల, రుణభారాన్ని తగ్గించుకోవటానికి భూములు అమ్ముకొని తీర్చటంవల్ల ముఖ్యంగా ఈ రుణభారం తగ్గిందేగానీ, అసలు రుణాలు తీసుకోవటం తగ్గిందనిగాని లేక యుద్ధంలో ధరల పెరుగుదల వల్ల రుణాలు తీర్చగలిగే స్తోమత ఏర్పడిందనిగాని అనుకోవటం పొరపాటవుతుంది.

ఎందుచేతనంటే నారాయణస్వామి రిపోర్టు ప్రకారం యుద్ధంలో ధరల పెరుగుదలవల్ల డబ్బుకలవారు లాభపడి, వారి రుణభారం తగ్గించుకొన్నారు గాని, క్రింది తరగతులవారి భారం మరింత పెరిగింది. రాయలసీమలో 1943లో కరువు వల్ల నైతేనేమి, సర్కారు, కోస్తా జిల్లాలో తుఫాను బీభత్సం వల్ల నైతేనేమి పేదరైతులు, వ్యవసాయ కూలీలు మరింత అప్పులపాలయ్యారు. ఈ విషయాన్ని యీ క్రింది పట్టిక రుజువుచేస్తున్నది.

తలసరి సగటు రుణం

వర్గం	1939 రూ.	1945 రూ.	పెరుగుదల/ తగ్గుదల శాతం
25 ఎకరాలు పైనగల భూస్వాములు	188.5	113.1	-39.9
5-25 ఎకరాల మధ్య ,,	78.8	59.4	-24.6
5 ఎకరాల లోపు రైతులు	42.8	37.6	-12.3
కౌలుదార్లు	20.5	21.3	+ 4.1
భూమిలేని కూలీలు	5.7	8.3	+45.6

యుద్ధకాలంలో రుణభారం

1939-'45 మధ్య ఆంధ్ర జిల్లాలలో భూమిలేని కూలీల సంగతి చూస్తే సగటున ఒక్కొక్క కుటుంబానికి నాలుగు రూపాయలనుంచి 23 రూపాయలవరకూ పెరిగింది. 1939లో వ్యవసాయకూలీలు సాలుసరి సగటు కుటుంబ ఆదాయం రు.343.3 అయితే ఖర్చు రు.345.2 అయ్యేది. 1945 నాటికి ఆదాయంరు.675.8లకు పెరిగినా, ఖర్చు రు.719.9లకు, అంటే ఆదాయంకన్నా ఖర్చు రు.44.1లు పెరిగింది. అలాంటపుడు వారి రుణభారం పెరగక ఏమిచేస్తుంది?

1950-'51 మధ్య భారత ప్రభుత్వ కార్మిక శాఖవారు వ్యవసాయకూలీల జీవిత స్థితిగతుల విచారణ జరిపి నూటికి 49 వంతులు కుటుంబాలు అప్పుల పాలయ్యాయని, కుంటా, సెంటూ భూమిలేని వ్యవసాయ కూలీలు మరింత రుణభారానికి గురైవున్నారని, మొత్తం వ్యవసాయ కూలీ కుటుంబాలమీద చూసుకుంటే సగటున ప్రతి కుటుంబానికి రు.41ల అప్పు వుందని, అప్పులపాలైన కుటుంబాల సగటు అప్పు కుటుంబానికి రు.84లు వుందని అంచనా వేసింది.

ఈ అంకెలు మన మద్రాసు రాష్ట్రం మొత్తంలో 1,535 కుటుంబాల ఆదాయ వ్యయాలను పరిశీలన జరుపగా తేలిన అంకెలు.

రిజర్వు బ్యాంకు నియమించిన గోర్వాలా కమిటీ ఆంధ్ర ప్రాంతంలోని కర్నూలు, కడప, పశ్చిమగోదావరి, నిజామాబాదు, మహబూబునగరు జిల్లాలలోని కొన్ని గ్రామాలలో ఈ రుణభారం ఎంత వున్నదనే విషయం పరిశీలించి నివేదించిన రిపోర్టు ఈ రుణభారం ఎలా పెరుగుతూ వస్తుందనే విషయాన్ని తెలియజేస్తుంది.

కేశవయ్యంగార్ అంచనాలు

ఆనాటి హైదరాబాద్ రాష్ట్రంలో ఆర్థిక సలహాదారుగా పనిచేసిన కేశవయ్యంగార్ జరిపిన పరిశీలన ప్రకారం 1937 నాటికి రూ.46.21 కోట్లు అప్పువుందని అంచనావేశారు. అంతకుముందు పరిశీలన జరిపిన ఎస్.ఎం.బరూచా నివేదిక ప్రకారం అప్పుభారం రు. 64.64 కోట్ల రూపాయలు. నాటి తెలంగాణ జిల్లాలలోని 22,404 కుటుంబాల రుణ భారం రు.38,56,217లు అని తేలింది.

తెలంగాణ జిల్లాలలో రు.3,35,656ల విలువ గల భూమి తనఖాపెడితే రు.79,433లు మాత్రమే అప్పు పుట్టింది. ఈ అప్పుల్లో అధికభాగం పాత అప్పులు తీర్చటానికో, ఇంట్లో వివాహకార్యాలకో, గృహ ఖర్చులకో చేయబడ్డాయి.

వడ్డీ వివరాలు

ఇక వడ్డీ సంగతి చూస్తే నూటికి 600 రూపాయలు వడ్డీ తీసుకొన్న సందర్భం నల్లగొండ జిల్లాలో వున్నట్లు ఉదహరించబడింది. వడ్డీ నూటికి సాధారణంగా 12 నుంచి 25 శాతం వరకూ వుంది.

రుణభారం తెలంగాణ జిల్లాలలో నానాటికీ ఎలా పెరుగుతూవచ్చిందో 22,404 కుటుంబాలకు సంబంధించిన యీ క్రింది అంకెలు వుదహరిస్తాయి.

(అప్పుల మొత్తం - రూపాయలలో)

జిల్లా	1931	1939	1950
ఆదిలాబాదు	85,095	2,52,137	4,08,962
హైదరాబాదు	25,030	95,086	1,68,242
కరీంనగరు	1,04,589	1,32,996	1,80,840
మహబూబునగరు	1,71,666	3,91,817	10,55,898
మెదక్	21,845	67,520	2,82,657
నల్లగొండ	1,23,952	2,60,542	6,38,607
నిజామాబాదు	1,35,930	2,40,880	5,07,239
వరంగల్లు	2,50,845	3,06,270	6,13,772
మొత్తం	9,18,952	17,47,248	38,58,217

అంటే 20 సంవత్సరాల కాలంలో అప్పు నాలుగురెట్లు పెరిగిపోయిందన్నమాట.

ఏమైనా కాస్తో కూస్తో వెనకవేస్తే, దానిలో కూడా నాలుగోవంతు పాత అప్పులు, దాని మీద వడ్డీలు తీర్చటానికే పోయిందని అయ్యంగార్ తమ నివేదికలో పేర్కొన్నారు.

ఈ రుణాలు ఎలా పుట్టాయి? ఎవరెవరు ఎంతెంత యిచ్చారు?

మద్రాసు రాష్ట్రంలో నూటికి 3.3 వంతులు ప్రభుత్వం నుంచి, 3.1 వంతులు సహకార సంఘాల నుంచి, మరో 0.9 వంతు బ్యాంకులనుండి, అనగా మొత్తం 7.3 వంతులుపై మార్గాల ద్వారా లభించగా, మిగతా 92.7 వంతులు గ్రామంలోని వడ్డీ వ్యాపారులు, భూకామందులు, బంధువుల నుంచి లభించింది.

ప్రభుత్వం నుంచి పుట్టే అప్పు మొత్తం అప్పులో నూటికి 3.3 వంతులు మాత్రమే కావటం ఒక విశేషమైతే, అది ఎవరికి ముట్టుతుందో అనేది మరో విశేషం. సగటున చూసుకొంటే పెద్ద భూకామందుకు 24 రూపాయలు, చిన్న భూకామందుకు 13.5 రూపాయలు, మధ్యతరగతి రైతుకు 5.6 రూపాయలు, చిన్న రైతుకు 2.3 రూపాయలు ప్రభుత్వం అప్పుయిచ్చింది.

సహకార సంస్థల నుంచి పై వర్గాలకు దొరికే అప్పు కూడా అదే ధోరణిని సూచిస్తుంది. సగటున పెద్ద కామందుకు రు.21లు, చిన్న భూకామందుకు రు.13.5లు, మధ్యతరగతి రైతుకు రు.4.7లు, చిన్న రైతుకు రు.1.9లు ముట్టాయి.

రిజర్వుబ్యాంకు పరిశీలన

రిజర్వుబ్యాంకు నియమించిన గోర్వాలా కమిటీ పరిశీలనలో పై విషయాలు వ్యక్తమయ్యాయి. ఆంధ్ర జిల్లాలలోని మూడు జిల్లాల వివరాలు ఈ క్రిందివిధంగా వున్నాయి.

కడపజిల్లాలో ఒక్కొక్క కుటుంబానికి సగటున రు.439లు అప్పు పుట్టిందంటే, అందులో ప్రభుత్వం రు.12లు, సహకార సంస్థలు రు.7లు మాత్రమే ఇచ్చాయి. మిగతాదంతా వడ్డీవ్యాపారులే యిచ్చారు. కర్నూలు జిల్లాలో రు.476లలో ప్రభుత్వం ఒక్క రూపాయి, సహకార సంస్థ రు.18లు, పశ్చిమ గోదావరి జిల్లాలో రు.578లలో ప్రభుత్వం రు.12లు, సహకార సంస్థ రు.18లు మాత్రమే ఇవ్వగా మిగతాదంతా వడ్డీవ్యాపారుల వద్దనుంచే తెచ్చుకోవాల్సి వచ్చింది.

ఇక తెలంగాణ ప్రాంతంలో పరిస్థితి కూడా ఇంతకన్నా ఏమీ భిన్నంగా లేదు.

నూటికి 2.4 వంతులు ప్రభుత్వం, 6.6 వంతులు సహకార సంస్థలు ఇవ్వగా మిగతా 91 వంతులు అప్పు స్థానిక షావుకార్లు, వడ్డీ వ్యాపారులు, భూకామందుల వద్దనుంచే తెచ్చుకోవాల్సి వచ్చింది.

(మొత్తం అప్పులో ఆయా మార్గాలద్వారా పుట్టిన వివరాలు రూపాయలలో)

జిల్లా	ప్రభుత్వం	సహకార సంస్థ	వడ్డీవ్యాపారులు వగైరా
ఆదిలాబాద్	230	1,878	4,06,854
హైదరాబాద్	...	...	1,68,243
కరీంనగరు	...	...	1,80,840
మహబూబునగరు	2,776	28,708	10,24,414
మెదక్	2,456	44,000	2,36,201
నల్లగొండ	22,263	72,898	5,43,446
నిజామాబాదు	45,852	36,219	4,25,168
వరంగల్లు	18,352	32,562	5,62,858

నిజామాబాదు జిల్లాలోని నసరుల్లాబాద్, కొత్తార్మూర్ గ్రామాలలో 1928-'29 నాటి అప్పుల పరిస్థితిని 1950-'51 నాటితో పోల్చి చూడగా ఈ క్రింది విషయాలు తేలాయి.

వివరం	నసరుల్లాబాద్		కొత్తార్మూర్	
	28-29	50-51	28-29	50-51
ఈ కుటుంబాల సంఖ్య	35	150	64	169
మొత్తం అప్పు రు.లో అప్పుల పాలబడ్డ	3,880	10,062	2,465,	5,162
కుటుంబాల సంఖ్య	23	40	49	144
వడ్డీ రేటు	46 1/2-65	12-15	12-15	12-15

ఈ లెక్కలన్నీ ఏమి తెలియజేస్తున్నాయి?

1. వ్యవసాయం మీద ఆధారపడే అత్యధిక సంఖ్యాకమైన ప్రజలు గ్రామంలోని వడ్డీ వ్యాపారుల గుప్పిటలో చిక్కుకొని వున్నారు. ఈ వడ్డీ వ్యాపారులే వారి యజమానులు కావటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా తయారైంది.
2. రుణభారం నానాటికీ పెరుగుతూనే వుంది.
3. ప్రభుత్వం, సహకార సంస్థలిచ్చే రుణాలు ఒక మూలకు కూడా అందటం లేదు.
4. వారిచ్చే అప్పులు కూడా కలిగినవాళ్ళకి ముడుతున్నాయి. కాని, లేనివాడికి ముట్టడమే లేదు.

రుణబాధ నివారణ

దక్కన్ పీఠభూమి ప్రాంతంలో వ్యవసాయదారులు తిరుగుబాటు చేయడంతో అప్పటి సామ్రాజ్యవాద పరిపాలకులు 1879లో దక్కన్ వ్యవసాయదారుల విమోచన చట్టాన్ని తయారుచేయటం రుణవిమోచనకు మన భారత దేశంలో చేసిన మొదటి ప్రయత్నం అని చెప్పవచ్చు.

కాని నిజంగా రుణ విమోచనకు గమనించదగిన ప్రయత్నాలు 1930లో ఆర్థిక సంక్షోభం తరువాతనే ప్రారంభమయ్యాయి.

1937లో మద్రాసు రాష్ట్రంలో అన్ని రుణాలపైన మారటోరియం ప్రకటిన్తూ తయారుచేసిన బిల్లును భూస్వాములు తిరుగుబాటుచేయడంతో నాటి ప్రభుత్వం ఉపసంహరించుకొన్నా 1938లో తిరిగి వ్యవసాయదారుల రుణ నివారణ చట్టాన్ని ప్రవేశపెట్టింది. అలాగే మద్రాసు వ్యవసాయదారుల అప్పు తగ్గింపుచట్టం, రైతు రుణ నివారణ చట్టం ప్రవేశ పెట్టబడ్డాయి. ఈ చట్టాలన్నీ క్రింది సదుపాయాలు కల్గించాయి.

1. 1932 అక్టోబరు నాటికి పూర్వం తీసుకొన్న అప్పుల మీద అక్టోబరు 1937 నాటికి ఇంకా చెల్లించాల్సివున్న వడ్డీ బకాయిలన్నీ రద్దు చేయబడ్డాయి.
2. అక్టోబరు 1932- అక్టోబర్ 1937 మధ్యకాలంలో తీసుకొన్న అప్పుల మీద వడ్డీ నూటికి 5 రూపాయలు సామాన్య వడ్డీకన్నా మించరాదు.
3. 22 మార్చి 1938 తేదీకి తరువాత తీసుకొన్న అప్పుల మీద నూటికి 6 1/4 రూపాయలకన్నా ఎక్కువ వడ్డీ తీసుకోరాదు.
4. రుణం తీర్చాల్సిన రైతు అసలు కన్నా రెండు రెట్లు చెల్లించినట్లయితే, ఇక అప్పు తీర్చనవసరం లేదు
5. 1345 ఫసలీ నాటివరకూ ఉన్న కిస్తు బకాయిలన్నీ, 1346, 1347 ఫసలీల తాలూకు కిస్తు చెల్లించిన పక్షంలో రద్దుచేయబడతాయి.

చట్టాల నిస్సహాయత

ఈ ప్రయత్నాల వల్ల 1945 నాటికి ఉన్న 955 లక్షల అప్పు 457 లక్షలకు తగ్గింపు జరిగిందని బి.వి.నారాయణస్వామి అంచనా.

ఈ రుణ విమోచన చట్టాల మూలంగా స్థితిమంతులే బాగుపడ్డారనేది యథార్థం. ఉన్న అప్పును యీ చట్టాల ద్వారా తగ్గించుకొన్నా - రేపు ఎవరూ పైసా అప్పుపెట్టరనే భీతితో బీద - సాదలెవరూ యీ చట్టాన్ని వినియోగించుకొనలేకపొయ్యారు. పాత అప్పుల భారాన్ని మోస్తూనే ఉన్నారు.

హైద్రాబాద్ రాష్ట్రంలో 1948లో జరిగిన పోలీసు చర్యకు పూర్వంగాని, తరువాతగాని రుణ విమోచన భారాన్ని తగ్గించటానికి ఎటువంటి ప్రయత్నమూ జరుగలేదు.

సహకార సంస్థల ద్వారా బీదరైతాంగాన్ని వడ్డీ వ్యాపారుల, భూస్వాముల పాలిటబడకుండా చేయటానికి సత్ప్రయత్నం మద్రాసు రాష్ట్రంలో 1925లో ప్రారంభమైంది.

సహకార ఉద్యమం ద్వారా రైతాంగాన్ని వడ్డీవ్యాపారుల, దళారీల బారినుండి తప్పించటానికి ప్రయత్నం జరిగింది.

పోతే ప్రభుత్వం నేరుగా అనేకరకాలైన వ్యవసాయపు అవసరాలకోసం అప్పులు ఇస్తూ వచ్చింది.

ఎరువులు, మంచి విత్తనాలు, నూతుల త్రవ్వకానికి, ఆయిల్ పంపు సెట్లకు, పశువులు కొనుక్కోవటానికి, కమ్యూనిటీ ప్రాజెక్టుల ద్వారా అనేక రూపాలలో రుణ వసతిని ప్రభుత్వం కల్గించటానికి ప్రయత్నిస్తున్నది.

ప్రభుత్వ చర్యలు

మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో రు.36.89 లక్షల రూపాయల ఖర్చుతో 31,664 టన్నుల మేలురకం విత్తనాలు సరఫరా చేయబడ్డాయి.

ఎకరానికి 30 రూపాయల చొప్పున ఒక్కొక్క రైతుకు 500 రూపాయలవరకూ అప్పు యిచ్చారు.

రు.58.70 లక్షల ఖర్చుతో 1,430 యింజనుసెట్లు రైతులకు 3 నుంచి 5 వాయిదాలలో తీర్చుకొనే పద్ధతిపై అందజేశారు.

అవే షరతులపై 1,420 ఫిల్టరు పాయింటు ట్యూబ్‌వెల్స్ నూతులు త్రవ్వుకోవటానికి 80.81 లక్షల రూపాయలు సబ్సిడీ ఇచ్చారు. ఒక్కొక్క నూతికి రు.500 నుంచి 750 ల వరకూ సబ్సిడీ యివ్వబడింది.

ఇవికాకుండా సాముదాయక అభివృద్ధి పథకాల క్రింద ఆయా బ్లాకులలో 4,29,296 మణుగుల మేలిరకపు విత్తనాలు, 16,55,898 మణుగుల ఎరువు సరఫరా చేశారు.

ఇవి అన్నీ ఆంధ్రప్రాంతానికి సంబంధించిన లెక్కలు.

తెలంగాణ ప్రాంతంలో మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో 76,056 టన్నుల ఎరువులు, 3,51,547 టన్నుల కంపోస్టు, 6,51,753 టన్నుల మేలురకం విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేసింది. రైతులకు తక్కావీ అప్పుల రూపంలో 24 ట్రాక్టర్లు కూడా ఇచ్చింది. 1,666 నూతులు, 2,615 ఇంజను సెట్లు అప్పుల రూపంలో యివ్వబడ్డాయి.

అయితే ప్రభుత్వంగాని, సహకార సంస్థలు గాని కేవలం వ్యవసాయాభివృద్ధికి మాత్రమే అప్పులు ఇవ్వటం జరుగుతున్నది.

రుణభారం - సుడిగుండం

ఇప్పటివరకూ ఉన్న రుణభారాన్ని గోర్వాలా కమిటీ పరిశీలించి, వ్యవసాయదారులు చేసే రుణాల్లో నూటికి 40 వంతులు మాత్రమే వ్యవసాయ అవసరాలకు రుణాలు చేస్తున్నారని, మిగతా అప్పు అంతా, వ్యవసాయేతర అవసరాలకోసం, పొట్టగడవడానికోసం చేస్తున్నారని తెలియజేసింది.

కాగా, పాత రుణభారాన్ని రైతు నెత్తినుంచి దించటం, గ్రామీణ ప్రజానీకం ఆర్థికస్థితిని అభివృద్ధి పరచటం జరిగిననాడే ఈ రుణభారం అనే సుడిగుండం నుంచి రైతును తప్పించి దేశ పునర్నిర్మాణ కార్యక్రమంలో ఉత్సాహవంతంగా పాల్గొనేలా చేయగలం. ❑

ఆదివాసులపై అప్రకటిత యుద్ధం

- బిర్సు, టీచర్

భారత సమాజంలో అనాదిగా అన్ని విధాలుగా దోపిడీ, అణిచివేత, పీడనలకుగురై, నేటికీ ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలన్నింటిలో వెనుకబడి ఉన్న ఆదివాసీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అకారణంగా కత్తి కట్టాయి. వారి జీవన విధానానికి ప్రధాన ఆధారంగా వున్న భూముల నుండి గెంటివేసి, వారినోట్లో మట్టిగొట్టే దారుణానికి పూనుకుంటున్నాయి. రాజ్యాంగం, చట్టాలలో పేర్కొన్న కొద్దిపాటి హక్కులను కూడా కాలరాయడానికి పూనుకుంటున్నాయి. 'గ్రామీణ దారిద్ర్య నిర్మూలన, 'సామాజికాభివృద్ధి' పేరిట ఈ దుర్మార్గానికి ప్రభుత్వాలు పూనుకుంటున్నాయి. సామ్రాజ్యవాద దేశాలు, వాటి అంతర్జాతీయ దోపిడీకి ఒక ముఖ్య సాధనంగా వున్న ప్రపంచ బ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థల ఆదేశాలకు లోబడి గులాంగిరీ చేస్తున్న పాలకులీ రాక్షసత్వానికి పూనుకుంటున్నారనేది అత్యంత ప్రాధాన్యత కలిగి, గమనంలో వుంచుకోవలసిన అంశం. క్లుప్తంగా, సూటిగా చెప్పాలంటే, ఆదివాసీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రకటిత యుద్ధం ప్రకటించాయని పేర్కొనడం ఎంత మాత్రం అతిశయోక్తికాదు.

అపారఖనిజ నిక్షేపాల ఖని విశాఖ ఏజెన్సీ. ఇక్కడ లభ్యమయ్యే ప్రధాన ఖనిజం బాక్సైట్. జిల్లాలోని చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు, అరకు ప్రాంతాల్లో అపారంగా బాక్సైట్ నిక్షేపాలున్నాయి. ప్రపంచంలో 40 బిలియన్ టన్నుల బాక్సైట్ వుండవచ్చున్నది ఒక అంచనా. ఇందులో 7.1 శాతం అంటే సుమారు 3,077 మిలియన్ టన్నులు భారత దేశంలో వుంది. దేశం మొత్తం మీద బాక్సైట్ నిల్వల్లో 2,525 మిలియన్ టన్నుల ఖనిజాన్ని సులభంగా వెలికితీసే వీలుంది. ఇందులో 90 శాతం నిల్వలు అత్యంత నాణ్యమైనవిగా గుర్తించారు.

మన రాష్ట్రంలో తూర్పు తీర ప్రాంతంలో 1000 మిలియన్ టన్నుల ఖనిజాన్ని గుర్తించారు. ఇది ప్రధానంగా చింతపల్లి, అరకు ప్రాంతంలోనే వుంది. అరకు ప్రాంతంలోని గాలికొండ, రక్తకొండ, చిట్టెమగొందిలలో 55 మిలియన్ టన్నులు, చింతపల్లి ప్రాంతంలోని సప్పర్ల, జర్రెల, గూడెం, కాటమరాజు కొండల్లో 515 మిలియన్ టన్నుల బాక్సైట్ నిక్షేపాలున్నాయి. చింతపల్లి ప్రాంతంలో మొత్తం 21 ప్రదేశాల్లో బాక్సైట్ నిక్షేపాలున్నాయని గుర్తించారు. ఈ ప్రాంతంలోని జెర్రెల, సప్పర్ల గ్రూపులలో 'గిబ్‌సైట్' అనే రకం ఖనిజం లభిస్తున్నది. ఇది మంచి నాణ్యత కలిగిన ఖనిజం. అల్యూమినియం తయారీకి ఈ ఖనిజం 90 శాతం వరకూ ఉపయోగిస్తుంది.

అపార ఖనిజ సంపదను గత చంద్రబాబు ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు ఒప్పందంలో భాగంగా దుబాయ్ సామ్రాజ్యవాదులకు 5,000 వేల కోట్ల రూపాయలకు అమ్మివేయజూసింది. ఇందులో భాగమే 2000 సంవత్సరంలో 1/70 చట్టాన్ని సవరించేందుకు ప్రయత్నించారు. అయితే ఆదివాసీలు తమకు ఎదురయ్యే ప్రమాదాన్ని గుర్తించి ప్రతిఘటించడంతో వెనక్కు తగ్గారు. వాస్తవంగా ఆదివాసీల అనేక తిరుగుబాట్ల ఫలితంగా, ఆదివాసీల భూములు అన్యాక్రాంతం కాకుండా నిరోధించడానికి 1/70 చట్టం రూపుదాల్చింది. దీనిని సమర్థవంతంగా అమలు చేయకపోగా సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం చట్టాన్ని సవరించడానికి కూడా పూనుకున్నారు. అయినా పాలక వర్గాలకు ఆదివాసీల ప్రయోజనాలు పట్టవు కనుకనే - ఏదో విధంగా సామ్రాజ్య వాదులకే ధారాదత్తం చేయాలనే చూశాయి.

ప్రస్తుతం రాష్ట్రంలో వున్న వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలో వున్న యు.పి.ఎ. ప్రభుత్వం బాక్సైట్‌ను ప్రభుత్వ కంపెనీల మునుగులో సామ్రాజ్యవాదులకు కట్టబెట్టడానికి పూనుకుంటున్నాయి. ఏజన్సీ ప్రాంతంలో వున్న ఆదివాసీలను చీకటి నుండి వెలుగులోకి తీసుకువచ్చి 'అభివృద్ధి' చేయడానికని పాలకులు ప్రణాళికలు వేస్తున్నారు. ఇందులో భాగంగా ఏజన్సీ పాలక వర్గ ప్రతినిధులతో, నేషనల్ అల్యూమినియం కార్పోరేషన్ (నాల్కో), రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థలతో వై.ఎస్.ఆర్. కాంగీ ప్రభుత్వం చర్చలు జరిపి, బాక్సైట్‌ను వెలికి తీయడానికి జిందాల్ కంపెనీతో 9,000 వేల కోట్ల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకుని మార్గం సుగమం చేసుకుంది.

గతంలో నాగరిక సభ్యసమాజం అభివృద్ధి క్రమంలో ఫారెస్టు లోతట్టు ప్రాంతాలకు వీరిని నెట్టివేసింది. ఇప్పుడు సామ్రాజ్యవాదుల ఆదేశాలకు తలవంచి, అడవులను, ఖనిజ సంపదను బహుళజాతి సంస్థలకు, దేశంలోని కార్పోరేషన్ రంగానికి కట్టబెట్టడానికి ప్రభుత్వాలు పూనుకుంటున్నాయి. అడవిని నమ్ముకుని అడవితల్లి బిడ్డలుగా గుర్తింపు పొందిన ఆదివాసీలను బికారులను చేసి బయటకు తరిమివేయడానికి ప్రభుత్వాలు కంకణం కట్టుకుని వ్యవహరిస్తున్నాయి.

బాక్సైట్ వెలికితీసే పేరుతో ఏజన్సీలోని అరకు, అనంతగిరి, చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండలాల్లోని సుమారు 180 గ్రామాలకు చెందిన 45 వేల మంది ఆదివాసీలను తమతమ గ్రామాలనుండి, భూముల నుండి, అడవినుండి వెళ్ళగొట్టే ప్రమాదం పొంచి వుంది. అంతేగాకుండా బాక్సైట్ ప్రాజెక్టువస్తే ఆదివాసీలు పూర్తిగా నిర్వాసితులవుతారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని బైలదిల్లా గనుల వల్ల సుమారు 30 కిలోమీటర్ల పరిధిలో పర్యావరణం పూర్తిగా నాశనం అయినట్టే, ఇక్కడ కూడ పర్యావరణం పూర్తిగా నాశనం అవుతుంది. భూగర్భ జలాలు అడుగంటి పోయి, ఆదివాసీలకు తాగునీరు, సాగునీరు, సౌకర్యాలు దెబ్బతిని పోయే ప్రమాదముంది. అలాగే గనులు తవ్వకాల వలన సుమారు 10 కిలోమీటర్ల దూరంలోని గ్రామాలకు దుమ్ము, ధూళి వ్యాపించి, పంటలపై, తాగునీరుపై పడి ఆదివాసీలు అనారోగ్యాల పాలయి జీవితాలు చిన్నాభిన్నం అవుతాయి. మరీ ముఖ్యంగా అడవితో ఆదివాసీలకున్న ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక జీవన విధానానికి పెనుముప్పు ఏర్పడబోతోంది.

బాక్సైట్ వెలికితీయడానికి ఆదివాసీ సంఘాలకు బాధ్యత కల్పిస్తామని, ఆదివాసీలను ప్రలోభపెట్టడానికి వై.ఎస్.ఆర్. ప్రభుత్వం మోసపూరిత ప్రకటనలు చేస్తున్నది. గతంలో ఏజన్సీ ప్రాంతాల్లో ప్రాజెక్టులు నిర్మించినపుడు ఆదివాసీలకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వాలు నేటికీ అవి అమలు చేయలేకపోయాయి.

పైగా ప్రభుత్వం ఆదివాసీల శ్రమ సంపదను యధేచ్ఛగా దోపిడీ చేస్తూ, బడా భూస్వాములకు, పెట్టుబడిదారులకు, సామ్రాజ్యవాదులకు, సంపదను సమకూర్చి పెట్టే సాధనంగా మిగిలిపోయింది తప్ప ఆదివాసీల ప్రయోజనాలను నెరవేర్చేదిగా ఏ మాత్రం లేదు. రేపు బాక్సైట్ గనుల తవ్వకాలకు ఆదివాసీల నుండి ఎటువంటి ఆటంకాలు లేకుండా చేయడానికి ఒక ఎత్తుగడగా మాత్రమే ఆదివాసీ సంఘాలకు తవ్వకాల్లో భాగస్వామ్యం కల్పిస్తామని, పదివేల మందికి ఉపాధి కల్పిస్తామని ప్రభుత్వం అంటున్నది. వాస్తవంగా ఆదివాసీల ప్రయోజనాలు ఆశించి మాత్రం కానేకాదు.

రాజశేఖర రెడ్డి ప్రభుత్వం కూడా అచ్చం చంద్రబాబు ప్రభుత్వం లాగే 'అభివృద్ధి'ని నిత్యం జపిస్తూన్నది. ఒకరు రోడ్లు, కంప్యూటర్లు అభివృద్ధి అంటే మరొకరు ప్రాజెక్టులు అభివృద్ధి అంటున్నారు. అయితే నిర్దిష్టంగా అభివృద్ధి అంటే ఉత్పత్తి శక్తుల అభివృద్ధి అనే అర్థం. భావజాల పరంగా అయితే అభివృద్ధి ఉన్నతమైన సంస్కృతీ విలువలు నిర్మించి, నిర్దేశించే దృక్పథంగా చెప్పుకోవాలి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ నిర్దేశించే సంస్కరణలు వాస్తవ దృష్టిలో సంస్కరణలు కానట్లే ఆ భావజాల చట్రంలో భాగంగా మన పాలకులు చెప్పే రోడ్లు, ప్రాజెక్టులు మొదలగునవి కూడా అలాంటివే. పెట్టుబడిదారీ సమాజంలో అభివృద్ధి ఉత్పత్తి శక్తులను ఉన్నతీకరిస్తూ, లక్షలాది ప్రజలను వాళ్ళ భూములనుండి, అడవులనుండి, వృత్తులనుండి, నైపుణ్యం నుండి వేరుచేసి వేరొక జీవనోపాధిని చూపించలేక నిరుద్యోగులుగా మార్చివేస్తుంది. అంతేకాక ఈ పరిణామాలలో తప్పుడు చైతన్యం అందించే భావజాలాన్ని బలోపేతం చేస్తుంది. అభివృద్ధి క్రమంలో ఉత్పన్నమయ్యే వైరుధ్యాలు అనేక సామాజిక సంక్షోభాలకు, ఘర్షణలకు దారితీస్తున్న అనివార్య పరిస్థితులలో పాలక వర్గాలు ఒక వాదన బలంగా ముందుకు తీసుకొనివస్తున్నారు. అభివృద్ధి జరగాలంటే కొంతమంది నష్టపోక తప్పదని, కొంత త్యాగం అనివార్యమని, బాక్సైట్ ప్రాజెక్టు నేపథ్యంలో కూడా స్థానిక ఆదివాసీ ప్రజలు త్యాగం చేయక తప్పదని, నిర్వాసితులు నష్టపోవడం అనివార్యమని ప్రభుత్వాలు వాదిస్తున్నాయి.

ఆదివాసీలు, ఇతర పేద ప్రజల జీవనాధారంగా వున్న అడవులు, భూములనుండి వెళ్ళగొట్టటానికి ప్రభుత్వాలు ఎందుకు పూనుకుంటున్నాయి? వాస్తవంగా బాక్సైట్ వెలికి తీయకపోవడం మూలంగానే వీరు అభివృద్ధికి ఆమడ దూరంగా వున్నారా? వీరిని అడవి నుండి గెంటివేసి బాక్సైట్ వెలికి తీసినంత మాత్రాన, దారిద్ర్య నిర్మూలన జరిగి, సామాజికాభివృద్ధి జరుగుతుందా? దారిద్ర్య నిర్మూలనకు, సామాజికాభివృద్ధికి, నిజమైన ప్రత్యామ్నాయాలు లేవా? సామాజిక న్యాయం దృష్టిలో వుంచుకొని, సామాజిక శ్రేయస్సు కోరుకునే వాళ్ళందరూ వీటి గురించి తీవ్రంగా ఆలోచించాలి.

ఆదివాసీలను అడవి భూములనుండి వెళ్ళగొట్టి నిరాశ్రయులను చేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను అనేకమంది మేధావులు, వివిధ ప్రజా సంఘాలు, పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఆదివాసీలను అడవిభూములనుండి గెంటివేసి, 45 వేల మందిని నిరాశ్రయులను చేయటాన్ని నిరసిస్తూ, ప్రజాందోళన కార్యక్రమాల ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నా, ప్రభుత్వం స్పందన కనుచూపు మేరకు కానరావడం లేదు.

నేడు అడవీ ప్రాంతాలలో వున్న ప్రజలు, ముఖ్యంగా, ఆదివాసీలు, ఇతరులు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఆక్రమణల పేరుతో, బాక్సైట్ ప్రాజెక్టుల పేరుతో అడవిభూముల నుండి గెంటివేసే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల జీవన్మరణ స్థితిని ఎదుర్కొంటున్నారు. సాంప్రదాయకంగానూ, పోరాటాల ద్వారానూ సాధించుకున్న అడవి, భూములను, రక్షించుకోవడానికి, ఆదివాసీలు, ఇతర పేదలు నడుం బిగించాలి. బాక్సైట్ వెలికితీసే పేరుతో అడవి భూములనుండి, ఆదివాసీలను, ఇతర పేదలను గెంటివేసే విధానాన్ని రద్దు చేయాలి. ❑

(24వ పేజీ తరువాయి)

సమానత్వం సాధించటం రాజ్యం యొక్క లక్ష్యంగా పేర్కొన్నది. ఆదేశిక సూత్రాలలో 45వ ఆర్టికల్ రాజ్యాంగం అమలులోకి వచ్చిన నాటినుండి పదేళ్ళ కాలంలో 15 సంవత్సరాల లోపు పిల్లలకు నిర్బంధ ఉచిత విద్యను అందించాని సూచించింది. మొదటి పంచవర్ష ప్రణాళిక నుండే అందుకనుగుణమైన కృషి ప్రారంభమైంది. అయితే ఆడ పిల్లల విషయంలో ఇది ఆశించినంత ప్రయోజనం కలిగించటం లేదని అతి కొద్ది కాలానికి స్పష్టమైంది. అందువల్లనే 1958లో దుర్గాబాయి దేశముఖ్ అధ్యక్షతన బాలికల విద్యపై జాతీయస్థాయి కమిటీని (నేషనల్ కమ్యూనిటీ ఆన్ ఎడ్యుకేషన్ ఫర్ గర్ల్స్) ఏర్పాటు చేయటం జరిగింది. ఆడపిల్లలకు ప్రాథమిక, మాధ్యమిక స్థాయి విద్యను మరింతగా అందుబాటులోకి తీసుకొనిరావటానికి మరిన్ని వసతులు కల్పించాలని, అందుకు నిధుల కేటాయింపు జరగాలని ఈ కమిటీ సూచించింది. అంతేకాక ఆడపిల్లల విద్యను ప్రోత్సహించటానికి రాష్ట్ర స్థాయిలోను, జాతీయ స్థాయిలోనూ ప్రత్యేక సంఘాలను ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. ఫలితంగా 1968లో విద్యపై జాతీయ విధానం ప్రకటించ బడింది.

1978లో నిర్బంధోచిత విద్య విధానవరంగా కొంత సవరించబడింది. 6 నుండి 14 సంవత్సరాలలోపు పిల్లల పూర్తికాలపు చదువుకు ఇచ్చిన హామీని ఉపసంహరించుకొంటున్నదా అన్నట్లుగా ప్రభుత్వం పూర్తికాలం చదువుకొనటానికి వీలుకాని పిల్లలు పార్ట్‌టైం ప్రాతిపదికపైన చదువుకోవచ్చునని సూచించింది. 1986లో ప్రకటించబడిన జాతీయ విద్యావిధానం మాత్రం నిర్బంధోచిత విద్యా సౌకర్యాన్ని ఆడపిల్లలకు వర్తింప చేయటం గురించి నొక్కి చెప్పింది. 1992లో అక్షరాస్యత మీద నివేదికను సమర్పించిన నేషనల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ కూడా స్త్రీ విద్యకు ప్రాధాన్యతనిచ్చింది.

భారతదేశంలోని ఈ పరిణామాలన్నిటికీ విద్యావిషయకంగా సంభవిస్తున్న అంతర్జాతీయ పరిణామాలతో సంబంధం వుంది. ఐక్యరాజ్యసమితికి చెందిన యునెస్కో 1950 నుండే 'అందరికీ విద్య'ను సాధించటమే ప్రపంచ దేశాలకు 'ఎజెండా'గా ఇచ్చింది. 1990లో జరిగిన జమిటన్ ప్రపంచ విద్యా సదస్సు, 'అందరికీ విద్య' అన్న లక్ష్యానికి అన్ని దేశాలు పునరంకితం కావాలని ఉద్ఘాటించింది. ముఖ్యంగా విద్య సామాజికార్థిక అభివృద్ధికి సాధనం మాత్రమే కాదని, అదొక మౌలికమైన మానవ హక్కు అని ఈ సదస్సు నొక్కి చెప్పింది. దీనికి కొనసాగింపుగా 2000 సంవత్సరంలో డాకర్‌లో అంతర్జాతీయ విద్యా సదస్సు జరిగింది. ఇది 'అందరికీ' విద్య, అన్న లక్ష్యసాధన కోసం పరిమాణాత్మక లక్ష్యాను, నిర్దేశిత గడువును, విస్తృతమైన వ్యూహాన్ని ప్రకటించింది. 21వ శతాబ్దపు మొదటి పదిహేను సంవత్సరాలలో ఈ లక్ష్యాలను సాధించటానికి జరగవలసిన అంతర్జాతీయ ప్రయత్నాలకు యునెస్కో సంధాన కర్తగా వ్యవహరించాలని ఈ సదస్సు నిర్దేశించింది. డాకర్ ఫోరమ్ ఇచ్చిన అంతర్జాతీయ లక్ష్యాలు సాధించటానికి అవసరమైన చర్యలు గ్రామీణ పునాదుల మీద జాతీయ స్థాయిలో చేపట్ట వలసినవి. కనుకనే ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారతదేశ విద్యావిధానానికి సంబంధించిన అన్ని అంశాలను సమీక్షిస్తూ ఒక విద్యానివేదిక 2002లో వెలువడింది. ఈ నేపథ్యంలో భారతదేశంలో స్త్రీకి విద్య ఎంత వరకు అందుబాటులోకి వచ్చింది, స్త్రీల హోదాలో ఎంతవరకు మార్పు వచ్చింది - అని తరచి చూడవలసి వుంది.

III

స్త్రీకి విద్య ప్రాథమిక హక్కు అని గుర్తించిన చైతన్యంతో ప్రభుత్వం తీసుకొన్న విధాన నిర్ణయాలు ఏ విధంగా వాస్తవీకరించబడినాయో గణాంకాలు చూస్తే తెలుస్తుంది. మొదటి పంచవర్ష ప్రణాళిక ప్రారంభం నుండి బాలికల నిర్బంధోచిత ప్రాథమిక విద్యకు ప్రభుత్వం హామీ పడింది. నలభై సంవత్సరాల కాలం మీద దీని పరిణామాలు, ఫలితాలు ఎలా ఉన్నాయో పట్టిక-1లో గమనించవచ్చు.

పట్టిక - 1

జనాభా లెక్కల ప్రాతిపదికగా అక్షరాస్యత

సంవత్సరం	మొత్తం జనాభా లక్షలలో	అక్షరాస్యతా రేటు శాతంలో		
		పురుషులు	స్త్రీలు	మొత్తం
1951	4,392.30	27.16	8.86	18.33
1961	5,481.60	40.40	15.34	28.31
1971	6,833.30	45.95	21.97	34.45
1981	8.463.00	56.50	29.85	43.67
1991	8,463.00	64.13	39.29	52.2

ఆధారం:జనాభా లెక్కల నివేదికలు, భారత ప్రభుత్వం. న్యూఢిల్లీ

1951-91 మధ్య అక్షరాస్యులైన స్త్రీల శాతంలో పెరుగుదల కనిపిస్తుంది. అయినప్పటికి 1991 నాటికి అది 40 శాతం మించలేదు. 1991లో అక్షరాస్యులైన పురుషుల శాతంలో పోల్చి నప్పుడు స్త్రీలు 25 శాతం తక్కువగా వుండటం పట్టి-1లో చూడవచ్చు.

పట్టిక - 2

జెండర్ పరంగా గ్రామీణ - పట్టణ ప్రాంత అక్షరాస్యత

	1951	1991
పురుషులు		
గ్రామీణ	19.02	57.87
పట్టణ	45.06	81.09
మొత్తం	24.95	64.13
స్త్రీలు		
గ్రామీణ	4.87	30.62
పట్టణ	22.33	64.05
మొత్తం	7.93	39.29

ఆధారం:మినిస్టరీ ఆఫ్ హెచ్.ఆర్.డి., విద్యావిభాగాలు విడుదల చేసిన ఎంపిక చేసిన విద్యాగణాంకాలు (న్యూఢిల్లీ 1997)

అక్షరాస్యులైన పురుషుల శాతంలో 1951 నుండి 1991 మధ్య సాధించిన పెరుగుదల రేటుతో పోల్చినప్పుడు అదే కాల వ్యవధిలో అక్షరాస్యులైన స్త్రీల శాతంలో పెరుగుదల రేటు రెండురెట్లు అధికంగా వుండటం గనించవచ్చు. అయినప్పటికీ గ్రామీణ ప్రాంతాలలోగాని, పట్టణ ప్రాంతాలలో గాని అక్షరాస్యులైన పురుషుల శాతం కంటే స్త్రీల శాతం తక్కువే.

పట్టిక - 3

పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతం

సంవత్సరం	బాలురు			బాలికలు		
	I-V	VI-VIII	I-VIII	I-V	VI-VIII	I-VIII
1951	60.6	20.6	46.4	24.8	4.6	17.7
1991	114.0	76.6	100.0	85.5	47.0	70.8
1997-98	97.5	66.5	NA	81.2	49.5	NA

ఆధారం:ఎంపిక చేసిన విద్యాగణాంకాలు, హెచ్.ఆర్.డి. మినిస్ట్రీ విద్యావిభాగం, భారత ప్రభుత్వం, న్యూఢిల్లీ 1997

బాలురతో పోల్చినప్పుడు పాఠశాలల్లో బాలికల నమోదు తక్కువే. అయినప్పటికీ ప్రాథమిక విద్యలో 1951-91 మధ్య 24.8 నుండి 85.5 శాతానికి పెరగటం గుర్తించదగిన అభివృద్ధి. మాధ్యమిక విద్యలో 1951-98 మధ్య బాలికల నమోదు శాతంలో పెరుదలరేటు గణనీయంగా వున్నప్పటికీ అది యాభై శాతాన్ని కూడా చేరకపోవటం గమనించవచ్చు. 1991 దత్తాంశాలతో పోల్చినప్పుడు 1997-98లో బాలుర బాలికల నమోదు శాతం తగ్గింది. బాలికల మాధ్యమిక విద్య నమోదు మాత్రం ఇందుకు మినహాయింపు.

పట్టిక - 4

ప్రాథమిక మాధ్యమిక విద్యాస్థాయిలో అర్థాంతరంగా చదువులు ఆపేసిన వారి శాతం

	1961	1998-99
తరగతి I-V		
బాలురు	61.7	38.62
బాలికలు	70.9	41.22
తరగతి VI-VIII		
బాలురు	75.0	54.40
బాలికలు	85.0	60.09

ఆధారం:ఎంపిక చేసిన విద్యాగణాంకాలు, హెచ్.ఆర్.డి. మినిస్ట్రీ విద్యావిభాగం, భారత ప్రభుత్వం, న్యూఢిల్లీ 1997

ప్రాథమిక మాధ్యమిక స్థాయిలలో బాలురతో పోల్చినప్పుడు అర్థాంతరంగా చదువులు నిలిపివేసిన బాలికల శాతమే ఎక్కువ. అయితే బాలికల విషయంలో ప్రాథమిక విద్యా స్థాయిలో పోల్చినప్పుడు మాధ్యమిక విద్యాస్థాయిలో చదువు ఆపివేసే వారి శాతం ఎక్కువగా వుండటం ఈ పట్టికలో గమనించవచ్చు.

ప్రాథమిక మాధ్యమిక స్థాయిలలో బాలురతో పోల్చినప్పుడు అర్థాంతరంగా చదువులు నిలిపివేసిన బాలికల శాతమే ఎక్కువ. అయితే బాలికల విషయంలో ప్రాథమిక విద్యా స్థాయిలో పోల్చినప్పుడు మాధ్యమిక విద్యాస్థాయిలో చదువు ఆపివేసే వారి శాతం ఎక్కువగా వుండటం ఈ పట్టికలో గమనించవచ్చు.

పట్టిక - 5

డిగ్రీ, పీ.జి., సాంకేతిక వృత్తి విద్యా కోర్సులలో

విద్యాస్థాయి	1990-91		1996-97	
	బాలికలు	మొత్తం	బాలికలు	మొత్తం
డిగ్రీ స్థాయి (బి.ఎ/బియస్సీ/బికాం)	11.40 (34.7)	32.87	18.20 (37.4)	48.72
పిజి స్థాయి (ఎమ్.ఎ/ఎమ్మెస్సీ/ఎం.కాం)	1.16 (32.8)	3.54	1.65 (30.5)	5.41
బియడ్/బిటి	0.40 (44.2)	0.92	0.50 (43.1)	1.16
బి.ఇ/బియస్సీ (ఇంజనీరింగ్)బిఆర్క్	0.26 (10.9)	2.41	0.49 (14.9)	3.28
ఎమ్.బి.బి.యస్.	0.28 (34.2)	0.84	0.43 (35.4)	1.21
పి.హెచ్.డి/డియస్సీ/ డిప్లొమా	0.10 (26.2)	0.33	0.12 (29.2)	0.41
మొత్తం	13.60 (33.2)	40.91	21.39 (35.5)	60.19

ఆధారం:ఎంపిక చేసిన విద్యాగణాంకాలు, హెచ్.ఆర్.డి. మినిస్ట్రీ విద్యావిభాగం, భారత ప్రభుత్వం, న్యూఢిల్లీ 1997

డిగ్రీ, పి.జి. సాంకేతిక వృత్తి విద్యా కోర్సులలో నమోదైన మొత్తం విద్యార్థులలో బాలికల శాతం 1991లో 33.2 వుండగా 1996-97 నాటికి అది 35.5కు పెరిగింది. బాలికల సంఖ్యలో నిరపేక్ష వృద్ధి, సాపేక్ష వృద్ధి రెండూ కనిపిస్తాయి. అయినప్పటికి అది 35 శాతాన్ని మించకపోవటం గమనార్హం. మిగిలిన కోర్సులతో పోల్చినప్పుడు బి.ఎడ్.లో స్త్రీల శాతం ఎక్కువ. 1990-91లో 44.2 శాతం వుండగా అది 1996-97లో 43.1 శాతానికి తగ్గింది. అదే సమయంలో స్త్రీల శాతం కంటే మరీ తక్కువగా వున్నది సాంకేతిక వృత్తి విద్యా కోర్సులలో వైద్య విద్య ఇందుకు కొంత మినహాయింపు.

మొత్తం మీద స్త్రీల అక్షరాస్యతకు స్త్రీల హోదాకు సాపేక్ష సంబంధం వుందని అనేక అధ్యయనాలు వెల్లడి చేశాయి. ముఖ్యంగా జెండర్ నిష్పత్తిలో ప్రగతి సాధ్యమవుతుంది. ఆయుః ప్రమాణంలో పెరుగుదల వుంటుంది. జననాలరేటు, శిశు మరణాలరేటు, కాన్పు సమయంలో స్త్రీల మరణాల రేటు తగ్గుతాయి. వివాహం చేసుకొనే వయస్సు పెరుగుతుంది. ఈ విషయాలను భారత దేశంలోని వివిధ రాష్ట్రాలకు సంబంధించిన దత్తాంశాలు నిరూపించాయి. అందువలన స్త్రీల హోదాలో అభివృద్ధి కొరకు అవశ్యం విద్యా సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొనిరావాలి.

(మిగతా వచ్చే సంచికలో)

చరిత్రలో నిషేధాలు

ఎన్. వేణుగోపాల్

(సృజన - 1992 జూన్-డిసెంబర్ సంచికలో అచ్చయిన ఈ వ్యాసాన్ని దాని సమకాలీన ప్రాధాన్యత దృష్ట్యా పునరుక్తిగా అచ్చువేస్తున్నాం. - సం.)

"చరిత్ర ఒక సింహావలోకనం చేసే ప్రవక్త. జరిగిపోయిన వాటివల్ల, వాటికి వ్యతిరేకంగా జరగనున్న దేమిటో అది ప్రకటిస్తుంది" - ఎడువార్డో గలియనో

మనుషులను, భావాలను, ఆచరణలను నిషేధించడం బహుశా వర్గ వ్యవస్థ పుట్టుకొచ్చినప్పటి నుంచీ ఉండే ఉంటుంది. చార్వాకుల ఉదాహరణలు, ఎందరో వ్యక్తుల నాలుకలు కోసివేసిన ఘటనలు, దేశ బహిష్కారం విధించిన కథలు, చంపివేసిన కథలు చరిత్రనిండా కొల్లలుగానే ఉన్నాయి. భూస్వామ్యంలో, రాచరికంలో రాజాజ్ఞే అంతిమ శాసనం గనుక తమకు నచ్చని, తమకు వ్యతిరేకమైన భావాలు గల వాళ్ళ మీద ఆంక్షలు, నిషేధాలు విరివిగానే అమలయ్యేవి. అయితే భూస్వామ్య యుగంలో ప్రజా సంస్థల ఏర్పాటు గురించే మనకు వివరమైన సమాచారం లేదు గనుక ఆ సంస్థల మీద పాలకుల నిర్బంధాలు, నిషేధాలు ఎట్లా ఉండేవో కచ్చితంగా తెలియడం లేదు. వలసవాదం దేశంలో ప్రవేశించాక ప్రజా సంస్థలు విస్తృతంగా ఆవిర్భవించాయి. ఈ ప్రజాసంస్థల్లో క్రియాశీలమైన సంస్థల కార్యాచరణను అరికట్టడానికి బ్రిటిష్ ప్రభుత్వం ఆ సంస్థలను నిషేధించ పూనుకుంది. ప్రత్యేకంగా అందుకోనవే 1908లో క్రిమినల్ అమెండ్‌మెంట్ ఆక్ట్ తీసుకొచ్చింది. ఈ చట్టం అడుగుజాడల్లోనే నిజాం నిరంకుశ రాచరికం కూడా 1348 ఫసలీలో (1938) ప్రజా రక్షణ చట్టం తీసుకొచ్చింది. ఈ రెండు చట్టాలు కూడ ఏ సామాజిక, చారిత్రక సందర్భంలో అమలులోకి వచ్చాయో, ఏ యే సందర్భాల్లో మళ్ళీ మళ్ళీ అమలులోకి వస్తున్నాయో పరిశీలించడం ఆసక్తికరంగా ఉంటుంది.

కర్జన్ వైస్రాయ్‌గా ఉన్న కాలంలో బ్రిటిష్ ప్రభుత్వం మూడు చర్యల ద్వారా బెంగాలీల చైతన్యాన్నీ, సంఘటిత శక్తినీ దెబ్బతీయడానికి ప్రయత్నించింది. అవి, ఒకటి- 1899 కలకత్తా మునిసిపల్ అమెండ్‌మెంట్ ఆక్ట్, రెండు- 1904 ఇండియన్ యూనివర్సిటీ ఆక్ట్, మూడు- 1905 బెంగాల్ విభజన. క్రమక్రమంగా ఈ మూడు చర్యలు బెంగాలీ ప్రజానీకంలో స్వదేశాభిమానాన్ని, పోరాట శీలాన్ని పెంచాయి.

ముఖ్యంగా బెంగాల్ విభజన ప్రకటనతో బెంగాల్‌లో క్రియాశీల ఉద్యమాల శకం ప్రారంభమైంది. 1905 జులై 8న బెంగాల్ విభజన ప్రకటన వెలువడితే ఆగస్టు 7 నుంచి విదేశ వస్తు బహిష్కరణ ప్రారంభమైంది. ఒకవైపు విద్యావంతులలో ఈ నిరసన వెల్లువ చెలరేగుతుండగానే, మరోవైపు పెరుగుతున్న ధరలకూ, పెరగని జీతాలకూ మధ్య నలిగిపోతున్న కార్మికులు సమ్మెలకు దిగారు. మొట్టమొదటిసారిగా ట్రేడ్‌యూనియన్లను ఏర్పరచడానికి, వాటిని జాతీయోద్యమంలో భాగం చెయ్యడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. యూరపియన్ సంస్థలలో పని చేసే బెంగాలీ గుమస్తాలు, ప్రభుత్వ ముద్రణాలయాల్లో ప్రింటర్లు, కంపోజిటర్లు ఈ సమ్మెలకు నాయకత్వం వహించారు. బెంగాలీ కార్మికులు చేతులకు రాఖీలు కట్టుకుని, 'వందేమాతరం' అని నినదిస్తూ వీధుల్లోకొచ్చారు. మామూలు రోజు కూలీ చేసుకునే కార్మికులు కూడా తమ రోజు కూలీని జాతీయ నిధికి సమర్పించారు. ఈ స్వదేశీ ఉద్యమంలో అగ్రభాగాన నిలిచిన వాళ్ళు పాఠశాలల, కళాశాలల విద్యార్థులు. ఈ విద్యార్థి ప్రదర్శకుల మీద విరుచుకుపడడానికి ప్రభుత్వం కార్లయిల్ సర్క్యులర్ అనేదాన్ని తీసుకొచ్చింది. దాని ప్రకారం, జాతీయవాద విద్యార్థులు ప్రబలంగా ఉన్న విద్యాసంస్థలకు నిధులు, స్కాలర్ షిప్పులు ఆపేస్తానని, గుర్తింపును రద్దుచేస్తానని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో బెంగాల్ అంతటా సర్క్యులర్ వ్యతిరేక సమితులు తలెత్తాయి. ప్రభుత్వ విద్యా సంస్థలను కూడ బహిష్కరించాలని, వాటి స్థానంలో జాతీయ విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలని స్వదేశీ ఉద్యమం నిర్ణయించింది. 1909 నాటి లెక్కల ప్రకారం తూర్పు బెంగాల్‌లోనూ, అస్సాంలోనూ నలభై జాతీయ పాఠశాలలు ఏర్పడ్డాయి. వాటిలో విద్యార్థుల సంఖ్య రెండున్నర వేల నుంచి మూడు వేల దాకా ఉండింది. ఈ ప్రాంతంలో రాజకీయ ఉద్యమాలకు ఈ పాఠశాలలే కేంద్రాలయ్యాయి. ఈ పాఠశాలల్లో నుంచి విద్యార్థులు బైటికి వెళ్ళి స్వదేశీ ఉద్యమాన్ని ప్రచారం చేసేవాళ్ళు. చివరికి ఈ పాఠశాలలు వ్యాయామ శిక్షణా కేంద్రాలుగా కూడ మారాయి. లాఠీని, కత్తిని, చురకత్తిని ఉపయోగించడం కూడ ఇక్కడ నేర్పేవాళ్ళు. ఈ కార్యక్రమాల ఫలితంగా బెంగాల్ అంతటా ఒక స్వచ్ఛంద సేవకుల వ్యవస్థ ప్రారంభమైంది.

నిజానికి స్వదేశీ ఉద్యమంలో రెండు మూడు ప్రధానమైన ధోరణులు విడివిడి పాయలుగానూ, కొన్ని సందర్భాల్లో కలిసిపోయీ సాగాయి. స్వదేశీ ఉద్యమం ఒకవైపు కాంగ్రెస్ మితవాద నాయకుల ఆధ్వర్యంలో సాగుతుండగానే, ఆ ఉద్యమంలోంచి అతివాదులు తలెత్తనారంభించారు. మరోవైపుగత శతాబ్ది చివరా, స్వదేశీ

ఉద్యమానికి ఐదారేళ్ళ ముందరా బెంగాల్‌లో ఏర్పడుతూ వచ్చిన విప్లవకారుల బృందాలు స్వదేశీ ఉద్యమంలో పూర్తిగా పాల్గొన్నాయి. 1907 ఏప్రిల్‌లో బందేమాతరం పత్రికలో "శాంతియుత ఆశ్రమాలు, స్వదేశీ తత్వం, స్వయం సేవ వ్యవహారం" అసమగ్రమైనదని అరవింద ఘోష్ విమర్శించాడు. "నిర్మాణయుతమైన, ఎడతెరిపిలేని బహిష్కరణే" సరైన కార్యక్రమమని ప్రకటించాడు. బ్రిటిష్ వస్తువులను, అధికారిక విద్యను, న్యాయవ్యవస్థను, కార్య నిర్వాహక వ్యవస్థను బహిష్కరించాలన్నాడు. అంటే బ్రిటన్ నుండి దిగుమతి అయ్యే వస్తువులు కొనగూడదు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవగూడదు. వ్యాజ్యాల, తగాదాల పరిష్కారానికి ప్రభుత్వ న్యాయస్థానాలకు వెళ్ళగూడదు. ప్రభుత్వోద్యోగాలు చెయ్యగూడదు. అందుకు బదులుగా స్వదేశీ పరిశ్రమలు నెలకొల్పాలి. జాతీయ పాఠశాలలు స్థాపించాలి. స్థానిక ప్రజా పంచాయతీల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలి. అన్యాయమైన చట్టాలను పౌర శాసనోల్లంఘనం ద్వారా ఎదిరించాలని కూడా అరవిందఘోష్ ఈ వ్యాసంలో పిలుపిచ్చాడు. ప్రభుత్వ విధేయులకు సాంఘిక బహిష్కారం విధించాలన్నాడు. బ్రిటిష్ నిర్బంధకాండ సహనపు సరిహద్దులు దాటితే సాయుధ పోరాటానికైనా సిద్ధపడాలని హెచ్చరించాడు.

మరోవైపు నుంచి పాఠశాలల, కళాశాలల విద్యార్థుల నుంచి రూపొందుతున్న స్వచ్ఛంద సేవకులు సమితులలో చేరడం మొదలయింది. 1906 ఏప్రిల్‌లో బారిసాల్‌లో జరిగిన బెంగాల్ ప్రావిన్షియల్ కాన్ఫరెన్స్‌తో స్వచ్ఛంద సేవకుల ఉద్యమం ప్రాముఖ్యంలోకి వచ్చింది. బారిసాల్‌లోనే 200 మంది వలంటీర్లతో స్వదేశ్ బాంధవ్ సమితి ఏర్పడింది. ఈ సమావేశం జరగకుండా చేయడానికి, వలంటీర్లు నిషేధాజ్ఞల్ని ఉల్లంఘించి వీధుల్లో వందేమాతరం గీతం పాడకుండా చేయడానికి పోలీసులు విరుచుకుపడ్డారు. సురేంద్రనాథ బెనర్జీని, కార్యకర్తలను అరెస్టు చేశారు. దేశవ్యాప్తంగా ఈ పోలీసు చర్యకు నిరసన ప్రదర్శనలు జరిగాయి.

మరికొద్ది రోజులకే ఈ వలంటీర్ల బృందాలతో కూడిన సమితులు తూర్పు బెంగాల్ అంతటా వ్యాపించాయి. బ్రిటిష్ వస్తు బహిష్కారం పెద్ద ఎత్తున, క్రమ బద్ధంగా జరిగింది. ఈ ఉద్యమంలో భాగంగా బలప్రయోగాన్ని విశ్వసించే బృందాలు బలపడ్డాయి. కలకత్తాలో ఆంటీ సర్క్యులర్ సొసైటీ, వందేమాతరం, సాంప్రదాయ్, బ్రతి సమితి ఏర్పాటయ్యాయి. తూర్పు బెంగాల్‌లో బారిసాల్ స్వదేశ్ బాంధవ్ సమితి, ఫరీద్‌పూర్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్, ఫరీద్‌పూర్ బ్రతి సమితి, ఢాకా అనుశీలన్ సమితి, మైమెన్ సింగ్ సుహృద్ సమితి వంటి అనేక సంస్థలు ఏర్పడ్డాయి. వీటి సభ్యత్వం పదివేలకు మించి ఉంటుందని అంచనా వేయబడింది. స్వదేశ్ బాంధవ్ సమితికి 175 శాఖలుండేవి. వాళ్ళు సభలు, సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించేవాళ్ళు. స్వదేశీ జాతా అనే కళాకారుల బృందాన్ని తయారు చేసి దేశభక్తియుత కార్యక్రమాల్ని ప్రదర్శిస్తూ గ్రామాల్లో తిరిగేవారు. ఈ ప్రదర్శనల్లో ప్రతాపాదిత్య, సిరాజుద్దౌలా, పృథ్వీరాజ్ మొదలయిన నాటకాలుండేవి. బ్రిటిష్ న్యాయ వ్యవస్థను ధిక్కరించి భారతీయ, ప్రత్యామ్నాయ న్యాయ వ్యవస్థను స్థాపించాలనే లక్ష్యాన్ని కూడ స్వదేశ్ బాంధవ్ సమితి పెద్ద ఎత్తున చేపట్టింది. సమితి తొలి వార్షిక నివేదికలో, అంటే 1906 సెప్టెంబర్ నాటికి, 523 గ్రామీణ తగాదాలను, 89 పంచాయతీ కమిటీల ద్వారా పరిష్కరించామని రాసుకున్నారు.

ఈ ఉద్యమ వెల్లువలో ఒక ప్రధానమైన పాయ ఢాకా అనుశీలన్ సమితి. 1906 సెప్టెంబర్‌లో కలకత్తా నుంచి బిపిన్ చంద్రపాల్, ప్రమథ నాథ మిత్రలు ఢాకా వచ్చి స్వదేశీ ఉద్యమం గురించి ఉపన్యాసాలు చేశారు. అప్పటికే ఢాకాలో వ్యాయామశాలలు నడుపుతున్న ఉపాధ్యాయుడు పులిన్ బిహారీదాస్ జిల్లాలోని వలంటీర్లతో ఢాకా అనుశీలన్ సమితి ఏర్పరిచాడు. ఇది స్వతంత్ర సంస్థే అయినా, ప్రమథనాథ మిత్ర నాయకత్వంలోని కలకత్తా అనుశీలన్ సమితితో సన్నిహితంగా ఉండేది.

బారిసాల్ స్వదేశ్ బాంధవ్ సమితి బహిరంగ ప్రజా సంస్థగానూ, ఢాకా అనుశీలన్ సమితి రహస్య విప్లవ సంస్థగానూ పనిచేస్తుండేవి. మొదటి నుంచీ కూడ ఢాకా అనుశీలన్ సమితి ఉక్కు క్రమశిక్షణ గల అర్ధసైనిక సంస్థగా పని చేస్తుండేది. స్వదేశీ భావాల ప్రచారానికీ, యువకుల శారీరక దారుఢ్య శిక్షణకూ ఈ సంస్థ సమాన ప్రాధాన్యత ఇచ్చేది. ఈ సంస్థకు హిందూ ఆధ్యాత్మికత పునాదిగా ఉండేది. ప్రమాణ దీక్షలు, శపథాలు, తప్పనిసరి గీత బోధనలు, స్వామి వివేకానంద రచనల అధ్యయనం వంటివి ఈ సంస్థ పాటించేది. మూడువేల మంది సభ్యులపైన ఢాకాలో కేంద్ర సమితికి అగ్రనాయకుడుగా కెప్టెన్ జనరల్ ఉండేవాడు.

వ్యాయామం, శారీరక శిక్షణ, ఆయుధ వినియోగంలో శిక్షణ సమితి ప్రధాన కార్యకలాపాలు. బ్రిటిష్‌వారిని బలప్రయోగంతో వెళ్ళగొట్టడం సమితి ఆశయం. నిజానికి 1907 నాటికే స్వదేశీ ఉద్యమం లోలోపల క్రియాశీల ధోరణులు వ్యక్తం కాసాగాయి: "ప్రతి జిల్లాలోనూ ఉన్న ఇంగ్లీషు అధికారుల సంఖ్య ఎంత? దృఢమైన నిర్ణయం తీసుకుంటే ఇంగ్లీషు పాలనను ఒక్కరోజులో అంతం చేయవచ్చు..... సోమరిగా కూచుంటే, మొత్తం జనాభా తిరగబడేవరకు వేచి ఉండాలని అనుకుంటే ఎప్పటికీ క్రియారహితంగానే కూచోవలసి వస్తుంది.... దేశభక్తులారా! రక్తతర్పణ లేకుండా దేశం మేల్కొంటుందా?" అని 1907 మార్చ్‌లోనే యుగాంతర్ పత్రిక రాసింది. అనుశీలన్ డ్రిల్ మాన్యువల్‌లో చురకత్తులను, కత్తులను, లాఠీలను, వెదురు ఈటెలను వాడడం గురించి వివరాలుండేవి.

అనుశీలన్ సమితి బలపడిన తర్వాత భారతీయుల మీద యూరోపియన్ల దాడులు తగ్గాయి. బెంగాలీ యువకుల చేతికి బ్రిటిషర్లు చిక్కడం సాధారణమైంది. ప్రధానంగా హిందూ చిహ్నాలమీద ఆధారపడిన విప్లవకారులు కాళికాదేవికి "తెల్లమేక"లను బలి ఇస్తామని, "ఫరంగీల వేడి నెత్తురు తాగుతామని" ప్రకటించారు. నిజానికి ఈ విప్లవ హింసకు బలి అయిపోయినవాళ్ళు ఎక్కువ మంది భారతీయులే. సహజంగానే ఇన్‌ఫార్మర్లు, ద్రోహులు, గూఢచారులు భారతీయులే అయి ఉండడం వల్ల వాళ్ళే ఎక్కువమంది చచ్చిపోయారు. కాని మొట్టమొదటి దాడులు తెల్లవాళ్ళ మీదనే ఎక్కుపెట్టబడ్డాయి. 1907 డిసెంబర్‌లో బెంగాల్ లెఫ్టినెంట్ గవర్నర్ ప్రయాణిస్తున్న రైలును పేల్చేసే ప్రయత్నం జరిగింది. ఢాకా జిల్లా మెజిస్ట్రేట్‌ను కాల్చేసే ప్రయత్నం జరిగింది. 1908 మార్చ్‌లో కుష్టియాలో ఒక మిషనరీని కాల్చేసే ప్రయత్నం జరిగింది. ఏప్రిల్‌లో చందర్‌నాగోర్ మేయర్‌ను పేల్చేసే ప్రయత్నం జరిగింది. అదే నెల ముజఫర్‌పూర్‌లో చీఫ్ ప్రెసిడెన్సీ మెజిస్ట్రేట్ ఒక వాహనంలో ఉన్నాడనుకుని కాల్పులు జరపగా ఇద్దరు ఇంగ్లీషు స్త్రీలు చచ్చిపోయారు. అదే సమయంలో ఎం.ఎన్.రాయ్ నాయకత్వంలో ఈస్ట్ బెంగాల్ స్టేట్ రైల్వేలైన్ మీద ఎన్నో బాంబు దాడులు జరిగాయి. కలకత్తా శివార్లలో మానిక్‌తలాలో ఒక ఆధ్యాత్మిక పాఠశాలను, బాంబుల ఫ్యాక్టరీని పెట్టే ప్రయత్నం జరిగింది. ఈ ప్రయత్నం బైటపడి కుట్రకేసు విచారణ జరుగుతుండగా, కుట్రకేసును పరిశోధిస్తున్న ఒక పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌ను, ఒక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను, ఒక ముస్లిం సిఐడి అధికారిని విప్లవకారులు కాల్చి చంపారు. ఈ క్రమంలో ఆర్థిక దాడులు, ఆయుధాల కోసం దాడులు కూడా విస్తృతంగానే జరిగాయి.

చిట్టచివరకు విప్లవకారులందరూ అనుశీలన్ సమితి, జుగాంతర్ పార్టీ అనే రెండు సంస్థలుగా ఏర్పడ్డారు. కలకత్తా అనుశీలన్ సమితిలో నుంచే తీవ్రవాదులు జుగాంతర్ పత్రికను స్థాపించి, క్రమక్రమంగా జుగాంతర్ పార్టీగా రూపొందారు. ఈ రెండు సంస్థల నిర్మాణాలలోను, లక్ష్యాలలోను కొన్ని భేదాలుండేవి. జుగాంతర్ పార్టీ విడివిడిగా ఉండే స్థానిక దళాల సమాఖ్యగా ఉండేది. దళనాయకులను దాదా (అన్న) అని పిలిచేవాళ్ళు. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో జర్మన్ల సహాయంతో ఆయుధాలు, మందుగుండు సంపాదించి బ్రిటిష్ ప్రభుత్వం మీద పెద్ద ఎత్తున సాయుధ తిరుగుబాటు జరపాలని జుగాంతర్ నాయకుడు జతిన్ ముఖర్జీ ప్రణాళిక వేశాడు. ఆ సమయంలో జుగాంతర్ పార్టీ నిర్మాణం క్రమబద్ధతను సంతరించుకుంది. మైమెన్‌సింగ్ గ్రూప్, బారిసాల్ గ్రూప్, కలకత్తా ఆత్మోన్నతి గ్రూప్, సేవాసమితి, మదారిపూర్ పార్టీల ప్రతినిధులతో ఒక కమిటీని జతిన్ ముఖర్జీ ఏర్పరిచాడు. ఈ భారత- జర్మన్ ఒడంబడిక కార్యరూపం దాల్చకముందే బయట పడింది. 1915 సెప్టెంబర్‌లో జతిన్ ముఖర్జీని పోలీసులు కాల్చి చంపారు. ఆ తర్వాత జాదూ గోపాల్ ముఖర్జీ నాయకత్వంలో జుగాంతర్ కార్యకర్తలు మూసర్ పిస్తోళ్ళతో హత్యల పరంపర సాగించారు.

ఈ భారత-జర్మన్ ప్రయత్నాల నుంచి అనుశీలన్ సమితి దూరంగా ఉండి పోయింది. హత్యలు, దాడులు సాగిస్తూ ఉండింది. అయితే దీనికి జుగాంతర్ పార్టీ కన్న దృఢమైన నిర్మాణం ఉండేది. కేంద్రీకృతంగా, పైనుంచి కిందికి అంతస్తులతో నిర్మాణం ఉండేది. తూర్పు బెంగాల్‌లో, అస్సాంలో జుగాంతర్ పార్టీకి నాలుగు పాలనా విభాగాలుండేవి. ఈ మొత్తం సంస్థకు పులిన్‌దాస్ అగ్రనాయక స్థానంలో ఉండేవాడు. ఆయనకు సంపూర్ణాధికారాలుండేవి. సమితి కేంద్ర కార్యాలయంలో రాత్రింబవళ్ళు కావలా ఉండేది. నియమాలను ఉల్లంఘిస్తే తీవ్రమైన శిక్షలుండేవి. పులిన్‌దాస్ ఆదేశాలు లేకుండా ఏ పనీ జరిగేది కాదు. ప్రతి జిల్లాకూ ఒక జిల్లా ఆర్గనైజర్‌ను నియమించేవారు. సమితి శపథాలు అచ్చువేసి జిల్లాలకు పంపించేవాళ్ళు. జిల్లా ఆర్గనైజర్ జిల్లాలోని ప్రతి ఉన్నత పాఠశాలతోనూ, కళాశాలతోను సంబంధాలు పెట్టుకోవలసి ఉండేది. జిల్లాలో ప్రచారం కొనసాగించి, ప్రతి తరగతి నుంచి విద్యార్థులను సమితిలోకి సభ్యులుగా తీసుకోవలసి వుండేది. అట్లా సమితిలో చేర్చుకున్న ప్రతి కొత్త విద్యార్థి పూర్తి వివరాలు కేంద్ర సమితికి తెలపవలసి ఉండేది. తన ప్రాంతంలో ప్రభుత్వ విధేయుల నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకోవడంగాని, దొంగిలించడం గాని ఆర్గనైజర్ కర్తవ్యాలుగా ఉండేవి. కాని ఢాకా నుంచి అనుమతి లేకుండా పెద్ద చర్యలేవీ చేపట్టడానికి వీలులేదు. త్రైమాసిక నివేదికలు, జమా ఖర్చు లెక్కలు తప్పనిసరిగా ఢాకాకు పంపవలసి ఉండేది. జిల్లా కేంద్రాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు ఉపన్యాసకులను పంపించేవాళ్ళు. ప్రతి గ్రామంలో సమితి శక్తి గురించి, పొందిన శిక్షణ గురించి, ఆ గ్రామ జనాభా గురించి, గ్రామ నైసర్గిక పరిస్థితుల గురించి అతి చిన్న వివరాలతో సహా సేకరించడానికి కిందిస్థాయి కార్యకర్తల దగ్గర ప్రశ్న పత్రాలుండేవి. ప్రభుత్వంతో తలపడడానికి సమయం రావాలనీ, రహస్యంగా, గుట్టుచప్పుడు కాకుండా పనిచేస్తూ అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాకనే ప్రభుత్వం మీద దాడి చేయాలనీ పులిన్‌దాస్ భావించేవాడు.

ఈ పోరాట కథనానికి మధ్యలోనే ఈ పోరాటం మీద నిర్బంధాలు, నిషేధాలు మొదలయ్యాయి. 1907 మే, నవంబర్‌లలో నిర్దిష్ట ప్రాంతాలలో "రాజద్రోహకరమైన" సమావేశాల్ని నిషేధించే ఉత్తర్వులొచ్చాయి. ముద్రణాలయాల్ని జప్తు చేసుకునే అధికారం ఇచ్చే పత్రికా చట్టాలు 1908 జూన్‌లో, 1910 ఫిబ్రవరిలో వెలువడ్డాయి. 1908 డిసెంబర్‌లో వచ్చిన క్రిమినల్ లా అమెండ్‌మెంట్ ఆక్ట్ అనే చట్టం దేశంలో ప్రజా సంస్థల్ని నిషేధించే

అధికారాల్ని ప్రభుత్వానికిచ్చింది. ఈ చట్టం కింద మొట్టమొదట 1909 జనవరిలో ఐదు ప్రధాన సమితులను (స్వదేశ్ బాంధవ్, బ్రతి, ఢాకా అనుశీలన్, సుహృద్, సాధనా) నిషేధించారు. 1908 డిసెంబర్‌లో తొమ్మిది మంది బెంగాలీ నాయకులను దేశాంతర వాసం పంపించారు. ఇన్ని నిషేధాలను, నిర్బంధాలను తట్టుకుని కూడ ఈ సంస్థల కార్యాచరణ కొనసాగింది. చివరికి 1917 డిఫెన్స్ ఆఫ్ ఇండియా ఆక్ట్ ప్రకటించి జుగాంతర్, అనుశీలన్ నాయకులను జైళ్ళలో పెట్టారు. కార్యకర్తల మీద గ్రామాలు వదలగూడదని నియమాలు పెట్టారు.

ఈ మొత్తం కథనం తేల్చి చెప్పేదేమంటే, ప్రజా ఉద్యమం మీద బ్రిటిష్ ప్రభుత్వం అమలుచేసిన నిర్బంధకాండ విఫలమైపోయింది. నిషేధించిన సంస్థలు నిజానికి ఇంకా విస్తృతమయ్యాయి, బలపడ్డాయి. స్వదేశీ ఉద్యమ కాలపు బహిరంగ సంస్థలు పోలీసు దమనకాండకూ, నాయకత్వపు మితవాదానికీ బలి అయి విచ్ఛిన్నమై పోయినప్పుడు, ఈ నిషిద్ధ సంస్థలే అజ్ఞాత వాసంలో పనిచేస్తూ, రానున్న విప్లవ ప్రయత్నాల్ని ప్రచారం చేస్తూ జాతీయోద్యమ స్ఫూర్తిని సజీవంగా ఉంచాయి. అంతేగాక ఈ నిషిద్ధ బృందాల నుంచే గదర్ పార్టీ, తొలి భారతీయ కమ్యూనిస్టులు రూపొందారు. ఆ రకంగా వలసవాద ప్రభుత్వం ప్రకటించిన నిషేధం, అమలు చేసిన నిర్బంధకాండ జాతియోద్యమ చైతన్యాన్ని అరికట్టలేదు సరిగదా, క్రియాశీల జాతీయోద్యమానికి, నిజమైన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట ధారకు దారితీసింది.

- - -

ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ పరిపాలనలో అక్షరాస్యుల జనాభా ఆరుశాతం. హైదరాబాద్ సంస్థానంలో ఉస్మాన్ అలీఖాన్ పాలన ప్రారంభకాలానికి రెండు మూడు చోట్ల తెలుగు గ్రంథాలయాలు ఏర్పడడం మినహా ప్రజాసంస్థల ఏర్పాటు జరగలేదు. అసలు సంస్థాన రాజకీయాలలోనే కనీస ప్రజాస్వామ్యం కూడ అమలులో లేకుండింది. మొదటి సాలార్‌జంగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఒక శాసనసభను ఏర్పరిచే ప్రయత్నం జరిగింది గాని ఆ శాసనసభలో కూడ 22 మంది సభ్యులలో ఎన్నికల ద్వారా వచ్చే సభ్యులు నలుగురే. ఆ నలుగురి ఎన్నిక కూడ జాగీర్దార్లకు, వకీళ్ళకు పరిమితమై ఉండేది గాని సార్వత్రిక వయోజన వోటుహక్కు ఉండేది కాదు. ఇక ప్రభుత్వ అనుమతి లేకుండా సభలు, సమావేశాలు జరుపుకోవడానికి వీలే లేదు.

ఇటువంటి వాతావరణంలో 1921లో హైదరాబాద్ స్టేట్ రిఫారమ్స్ అసోసియేషన్ అనే సంస్థ ఏర్పడి రాజ్యాంగ సంస్కరణల కోసం ఒక మహాసభ జరపడానికి ప్రయత్నించింది. ప్రభుత్వం ఈ సభను నిరోధిస్తూ ఫర్మానా జారీ చేసింది. గ్రంథాలయాల వార్షికోత్సవాలు, వర్తక సంఘాల సభలు, సంఘ సంస్కార సభలు కూడా జరుపుకోవడానికి వీలులేని పరిస్థితులొచ్చాయి. ఈ నేపథ్యంలో ఏర్పడింది ఆంధ్రజన సంఘం. క్రమక్రమంగా ఈ దశాబ్దమే హైదరాబాద్ రాష్ట్రంలో అనేక ప్రజా సంస్థల ఆవిర్భావానికి నాంది పలికింది.

1930ల నుంచి భారత జాతీయ కాంగ్రెస్‌ను స్వదేశీ సంస్థానాలలో నెలకొల్పాలా లేదా అని విస్తృతమైన చర్చ జరుగుతూ వచ్చింది. కాంగ్రెస్‌కు సంస్థానాలలో శాఖలు ఏర్పరచగూడదని, ఆయా ప్రాంతాలలో బాధ్యతాయుత పాలనను కోరే సంస్థలు ఏర్పడవచ్చునని స్వయంగా గాంధీ అన్నాడు. ఈ చర్చ సాగుతుండగానే హైదరాబాద్ రాష్ట్రంలో స్టేట్ కాంగ్రెస్‌ను ఏర్పరచాలని ప్రయత్నాలు మొదలయ్యాయి. రాష్ట్రంలో స్టేట్ కాంగ్రెస్ ఏర్పడకుండా చెయ్యడానికి నిజాం ప్రభుత్వం 1938లో (1348 ఫసలీ) ప్రజా రక్షణ చట్టం తీసుకొచ్చింది. 1908 క్రిమినల్ లా అమెండ్‌మెంట్ ఆక్ట్‌ను అనువర్తింపజేసుకున్న ఈ చట్టం స్టేట్ కాంగ్రెస్‌ను ఏర్పడక ముందే నిషేధించింది.

హైదరాబాద్ రాష్ట్రంలో 'హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్' పేరుతో ఆగస్టులో తాత్కాలిక కమిటీ తరపున ప్రకటన వెలువడింది. ఈ ప్రకటనకు స్పందించి 1,200 మంది స్టేట్ కాంగ్రెస్‌లో సభ్యులుగా చేరారు. సెప్టెంబర్ 9న ఈ సభ్యులందరినీ సమావేశపరిచి లాంఛనంగా స్టేట్ కాంగ్రెస్ ఆవిర్భావాన్ని ప్రకటించాలనుకున్నారు.

కాని నిజాం ప్రభుత్వం సెప్టెంబర్ 7న ఒక ఫర్మాన్ జారీ చేసింది. ఆ ఫర్మాన్ ప్రకారం దస్తూరుల్ అమల్ తహఫుజ్ అమనే ఆమ్ (ప్రజా సంరక్షణ చట్టం) అనేది అమలులో కొచ్చింది. "ఇది ఇంతవరకు బ్రిటిష్ ఇండియాలో అమలులో నున్న క్రిమినల్ లా అమెండ్‌మెంట్ ఆక్ట్ లాంటిదని చెప్పవచ్చును" అని మందుముల నరసింగరావు రాశారు.

సెప్టెంబర్ 9 సమావేశం తాత్కాలిక కమిటీ సభ్యుడు జి.రామాచారి ఇంటిలో జరగవలసి ఉండింది. హైదరాబాద్ కొత్వాల్ సెప్టెంబర్ 7న రామాచారిని పిలిపించి సమావేశం జరిగితే ఇంటిని స్వాధీనం చేసుకుంటామని బెదిరించాడు. సమావేశం వాయిదా పడింది. ప్రధాని అక్బర్ హైదరీ ముఖ్యులను పిలిపించి సమావేశాన్ని రద్దు చేయమని ఆదేశం లాంటి సలహా ఇచ్చాడు. సంప్రదింపులు అట్లా ఎడతెగకుండా సాగుతూ పోయాయి.

స్వామీ రామానంద తీర్థ మాటల్లో చెప్పాలంటే "మేమందరమూ ఆలోచించి నటువంటి రాజకీయ సంస్థ ఆవిర్భవించేటందుకు అధికారులు ఇష్టపడలేదు. దాన్ని వారు ఆదిలోనే తుంచి పారెయ్యాలనుకొన్నట్టున్నారు. ఒక బలమైన పిడికిలి మా తలమీద పడేటందుకు సిద్ధంగా ఉన్న లక్షణాలు కన్పించాయి. మతావేశమూ, భూస్వామ్య తత్వమూ కలిసి గడ్డ కట్టుకుని రూపొందిన నిరంకుశ

ప్రభుత్వాధికారము కొనసాగిస్తున్న సంస్థానంలోని ప్రజలు బాధ్యతాయుత ప్రభుత్వాన్ని సాధించుకొనేటందుకు ఏర్పాటు చేసుకోదలచుకున్న సంఘం అవతరించడాన్ని ఆ ప్రభుత్వం సహించగలదా? అది తమకు సంబంధించిన విషయం కాదన్నట్లు చూస్తూ ఊరుకోగలదా?"

స్టేట్ కాంగ్రెస్ ఒక మత పక్షపాత సంస్థ అని, ప్రజలను మోసగించడానికే భారత జాతీయ కాంగ్రెస్ పేరు పెట్టుకున్నదని నిషేధాజ్ఞలో ప్రభుత్వం ఆరోపించింది. దేశీయ రాజ్యాలలో జరిగే ఆందోళనల్లో తమ పేరు ఉపయోగించగూడదని జాతీయ కాంగ్రెస్ నిర్ణయించినా, హైదరాబాదులో మాత్రం ఆ పేరే ఉపయోగిస్తున్నారని, ఈ పేరు వల్ల అనవసరంగా ఇది జాతీయ కాంగ్రెస్ అనుబంధ శాఖ అనే అభిప్రాయం కలుగుతుందని ప్రభుత్వం వాదించింది. బ్రిటిష్ ఇండియాలో ఉన్నటువంటి ప్రత్యేక పరిస్థితులు హైదరాబాద్ సంస్థానంలో లేనందువల్ల ఈ సంస్థ అవసరం లేదని ప్రభుత్వం ప్రకటించింది.

స్టేట్ కాంగ్రెస్ ఇంకా లాంఛనంగా పుట్టడానికన్న ముందే నిషేధాజ్ఞ పుట్టుకురావడం వల్ల తాత్కాలిక కాంగ్రెస్ కమిటీ సాధ్యమయ్యే ప్రత్యామ్నాయాల గురించి ఆలోచనలు ప్రారంభించింది. సత్యాగ్రహం చేయడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదనే నిర్ణయానికి వచ్చింది. తాత్కాలిక కమిటీ రద్దయి, దాని స్థానంలో కార్యాచరణ కమిటీ ఏర్పాటయింది. ఈ కమిటీకి గోవిందరావు నానల్ అధ్యక్షుడు కాగా, రావి నారాయణరెడ్డి నలుగురు సభ్యుల్లో ఒకరు. 1938 అక్టోబర్ 24న హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ స్థాపించబడిందని ప్రకటించి, సత్యాగ్రహాలు, శాసనోల్లంఘన సాగించాలని నిర్ణయించారు. అనుకున్నట్టుగానే సత్యాగ్రహం జరిగింది గాని, ఈ సత్యాగ్రహాల మీద ప్రభుత్వం నిషేధ చట్టాన్ని ప్రయోగించలేదు. బహిరంగ ప్రదర్శనకు అనుమతి లేదనే కారణం చూపి గస్తీ నిషాన్ 53 కింద నేరారోపణ చేశారు.

ఆ తర్వాత ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌ను హైదరాబాద్ నేషనల్ కాన్ఫరెన్స్‌గా పిలిస్తే నిషేధం ఎత్తివేస్తామనే ప్రతిపాదన వచ్చింది. కొన్నాళ్ళపాటు నలిగిన తర్వాత ఈ ప్రతిపాదన రద్దయిపోయింది. సుదీర్ఘ చర్చల తర్వాత 1946 జులైలో ప్రభుత్వం స్టేట్ కాంగ్రెస్‌పై నిషేధాన్ని ఎత్తివేసింది. 1947 జూన్‌లో కాంగ్రెస్ తన మొదటి మహాసభను జరుపుకుని కార్యక్రమాలు ప్రారంభించింది.

మళ్ళీ ఈ సందర్భంలోనూ నిషేధాజ్ఞ ప్రజా ఉద్యమాన్ని అణచలేదు సరిగదా, నిజాం పట్ల వ్యతిరేకత ఉద్యమరూపం ధరించడానికి, సంఘటితం కావడానికి దారి తీసింది. స్టేట్ కాంగ్రెస్‌ను సక్రమంగా ఏర్పడక పోనివ్వడం వల్లనే, స్టేట్ కాంగ్రెస్‌లోనూ, హైదరాబాద్ ప్రజా ఉద్యమంలోనూ అతివాద ధోరణులు తలెత్తాయని మందుముల నరసింగరావు అభిప్రాయపడ్డారు. స్టేట్ కాంగ్రెలో స్వామీ రామానంద తీర్థ వంటి తీవ్రవాదులు తలెత్తడమే గాక, స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహోద్యమం నుంచి రావి నారాయణరెడ్డి లాంటి వాళ్ళు కమ్యూనిస్టు రాజకీయాల వైపు వచ్చారు.

ఇక దేశవ్యాప్తంగానూ, తెలంగాణలోనూ కమ్యూనిస్టు రాజకీయాలమీద నిషేధాలకైతే లెక్కలేదు. మొట్టమొదటిసారిగా 1934 జులైలో బ్రిటిష్ ప్రభుత్వం భారత కమ్యూనిస్టు పార్టీని నిషేధించింది. అప్పటికే కమ్యూనిస్టుపార్టీ సభ్యుల మీద మీరట్ కుట్రకేసు రూపంలోను, ఇతర రూపాలలోను నిర్బంధాలు అమలవుతూనే ఉన్నాయి. నిజానికి కమ్యూనిస్టు పార్టీకి దేశవ్యాప్త శాఖలు ఏర్పాటయిందీ, సభ్యత్వం విపరీతంగా పెరిగిందీ నిషేధం తర్వాతనే. ఆంధ్ర కమ్యూనిస్టు కమిటీ (1934) గాని, తెలంగాణలో కామ్రేడ్స్ అసోసియేషన్ (1939)గాని ఏర్పడింది నిషేధకాలంలోనే. భారత కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం అమలవుతుండిన కాలంలో పార్టీ సభ్యులు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో ప్రవేశించారు. తద్వారా భారత జాతీయ కాంగ్రెస్‌తో కూడ సన్నిహిత సంబంధాల్లో ఉన్నారు. 1937-39మధ్య కాలంలో రాష్ట్రాల్లో కాంగ్రెస్ మంత్రి వర్గాలు ఎన్నికయినప్పుడు కమ్యూనిస్టు పార్టీ సెమీ లీగల్‌గా పనిచేయగలిగింది. ఒకవైపు నిషేధంలో ఉంటూనే 1938 జనవరిలో తన సొంత వారపత్రికను ప్రారంభించగలిగింది. 1940 మార్చిలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ తన సభ్యులలోని కమ్యూనిస్టులందరినీ బహిష్కరించింది. రెండో ప్రపంచ యుద్ధకాలంలో యుద్ధం పట్ల కమ్యూనిస్టు పార్టీ వైఖరి మారిన సందర్భంగా ప్రభుత్వం కమ్యూనిస్టులందరినీ జైళ్ళ నుంచి విడుదల చేసింది. కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధాన్ని ఎత్తివేసింది.

అయితే హైదరాబాద్ రాష్ట్రంలో మాత్రం నిజాం ప్రభుత్వం 1946 డిసెంబర్‌లో కమ్యూనిస్టు పార్టీని నిషేధించింది. మొదటి నుంచీ ఆంధ్ర మహాసభ కార్యకలాపాల మీద నిఘా వేసి ఉంచిన ప్రభుత్వం 1944లో ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టు పార్టీకి పర్యాయపదంగా మారిన తర్వాత నిర్బంధకాండను పెంచింది. దాదాపు ఆ సమయంలోనే తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు ప్రారంభమయ్యాయి. భూస్వాముల గూండాలు, నిజాం పోలీసులు మూకుమ్మడిగా ప్రజల మీద దాడులు సాగిస్తూ వచ్చారు. ఈ దాడుల కొనసాగింపుగానే కడివెండిలో 1946 జులై 4న దొడ్డి కొమరయ్య హత్య జరిగింది. తెలంగాణ రైతాంగం సాయుధపోరాటానికి సిద్ధపడింది. ఈ రైతాంగ సాయుధ పోరాటం మీద ప్రభుత్వం నవంబర్‌లో పెద్ద ఎత్తున దమనకాండ సాగించింది. ఈ దమనకాండలో భాగంగానే

కమ్యూనిస్టు పార్టీపై నిషేధం కూడా అమలులోకి వచ్చింది. 1952 చివరి దాకా ఈ నిషేధం తొలగలేదంటే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రధానంగా పార్టీ నిషిద్ధంగా ఉన్నప్పుడే నడిచింది. 1948 సెప్టెంబర్‌లో 'పోలీసు చర్య' జరిగి రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ పాలన ఏర్పడినా పార్టీ మీద నిషేధం తొలగలేదు. నిజానికి ఆ సమయంలో మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్ర ప్రాంతంలో కూడ పార్టీమీద కొత్తగా నిషేధం అమలులోకి వచ్చింది. టంగుటూరు ప్రకాశం ముఖ్యమంత్రిగా తీసుకొచ్చిన ప్రజా రక్షణ చట్టం కోస్తాంధ్ర జిల్లాల్లో దారుణ దమన కాండకు కారణమైంది. మలబార్ పోలీసులు కోస్తాంధ్ర ప్రజానీకం మీద విచ్చలవిడిగా దాడులు సాగించారు.

తెలంగాణా సాయుధ పోరాటాన్ని ఉపసంహరించుకోవాలనే ఆలోచన, చర్చలు ప్రారంభమైన తర్వాత నిషేధం రద్దు చేయాలనే డిమాండ్ కూడ ఒక ముఖ్యాంశమైంది. ఒకవైపు అంతరంగిక విభేదాల వల్ల, మరోవైపు ప్రభుత్వం అనుసరించిన రెండు నాల్కల వైఖరి వల్ల పార్టీ మీద నిషేధం తొలగిపోకుండానే పార్టీ పోరాటాన్ని ఉపసంహరించుకుంటానని, అయుధాలు స్వాధీనం చేస్తానని ప్రకటించింది. 1951 అక్టోబర్ 21న పోరాట ఉపసంహరణ జరిగినా, ఆయుధ విసర్జన ప్రారంభమైనా వెల్లోడీ నాయకత్వంలోని ప్రభుత్వ, సైనిక బలగాలు పార్టీ మీద, ప్రజల మీద దమనకాండను మానలేదు. నిషేధం తొలగింపు, సాయుధ మిలటరీ బలగాల ఉపసంహరణ, గ్రామాల మీద దాడుల ఆపివేత 1952 జనవరికి కూడ అమలులోకి రాలేదు. 1952 జనవరిలో తెలంగాణలో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ సభ్యులు, సానుభూతిపరులు ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ పేరుతో పోటీ చేశారు. ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఎన్నికల ప్రణాళికలో కూడ నిషేధం ఉపసంహరణ డిమాండ్ ఒక ప్రధానాంశమైంది. ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులు ఘనవిజయం సాధించిన తర్వాత గాని, సుప్రీంకోర్టు ఈ నిషేధాన్ని కొట్టి వేసిన తర్వాత గాని పార్టీ మీద నిషేధం తొలగలేదు.

1947 తర్వాత దేశవ్యాప్తంగా కూడ కేంద్ర ప్రభుత్వం అనేక సంస్థల మీద నిషేధాలు ప్రకటించింది. 1948లో గాంధీ హత్య తర్వాత రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను నిషేధించారు. 1950లో అమలులోకి వచ్చిన రాజ్యాంగంలో 19 (సి) అధికరణం ద్వారా సంస్థల్ని ఏర్పరచుకునే హక్కుకు హామీ దొరికింది గాని సంస్థల మీద నిషేధాల పరంపర మాత్రం కొనసాగింది. 1960లలో నాగా, మిజో ఉద్యమ సంస్థల్ని నిషేధించారు. 1975లో ఎమర్జెన్సీ విధించిన తర్వాత ఆర్.ఎస్.ఎస్., ఆనందమార్గ్ వంటి మత సంస్థలతోపాటు విప్లవ సంస్థల్ని కూడ కలిపి 24 సంస్థల్ని నిషేధించారు. ఎమర్జెన్సీ ఎత్తివేసే వరకు ఈ నిషేధం అమలులో ఉండింది. 1980 దశాబ్దంలో నిషేధాలు మరీ పెచ్చుమీరిపోయాయి. ఒకవైపు దేశవ్యాప్తంగా జాతుల పోరాటాలు, ప్రత్యేక రాష్ట్రాల కోసం పోరాటాలు, రైతాంగ పోరాటాలు పెల్లుబుకుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పోరాటాలను అణచడానికి నిషేధ చట్టాల్ని వాడుకున్నాయి. నిషేధ చట్టాల ఆయుధాగారంలోకి ప్రభుత్వం 1967 చట్ట వ్యతిరేక కార్యకలాపాల చట్టం అనే కొత్త ఆయుధాన్ని సమకూర్చుకుంది. ఈ చట్టం సాయంతోనే ఆల్ ఇండియా సిఖ్ స్టూడెంట్స్ ఫెడరేషన్, జమ్మూ కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్, యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సాం, గూర్ఖా నేషనల్ లిబరేషన్ ఫ్రంట్, మావోయిస్టు కమ్యూనిస్ట్ సెంటర్, మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ సమితి, లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం వంటి అనేక సంస్థలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం నిషేధించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1908 క్రిమినల్ లా అమెండ్‌మెంట్ ఆక్ట్‌ను ఉపయోగించుకుని కోస్తా ఆంధ్ర, రాయల సీమ జిల్లాలలోను, 1938 ఫసలీ ప్రజారక్షణ చట్టాన్ని ఉపయోగించుకుని తెలంగాణ జిల్లాలలోను సిపిఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్ పైన, ఎనిమిది ప్రజా సంస్థల పైన 1992 మే 21న నిషేధాన్ని ప్రకటించింది. ఈ రెండు చట్టాలకు ఎప్పుడో కాలం చెల్లిందని, సుప్రీం కోర్టు వీటిని కొట్టివేసిందని గుర్తించిన తర్వాత జూన్ 24న ప్రజారక్షణ ఆర్డినెన్స్ అనే మరో కొత్త నిషేధ చట్టాన్ని తయారు చేసి ఈ చట్టం సాయంతో కొత్తగా సిపిఐ (ఎం.ఎల్.) పీపుల్స్‌వార్‌పైన, ఆరు ప్రజా సంఘాలపైన నిషేధాన్ని ప్రకటించింది.

నిషేధించే అధికారాలెన్ని వచ్చినా, నిషేధాలెన్ని అమలయినా, పాత నిషేధాజ్ఞలే కొత్త అవతారాలెత్తినా ఇరవయో శతాబ్దపు తొలిదశకానికీ, చివరి దశకానికీ మధ్య భారత చరిత్రలో ప్రజా ఉద్యమాల విస్తృతీ, ఉధృతీ తగ్గలేదు. విప్లవోజ్వల గాథల మీద చీకటి పరచుకోలేదు. శతాబ్ది ఉదయం నుంచీ అస్తమయం దాకా ఆగని పోరాట సంప్రదాయం మీద, ఆరిపోని వెలుగు మీద చీకటి కప్పాలనే విఫల ప్రయత్నాలు ఈ నిషేధాజ్ఞలు.

ఆధారాలు

1. సుమిత్ సర్కార్ - మాడర్న్ ఇండియా 1885-1947, మాక్మిలన్, 1983.
2. రజత్ కాంతరే - సోషల్ కాన్‌ఫ్లిక్ట్ అండ్ పొలిటికల్ అన్‌రెస్ట్ ఇన్ బెంగాల్ 1875-1927, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్, 1983
3. భూపేంద్రనాథ్ దత్త - భారతదేశ ద్వితీయ స్వాతంత్ర్య సంగ్రామం, మార్క్సిస్టు అధ్యయన వేదిక, 1991.
4. స్వామి రామానంద తీర్థ - హైదరాబాద్ స్వాతంత్ర్య పోరాటం- అనుభవాలు, ప్రభాత ప్రచురణ సమితి, 1984.
5. మందుముల నరసింగరావు - 50 సంవత్సరముల హైదరాబాదు, మందుముల నరసింగరావు స్మారక సమితి, 1977.

తాజా కలం : మళ్ళీ నిషేధం

పదమూడు సంవత్సరాల కింద రాసిన ఒక వ్యాసానికి ఇవాళ్టికీ ప్రాసంగికకత ఉంటుందని, ఆ వ్యాసానికి అదనంగా చేర్చవలసిన సమాచారంతో చరిత్ర ముందుకు కదిలి అదే రకమైన పరిణామాలు పునరావృతమవుతాయని నేను ఊహించలేదు. కాని చరిత్ర గమనంలో ఇటువంటి ఘటనలు, పరిణామాలు కొత్త కాదు కనుక ఇందులో పెద్దగా ఆశ్చర్యం లేదు.

గత వ్యాసంలో చివరి పేరాలోని సమాచారానికి అదనంగా కొంత సమాచారం చేర్చవలసి ఉంది. ఆ తర్వాతనే ప్రస్తుత నిషేధం గురించి వివరించడం సాధ్యమవుతుంది. పై వ్యాసంలో చెప్పినట్లు 1992 మే 21న సిపిఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్ పైన, ఎనిమిది ప్రజా సంస్థలపైన నిషేధం విధించడం జరగలేదు. ఆ రోజున రాజీవ్‌గాంధీ మొదటి వర్ధంతి సందర్భంగా విశాఖ పట్నంలో జరిగిన ఒక బహిరంగ సభలో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి ఆ ప్రకటన చేశారు. నిజానికి ఆ ప్రకటన చాల అపసవ్యమైన సమాచారం మీద ఆధారపడి జరిగింది.

మొట్టమొదట, ఆ ముఖ్యమంత్రి ప్రసంగంలో పేర్కొన్న ఎనిమిది సంస్థలలో రెండు సంస్థలు అసలు ఉనికిలోనే లేవు. మహిళా రంగంలోనూ, కార్మిక రంగంలోనూ విప్లవ సంస్థలు ఉండక పోతాయా అన్నంత అనాలోచితంగా అట్లా రెండు సంస్థల పేర్లు చేర్చారు గాని అవి లేవని వెంటనే బయటపడింది. అంత మాత్రమే కాదు, ఆ ప్రకటనలోని ఒక సంస్థ పేరును పోలిన, ఏ రాజకీయాలతోనూ సంబంధంలేని సంస్థ బాధ్యులు వెంటనే పత్రికా సమావేశం ఏర్పాటు చేసి గగ్గోలు పెట్టారు.

రెండవది, అంతకన్న తీవ్రమైన సమస్య మరొకటి వచ్చింది. 1992 మే 21న కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు వర్తించే చట్టం (1908 క్రిమినల్‌లా అమెండ్‌మెంట్ ఆక్ట్ స్థానంలో వచ్చిన ది ఇండియన్ క్రిమినల్‌లా అమెండ్‌మెంట్ (ఆంధ్రప్రదేశ్) (ఆంధ్ర ఏరియా) ఆక్ట్ 1950) కింద, తెలంగాణ ప్రాంతానికి వర్తించే చట్టం (ది ఆంధ్రప్రదేశ్ (తెలంగాణ ఏరియా) పబ్లిక్ సెక్యూరిటీ ఆక్ట్, 1938) కింద ఈ నిషేధం విధిస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. కాని విచిత్రమేమంటే ఈ రెండు చట్టాలనూ 1952లోనే సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఆ చట్టాల కింద ఏ సంస్థనూ నిషేధించడానికి వీలు లేదు.

ఈ అవకతవకలు గుర్తించగానే రాష్ట్రప్రభుత్వం అప్పటికప్పుడు 1992 జూన్ 24న ఆంధ్రప్రదేశ్ ప్రజా రక్షణ ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చింది. ఈ ఆర్డినెన్స్ కిందనే సిపిఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్‌ను, దానితో పాటు ఆరు ప్రజాసంఘాలను 'చట్ట వ్యతిరేకమైనవి'గా ప్రకటించింది. ఈ ఆర్డినెన్స్ స్థానంలో 1992 సెప్టెంబర్ 29న ది ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సెక్యూరిటీ ఆక్ట్ పేరుతో చట్టాన్ని తీసుకువచ్చి, ఈ చట్టం మూడు నెలల ముందునుంచే, 1992 జూన్ 17 నుంచే, అమలులోకి వస్తుందని ప్రకటించింది.

ఈ కొత్త చట్టం కింద చట్ట వ్యతిరేకమైనవిగా ప్రకటించబడిన సంస్థలు: ఆంధ్రప్రదేశ్ రాడికల్ విద్యార్థి సంఘం, ఆంధ్రప్రదేశ్ రాడికల్ యువజన సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం, సింగరేణి కార్మిక సమాఖ్య, అఖిల భారత విప్లవ విద్యార్థి సమాఖ్య (ఎఐఆర్ఎస్ఎఫ్), దండకారణ్య ఆదివాసి కిసాన్, మజ్దూర్ సంఘటన్ (డిఎకెఎంఎస్).

అయితే సిపిఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్ గాని, ఎఐఆర్ఎస్ఎఫ్ గాని, డిఎకెఎంఎస్ గాని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాలనా పరిమితుల అవతల కూడ ఇతర రాష్ట్రాలలో పనిచేస్తాయి. అందువల్ల పబ్లిక్ సెక్యూరిటీ ఆక్ట్‌ను ఏ విధంగా ఉపయోగించగలరనే వాద వివాదాలు సాగాయి. ఈ ఉత్తర్వులను రద్దు చెయ్యాలని దేశవ్యాప్తంగాను, రాష్ట్రవ్యాప్తంలోను నిరసనలు చెలరేగాయి. చట్ట ప్రకారం ఈ ఉత్తర్వులను ఏడాదికేడాదికీ పొడిగిస్తూ పోయారు.

చివరికి 1994 ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే పార్టీపై, ప్రజాసంఘాలకై నిషేధం ఎత్తి వేస్తామని ఎన్‌టి రామారావు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ వాగ్దానం చేసింది. కాని అధికారానికి వచ్చిన తర్వాత, తాను ఎప్పుడూ అటువంటి వాగ్దానం చెయ్యలేదని ఎన్‌టి రామారావు కొన్ని నెలలపాటు తాత్సారం చేశారు. పౌరహక్కుల సంఘాలు, ప్రజలు, రాజకీయ నాయకులు చేసిన డిమాండ్లకు తలఒగ్గి చివరికి 1995 జూన్21న నిషేధపుటుత్తర్వును పొడిగించకుండా ఆపివేశారు. మొదట ఈ ఉపసంహరణ మూడు నెలలపాటు మాత్రమే ఉంటుందని, ఆ తర్వాత ఆయా సంస్థల పనితీరును బట్టి తిరిగి పునరుద్ధరించడమా, ఉపసంహరించడమా తేలుస్తామని అన్నారు. కాని 1996 జూలై 21 వరకు నిషేధం ఉపసంహరణే కొనసాగింది.

చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిత్వంలో 1996 జూలై 21న పాత నిషేధపుటుత్తర్వును యథాతథంగా పునరుద్ధరించడం జరిగింది. ఆ నిషేధం 2004 జూలై 20 వరకు ప్రతి ఏడాది పొడిగించబడుతూ వచ్చింది.

పబ్లిక్ సెక్యూరిటీ ఆక్ట్ కింద నిషేధం అమలయిన తొలి మూడు సంవత్సరాలలోను, ఆ తర్వాత ఎనిమిది సంవత్సరాలలోనూ ఆ ఉత్తర్వులో పేర్కొన్న సంస్థల కన్నా ఎక్కువగా సాధారణ ప్రజానీకం మీదనే ఆ చట్టాన్ని ఉపయోగించుకుని దాడి చేయడం జరిగింది. ఆ ఉత్తర్వులో పేర్కొన్న సంస్థలన్నీ తమంత తామే అజ్ఞాతవాసాన్నో, రహస్య కార్యకలాపాలనో ఎంచుకున్నాయి గనుక నిషేధం వల్ల వాటి మీద కొత్తగా వచ్చిన నిర్బంధం లేదు. నిజానికి చట్టం ప్రకారం అది నిషేధం కూడ కాదు. చట్టంలో ఎక్కడా నిషేధం (బాన్, ప్రొహిబిషన్, ప్రొస్క్రిప్షన్) అనే మాట లేదు. నోటిఫికేషన్ ద్వారా, రాజపత్రం ద్వారా ఒక నిర్దిష్ట సంస్థను చట్టవ్యతిరేక సంస్థగా ప్రకటించడం గురించి మాత్రమే చట్టం చెపుతుంది. ఆ చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం అటువంటి చట్ట

వ్యతిరేకంగా ప్రకటించబడిన సంస్థలో సభ్యులయినా, ఆ సంస్థ సమావేశాల్లో పాల్గొన్నా, ఆ సంస్థకు సహకరించినా శిక్షార్హులవుతారు.

'సంస్థ సభ్యులు' అనే మాట ఎంత నిర్దిష్ట అర్థం ఇస్తుందో 'సమావేశాల్లో, కార్యకలాపాల్లో పాల్గొనడం, సహకరించడం' అనే మాటలు అంత అస్పష్టంగా ఉన్నాయి. అందువల్ల ఆ మాటలను ఏ రకంగానైనా వ్యాఖ్యానించడం సాధ్యమవుతుంది. ఈ అస్పష్టతను, ఇష్టారాజ్యపు వ్యాఖ్యానాన్ని ఉపయోగించుకుని ఈ పదకొండు సంవత్సరాల 'నిషేధ' కాలంలో పోలీసు యంత్రాంగం విచ్చలవిడి నిర్బంధకాండకు దిగింది.

చట్ట వ్యతిరేక సంస్థలుగా ప్రకటించబడిన సంస్థల కార్యకర్తలకు అన్నం పెట్టిన వారిని, ఆశ్రయం ఇచ్చినవారిని, ఏదో ఒక రకంగా సహకరించారని తమకు అనుమానం ఉన్నవారిని పోలీసులు వేధించారు. ఈ వేధింపులు టైలర్లు, టాక్సీ, ఆటో డ్రైవర్లు, డాక్టర్లు వంటి వృత్తుల మీదికి కూడా వ్యాపించింది. వృత్తిధర్మంగా తమ దగ్గరికి వచ్చిన వారెవరో తెలుసుకోనవసరం లేకుండానే దుస్తులు కుట్టిపెట్టినందుకు, ఒక చోటినుంచి మరోచోటికి చేర్చినందుకు, వైద్యం చేసినందుకు వేలాదిమందిని పబ్లిక్ సెక్యూరిటీ ఆక్ట్ కింద నిర్బంధించారు. లేదా ఆ ఆక్ట్ కింద కేసులు పెడతామని బెదిరించి లంచాలు దండుకున్నారు.

ఈ నేపథ్యంలో పబ్లిక్ సెక్యూరిటీ ఆక్ట్ అనేది రాష్ట్రంలోని చాల ప్రాంతాల్లో సాధారణ ప్రజానీకానికి నెత్తి మీద వేలాడే కత్తిగా, పోలీసు యంత్రాంగానికి ఆదాయ వనరుగా, అపరిమిత అధికార సాధనంగా మారిపోయింది.

అందువల్ల పార్టీపై, ప్రజాసంస్థలపై నిషేధం ఎత్తివేసి, పార్టీతో శాంతి చర్చలు జరుపుతామని 2004 ఎన్నికల ప్రణాళికలో కాంగ్రెస్ చేసిన వాగ్దానానికి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. ఆ ఎన్నికలలో కాంగ్రెస్ గెలిచినప్పటి నుంచీ చర్చల ప్రక్రియ వేగం పుంజుకుని, 2004 జులై 21న నిషేధపుటుత్తర్వులను పొడిగించకుండా ఆపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పొడిగించకుండా ఆపివేయడం సరైన సందేశం ఇవ్వదని, ప్రభుత్వ ఉద్దేశ్యం స్పష్టం కాదని, అందువల్ల కనీసం ఒక్కరోజు ముందు అయినా నిషేధపుటుత్తర్వులను ఉపసంహరించుకుంటే బాగుంటుందని పౌరహక్కుల నేతలు, మేధావులు, చర్చల మధ్యవర్తులు ప్రభుత్వానికి సూచించారు. అయినా నిషేధపుటుత్తర్వులను ఉపసంహరించుకోకుండా, అది కాలధర్మం చెందేట్లు చూడడమే ఉచితమని ప్రభుత్వం భావించింది.


అలా పొడిగింపు చేయకుండానూ, ఉపసంహరించుకోకుండానూ ఉన్నందు వల్ల ఏడాది తిరగకుండానే మళ్ళీ ఆ ఉత్తర్వులను అమలులోకి తెచ్చే అవకాశాన్ని ప్రభుత్వం అట్టిపెట్టుకుంది. ఆ అవకాశాన్ని వినియోగించుకుని 2005 ఆగస్ట్ 17న పాత ఉత్తర్వును పునరుద్ధరించడం మాత్రమే కాక, చట్టవ్యతిరేక సంస్థలుగా ప్రకటించిన జాబితాకు విప్లవ రచయితల సంఘం (విరసం) పేరును కూడా కలిపారు. చర్చల సమయంలో సిపిఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్, సిపిఐ (మావోయిస్ట్)గా మారింది గనుక పాత ఉత్తర్వులో ఆ పేరు మార్చారు. అయితే చర్చల కాలంలో ఏడాది పాటు ఎంతో కొంత బహిరంగంగా ఉండినా సిపిఐ (మావోయిస్టు) రహస్య, అజ్ఞాత సంస్థ గనుక ఈ ఉత్తర్వుల వల్ల దాని మీద కొత్తగా రాబోయే నిర్బంధం ఏమీ ఉండదు. గతంలో నిషేధానికి గురయిన ఆరు సంస్థలు పెద్దగా ప్రజాజీవనంలో ఉన్నట్టు దాఖలాలు లేవు గనుక ఈ ఉత్తర్వుల ప్రభావం వాటి మీద కూడ ఉండదు. అంటే తాజా ఉత్తర్వుల వల్ల నిర్బంధమైనా, ఆంక్షలయినా ప్రధానంగా సాధారణ ప్రజానీకం మీద, విరసం మీద మాత్రమే ఉంటాయి.

ఈ ఉత్తర్వు ప్రకటిస్తున్నామని హోం మంత్రి ఆగస్ట్17 సాయంత్రం ప్రకటించగా, ఆగస్ట్ 18 రాత్రినుంచే సంస్థ సభ్యుల మీద, నాయకుల మీద నిర్బంధం మొదలయింది. నిజానికి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సెక్యూరిటీ ఆక్ట్‌లోని సెక్షన్8 ఇటువంటి కేసులు పెట్టే అవకాశం ఉన్నప్పటికీ, సెక్షన్3 నుంచి సెక్షన్ 7 వరకూ అసలు ఒక సంస్థను చట్ట వ్యతిరేక సంస్థగా ప్రకటించే పద్ధతి, ఆ సంస్థకు అభ్యంతరాలు చెప్పుకునే హక్కు, ప్రభుత్వ ప్రకటనను ముగ్గురు హైకోర్టు జడ్జిలతో కూడిన సలహామండలి విచారించి నిర్ధారించడం, ఆ తర్వాత ఆ నివేదికకు లోబడి ప్రభుత్వ చర్యలు వంటి విధివిధానాలు ఎన్నో ఉన్నాయి. ఈ విధివిధానాలు పూర్తయ్యేవరకూ చర్యలు ఆపాలా, తీసుకోవచ్చునా అనే అంశం చట్టంలో అస్పష్టంగా ఉన్నప్పటికీ, ఈ విధివిధానాలలో సంస్థకు బాధ్యత వహిస్తూ, ప్రాతినిధ్యం వహిస్తూ పాల్గొనవచ్చునని ఉంది గనుక, విధివిధానాలు పూర్తయ్యే వరకూ సంస్థ ప్రతినిధుల మీద చర్యలు తీసుకోవడానికి వీలు లేదని వ్యాఖ్యానించవచ్చు.

ప్రపంచవ్యాప్తంగా నిరంకుశ, నియంతృత్వ ప్రభుత్వాలెన్నో ప్రజా సంస్థల మీద, ప్రజా ఆకాంక్షలను వ్యక్తీకరించే మేధావుల మీద ఆంక్షలు విధించిన చరిత్ర ఉంది. కాని తమను తాము ప్రజాస్వామికమని చెప్పుకునే ప్రభుత్వాలు కేవలం సాయుధ సంస్థల మీదనే ఆంక్షలు విధించాయి తప్ప, 1992-2004 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో జరిగినట్టుగా విద్యార్థి, యువజన, రైతుకూలీ, గని కార్మిక సంఘాల మీద నిషేధాలు విధించలేదు. ఆ చరిత్రే అప్రజాస్వామికమైనదనుకుంటే, ఒక సాహిత్య, సాంస్కృతిక సంస్థను కూడ చట్ట వ్యతిరేక సంస్థగా ప్రకటించి, రాష్ట్ర ప్రభుత్వం మరింత అప్రజాస్వామికంగా ప్రవర్తించింది. భావ ప్రకటనా స్వేచ్ఛ మీద ఆటంకాలు విధించగూడదని ఎన్నో జాతీయ, అంతర్జాతీయ ఒడంబడికలు, చట్టాలు, ప్రజాస్వామిక సంప్రదాయాలు తెలియజెపుతున్నా రాష్ట్రప్రభుత్వం ఈ చర్యకు పాల్పడింది. ❑

అగ్ర రాజ్యాల కిరాయి గూండాలు

(జాన్ పెర్కిన్స్ రచన కన్ఫెషన్స్ ఆఫ్ యాన్ ఎకనామిక్ హిట్‌మాన్ ముందుమాట)



ప్రపంచ దేశాలనుండి వేలకోట్ల డాలర్లను అక్రమంగా దారిమళ్ళించేవారినే ఎకనామిక్ హిట్ మాన్ (ఇహెచ్ఎమ్) అంటారు. వరల్డ్ బ్యాంక్, అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి ఏజెన్సీ (యుఎస్ఎఐడి), ఇతర విదేశీ రుణ సంస్థల నుండి డబ్బును కొన్ని బహుళ జాతి కంపెనీలకు, కొద్దిమంది ధనవంతుల జేబుల్లోకి తరలించడమే ఈ ఎకనామిక్ హిట్‌మాన్ బాధ్యత. ఇలా చేయడానికి వారికి సహకరించే ఉపకరణాలు - అబద్ధపు ఆర్థిక రిపోర్ట్‌లు, ఎలక్షన్ల రిగ్గింగ్, లంచాలు, బలవంతపు వసూళ్ళు, వ్యభిచారం, హత్యలు. వందల ఏళ్ళక్రింద మొదలుపెట్టబడిన సామ్రాజ్యవాదపు దుష్టక్రీడ ఈ కొత్త భయంకరమైన రూపంలో ఇప్పుడు ప్రదర్శితమవుతోంది.

నాకు తెలుసు నేనొక ఎకనామిక్ హిట్‌మాన్‌ను!

1982లో నేను రాయతలపెట్టిన 'ఒక ఆర్థిక ఏజెంట్ అంతరంగం' అనే పుస్తకపు తొలిమాటలు అవి. ఆ పుస్తకం ఇద్దరు దేశాధినేతలకు అంకితం ఇవ్వబడింది. నేను ఎంతో గౌరవించే ఆ ఇద్దరూ జైమెరోల్డోస్, ఈక్వెడార్ దేశాధ్యక్షుడు, ఒమర్ టోరిజోస్, పనామా దేశాధ్యక్షుడు. ఇద్దరూ విమాన ప్రమాదాల్లో మరణించారు. వారి మరణాలు ప్రమాదవశాత్తూ జరిగినవి కావు. బహుళజాతి కంపెనీలు, అగ్రరాజ్యాలు, బ్యాంకుల అధిపతుల సామ్రాజ్యవాద కాంక్షలను వ్యతిరేకించినందుకు వాళ్ళు దారుణంగా చంపబడ్డారు. మాబోటి ఆర్థిక ఏజెంట్లు వారిని మా వ్యూహాల్లో ఇరికించలేక పోవడంతో మా తరువాత రంగప్రవేశం చేసే సిఐఏ తోడేళ్ళ చేతిలో హతమయ్యారు వారిరువురూ.

ఈ పుస్తకం రాయొద్దని చాలా ఒప్పించారు నన్ను. గత ఇరవై ఏళ్ళ కాలంలో కనీసం నాలుగుసార్లయినా ఈ పుస్తకం రాయడం మొదలుపెట్టాను. ప్రతీసారీ ఏదో ఒక ప్రపంచ పరిణామం నన్ను రాయమని పురిగొల్పేది - కానీ బెదిరింపులో, లంచాలో నన్ను కట్టిపడేసేవి.

2003లో ఒక అంతర్జాతీయ కార్పొరేషన్‌చే నడపబడుతున్న ఒక ప్రచురణకర్త ఈ పుస్తకం చిత్తు ప్రతిని చదివాడు.

'ఇది ప్రపంచానికి తప్పకుండా తెలియజెప్పాల్సిన కథ' అన్నాడు. కానీ వెంటనే కాస్త బాధగా 'మా బాస్‌లు దీనికి ఒప్పుకోరు. మీరు దీన్ని కల్పిత నవలగా రాయండి. అప్పుడు ఏ జాన్‌లీకారీ లేక గ్రాహమ్ గ్రీన్ నవలలానో దీన్ని మార్కెట్ చేయొచ్చు'.

కానీ ఇది కల్పిత కథ కాదు. ఇది నా జీవితపు యదార్థ గాథ. బహుళజాతి కార్పొరేషన్ చేతిలో లేని ఓ ధైర్యమున్న ప్రచురణకర్త పుణ్యమా అని నాకు దీన్ని మీతో పంచుకునే వీలు కలిగింది.

ఈ కథను తప్పకుండా చెప్పాలి. ఎందుకంటే మనమిప్పుడు ఎదుర్కొంటున్న సంక్షోభాలూ, అసలు పరిష్కారం కానరాని సమస్యలెన్నిటికో కారణాలు వున్నాయి ఈ కథలో. మనం ఇన్నాళ్ళూ చేసిన తప్పిదాలు ఏమిటో తెలుసుకుంటేనే కదా వాటిని సరిదిద్దుకునే వీలు కలిగేది! సెప్టెంబర్ 11, ఇరాక్‌పై దాడి ఇవన్నీ ఎందుకు జరిగాయో తెలుసుకోవాలంటే మనమీ కథ చదవాలి. సెప్టెంబర్ 11 దాడిలో చనిపోయిన మూడు వేల మందితో పాటు సరైన పోషకాహారం లేక ప్రతిక్షణం చనిపోతున్న ఇరవై నాలుగువేల మంది గురించి కూడా తెలుసుకోవాలి మనం.

చరిత్రలోనే మొదటిసారిగా మానవాళి ఎదుర్కొంటున్న అనేక సమస్యలు తీర్చగల వనరులు, అధికారం వున్నాయి ఓ అగ్ర రాజ్యానికి... నేను ఆర్థిక ఏజెంట్‌గా పనిచేసింది కూడా ఆ దేశానికే. ఆ దేశం పేరు అమెరికా.

ఇన్నాళ్ళూ మౌనంగా వుండి ఇప్పుడే ఈ పుస్తకం రాయడానికి కారణం మాత్రం మా అమ్మాయి జెస్సికా. ఈ పుస్తకం గురించి నా భయాలను తనతో చెప్పినపుడు 'మన భావితరాలకోసమైనా ఈ పుస్తకం రాయాలి. ఒకవేళ నీకేమైనా హాని జరిగితే నేనా కార్యం పూర్తిచేస్తాను నాన్నా' అని భరోసా ఇచ్చింది తను.

ఈ పుస్తకం యదార్థ సంఘటనల సమాహారం. ఇందులో పాత్రలూ పాత్రధారులూ నిజమైనవారు. నేను నా ఉద్యోగంలో భాగంగా రాసుకున్న నోట్సు, రాసిన వ్యాసాలూ, ఇతరులు రాసిన వ్యాసాలూ, వేరే రచయితలు రాసిన పుస్తకాల్లోంచి కొంత సమాచారం, ఇలా రకరకాల పద్ధతులలో నేను సేకరించిన విషయాలన్నిటినీ గుదిగుచ్చితే ఈ పుస్తకం తయారైంది.

'మిమ్మల్ని నిజంగానే ఎకనామిక్ హిట్ మ్యాన్ అంటారా?' అని మా ప్రచురణ కర్త అడిగాడోసారి. అది నూటికి నూరుపాళ్ళు నిజమైన పదమే. 1971లో నేను ఉద్యోగంలో చేరిన కొత్తలో నా గురువుగా ఉన్న క్లాడిన్ అనే మహిళ మొదటిసారిగా చెప్పింది నేను ఒక ఎకనామిక్ హిట్‌మాన్‌గా నియమించబడ్డానని. 'ఇది అత్యంత రహస్యమైన ఉద్యోగం. నీ భార్యకు కూడా నీ ఉద్యోగ స్వరూపం తెలియకూడదు' అని షరతు విధించింది తను.

తెలివి, అందం కలబోసినట్టుండే క్లాడిన్ నన్ను చాలా చక్కగా ఉపయోగించుకుంది. నా బలహీనతలను ఎలా సొమ్ము చేసు

కోవాలో బాగా పసిగట్టింది తను. నన్ను నియమించిన వ్యవస్థ ఎంత సంక్లిష్టమైనదో తనను చూస్తే అర్థమయ్యేది.

తను ఏదీ దాచేది కాదు. "అమెరికా ప్రయోజనాలు నెరవేర్చే ఒక వ్యవస్థలో ప్రపంచ దేశాధినేతలను భాగం చేయడమే నీ పని. కొన్నాళ్ళకి ఆ దేశాలను అప్పుల వలయంలో చిక్కేటట్లు చేసి వారిని బానిసలుగా మార్చాలి. మన ఆర్థిక, రాజకీయ, సైనిక అవసరాలు తీర్చే బంట్లుగా వారిని మార్చేయాలి. సాయం చేసినందుకు, వారి వారి దేశాల్లో వారి పదవులు నిలబెట్టుకునేందుకు, ప్రజలకు చూపించేందుకు పారిశ్రామికపార్కులు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలూ, విమానాశ్రయాలూ నిర్మించబడాలి. అమెరికన్ ఇంజనీరింగ్ నిర్మాణ రంగ సంస్థల ఖజానా కూడా నిండాలి".

ఆ దారితప్పిన విధానాల ఫలితాలే ఇవ్వాళ మన ముందున్నది. ఆసియన్ దేశాల కార్ఖానాలలో బానిసల్లా వేతనాలకు మనుషులతో పనిచేయించుకుంటున్నాయి మన గౌరవప్రదమైన కంపెనీలు.

ఫలితంగా ఇప్పుడు మానవాళి ఒక భారీ వినియోగయంత్రంగా రూపాంతరం చెందింది. దీన్ని నడపడానికి అవసరమయ్యే ఇంధన అవసరం నానాటికీ ఎక్కువై చివరకు అది తనను తానే మోసేసే దశకు చేరుకుంది. ఇవ్వాళటి ప్రపంచంలో విజేతలు తమ బంగళాలు, పడవలు, జెట్ విమానాలతో మిగతా ప్రపంచానికి రోల్ మోడల్స్‌గా నిలబెట్టబడ్డారు. ప్రతిక్షణం వినియోగం, వినియోగం, వినియోగం.

భూమిపై వున్న వనరులను ఎంత కొల్లగొట్టి వినియోగిస్తే అంత ఆర్థిక ప్రగతి అనే ప్రచారం భారీయెత్తున సాగుతున్నది.

అట్లాంటి ప్రగతిని ఈ వ్యవస్థ సాధించడానికి మాలాంటి ఎకనామిక్ హిట్‌మన్లకు భారీ జీతాలు ఇవ్వబడుతున్నాయి.

ఒకప్పుడు అయితే మాలాంటివాళ్ళు కొద్దిమందే వుండేవాళ్ళు. కానీ ఇప్పుడో! బోలెడంతమంది వున్నారీ వృత్తిలో. కాకపోతే వారిపేర్లు కొంచెం మర్యాదకరంగా వుంటాయి. మోన్‌సాంటో, జనరల్ ఎలక్ట్రిక్, నెకి, జనరల్ మోటర్స్, వాల్‌మార్ట్ ఇలాంటి బహుళజాతి కంపెనీల కారిడార్లలో వారు కనబడతారు.

ఇది మనందరి కథ

దీన్ని మనం మార్చలేకపోతే ఈ ప్రపంచం కథ ఎక్కడో ముగిసిపోతుంది. సామ్రాజ్యాలు ఎల్లకాలం కొనసాగవు. చరిత్ర గతిలో అవి కొంతకాలం తర్వాత పతనమే అయ్యాయి. మనలో మార్పు రావాలనే ఈ పుస్తకం రాయబడింది. కొద్దిమంది ధనంలో ఓలలాడి అత్యధికులు పేదరికంలో మగ్గిపోయే వ్యవస్థ మారాలంటే మనమేం చేయాలో ఆలోచించాలి.

సమానత్వం, ప్రజాస్వామిక దృక్పథం అనే పథంవైపు మనం నడవవలసిన అవసరం వుంది నేడు. చేసిన తప్పులు ఒప్పుకోవడం పరిష్కార మార్గంలో తొలి అడుగు. సమసమాజం దిశగా మానవాళి వేసే అడుగులకు ఈ పుస్తకం స్ఫూర్తి కావాలని ఆశిస్తున్నాను. ❑

కొత్త పుస్తకాలు



వివిధ సామాజిక, మానవ శాస్త్రవేత్తల దృష్టిలో కులం (తులనాత్మక అధ్యయనం)- ఉర్సులా శర్మ, **అనుసరణ:** యం. సంజీవరెడ్డి - **ప్రచురణ:** లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్, - 112 పేజీలు, వెల రు. 35.



మార్క్సిస్టు - లెనినిస్టు తత్వశాస్త్రం - విద్యార్థుల కొరకు సిద్ధాంత పటాలు, పట్టికలు, వివరణలు. **అనువాదం:** సి.పటేల్, **ప్రచురణ:** లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్, - 168 పేజీలు, వెల రు. 90. ఈ రెండు పుస్తకాలు **ప్రతులకు:** లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్, రాధాకృష్ణమూర్తి, ఇం.నెం.5-85-4/బి, 1 వ లైను, పండరీపురం, గుంటూరు-522002.



తెలంగాణ రాష్ట్రం - అవశ్యకత వ్యూహం ఎత్తుగడ - గాదె ఇన్నయ్య (ఇన్నారెడ్డి) (చర్లపల్లి జైలు నుండి)- **ప్రచురణ:** తెలంగాణ స్టడీ ఫోరం, 48 పేజీలు, వెల రు. 15.



ఏది విధ్వంసం? ఎవరు విధ్వంసకారులు? - గాదె ఇన్నయ్య (ఇన్నారెడ్డి) (చర్లపల్లి జైలు నుండి)- **ప్రచురణ:** తెలంగాణ స్టడీ ఫోరం, 48 పేజీలు, వెల రు. 15. ఈ రెండు పుస్తకాలు **ప్రతులకు:** గాదె ఇన్నయ్య, ఫ్లాట్ నం.78, శుభోదయ కలనీ, కూకట్‌పల్లి, హైదరాబాద్-500 072

వీక్షణం చందాదారులుగా చేరండి!
వీక్షణం ను మిత్రులకు పరిచయం చేయండి!

తెలుగు నాట విలక్షణమైన ఆర్థిక, సామాజిక పత్రిక 'వీక్షణం' ను రెండు సంవత్సరాలకు పైగా ఆదరించి పోషిస్తున్న మిత్రులందరికీ 'వీక్షణం' సంపాదకవర్గం వినమ్రంగా ధన్యవాదాలు తెలుపుతోంది. అయితే తెలుగుసీమలో రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాల విశ్లేషణ కోసం ప్రజలలో, పాఠకులలో, ఆలోచనా పరులలో వ్యక్తమవుతున్న తహతహకూ, ఆ ఆసక్తిని తీర్చడంలో 'వీక్షణం' చేస్తున్న కృషికీ మధ్య చాల అంతరం ఉంది. ఆ అంతరం పూడాలంటే 'వీక్షణం' కు పాఠకుల నుంచే ఇతోధిక సహకారం అందాలి. 'వీక్షణం' చందాదారుల సంఖ్య కనీసం మూడురెట్లు పెరిగితే గాని, 'వీక్షణం' తన ముందు పెట్టుకున్న కర్తవ్యాలను తీర్చడం సాధ్యం కాదు. అంటే 'వీక్షణం' పాఠకులలో ప్రతి ఒక్కరూ తమ చందాలను క్రమం తప్పకుండా పునరుద్ధరించుకోవడంతో పాటు, కనీస మరొక ముగ్గురు మిత్రులకు 'వీక్షణం' ను పరిచయం చేసి చందాలు కట్టించాలి.

'వీక్షణం' చందాదారులుగా చేరండి!
మీ మిత్రులను 'వీక్షణం' చందాదారులుగా చేర్పండి!
ఇది వీక్షణం కు సాయం కాదు, తెలుగు సమాజం తన గురించి తాను
తెలుసుకోవడానికి చేసే అన్వేషణకు సాయం!

వీక్షణం విడిప్రతి రు. 10, సంవత్సర చందా రు. 120, దశాబ్ది చందా రు. 1,000

చందాలు కింది చిరునామాకు ఎం.ఓ./డి.డి. ద్వారా పంపవచ్చు.

వీక్షణం, సిడిఆర్‌సి, మైత్రి రెసిడెన్సీ,
3-6-394, స్ట్రీట్ నం.3, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029.

మీలోని రచయితను వెలికి తీయండి!
వీక్షణం మీ రచన కోసం వేచి చూస్తోంది!

మీ చుట్టూ, మీ గ్రామంలో, మీ బస్తీలో, మీ పని స్థలంలో, మీరు పనిచేసే సంఘంలో ఏదో ఒక ఘటన మిమ్మల్ని కదిలిస్తుంది. మీలో ఆలోచనలు రగిలిస్తుంది. ఆ ఘటన వెనుక ఉన్న సామాజిక, రాజకీయ, ఆర్థిక మూలాల గురించి మీరు అన్వేషిస్తుంటారు. మీ ఆలోచనలను రాయండి. సరిగ్గా 'వీక్షణం' ఎదురు చూస్తున్నది అటువంటి క్షేత్ర నివేదికల కోసమే. 'వీక్షణం' ఆర్థిక, సామాజిక పత్రిక తెలుగు సమాజం తన గురించి తాను చేసుకునే ఆలోచనలకు, అన్వేషణలకు ఒక వేదిక. మీరు అట్టడుగు నుంచి, మీ అనుభవాల నుంచి పంపే నివేదికలు ఆ ఆలోచనల్లో, అన్వేషణల్లో భాగమే.

'వీక్షణం' ను ఇటు క్షేత్ర నివేదికల, అటు నిపుణుల విశ్లేషణల మేలు కలయికగా తీర్చిదిద్దాలని సంపాదకవర్గం ప్రయత్నిస్తోంది. మన జీవితాల మీద ప్రగాఢ ప్రభావం వేయగల అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ పరిణామాల మీద నిపుణుల విశ్లేషణలు ఎంత అవసరమో, ఆ పరిణామాలు అట్టడుగు మనుషుల జీవన సరళిని ఎట్లా మారుస్తున్నాయో కింది నుంచి నివేదించడమూ అంతే అవసరం.


వీక్షణం మీ పత్రిక వీక్షణం మన పత్రిక

వీక్షణం తెలుగు సమాజం తన గురించి తాను చేసుకునే అన్వేషణ. ఆ అన్వేషణలో భాగం పంచుకోండి.

రచనలు పంపవలసిన చిరునామా:

సంపాదకుడు, వీక్షణం, సి.డి.ఆర్.సి, మైత్రి రెసిడెన్సీ,
3-6-394, స్ట్రీట్ నం.3, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029.

RNI Regn. No. APTEL/2003/11482 Postal Regn. No. LII/RNP/H-HD-1029/2004-06



R.O.No. 226/Sou/Advt.I/2005

Owned, Printed and Published by V. Hanumantha Rao at 301, Mythri Residency, 3-6-394, Road No.3, Himayat Nagar, Hyderabad - 500 029. Ph : 55843495. Printed at Charita Impressions, Azamabad, Hyderabad. For Nutan Art Printers, Hyderabad. Editor : N. Venugopal

VEEKSHANAM
301, Mythri Residency,
3-6-394, Road No.3, Himayatnagar, Hyderabad - 500 029.